ఆంధ్రజ్యోతి



బాపట్ల జిల్లా వార్తలు

1 బుధవారం 5 జూన్ 2024



గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఆనందబాబు, వేగేశన నరేంద్రవర్మ

కూటమి.. జయహో



విజయచిహ్నం చూపుతున్న వేగేశన, కృష్ణప్రసాద్



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న అనగాని సత్యప్రసాద్



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఏలూరి సాంబశివరావు



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఎంఎం కొండయ్య

- **జిల్లా మొత్తం టీడీపీ క్లీన్‌స్వీప్**
- వైసీపీపై కసి తీర్చుకున్న ఓటర్లు
- రికార్డు మెజారిటీలతో సత్తా చాటిన అభ్యర్థులు
- బాపట్ల లోక్‌సభ సహా ఆరు స్థానాల్లో జయకేతనం
- రెండు దశాబ్దాల తర్వాత బాపట్లలో టీడీపీ గెలుపు
- పర్చూరు, రేపల్లెలో హ్యాట్రిక్.. వేమూరులో మూడోసారి
- అద్దంకిలో గొట్టిపాటి వరుస విజయాల రికార్డు కొనసాగింపు

బాపట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఓటింగ్‌కు పోటెత్తిన ఓటర్లు.. కూటమి అభ్యర్థులపై అభిమానం చాటారు. మంగళవారం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంల లెక్కింపులో కూటమి ప్రభంజనం కనిపించింది. రాష్ట్రానికి అమరావతి రాజధాని లేకుండా చేసిన వైసీపీపై జిల్లా ఓటర్లు కసి తీర్చుకున్నారు. బాపట్ల లోక్‌సభ సహా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలను కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. జిల్లాలో సైకిల్ జోరుతో ఫ్యాన్ రెక్కలు విరిగిపోయాయి. ఓట్ల ప్రభంజనంతో తిరుగులేదని టీడీపీ అభ్యర్థులు నిరూపించారు. జిల్లాల విభజన అనంతరం ప్రస్తుత జిల్లాలో ప్రప్రథమంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ సత్తా చాటింది. కక్ష సాధింపులు, బెదిరింపులు, ఓట్ల మాయ వరకు వైసీపీ కుయుక్తులు ప్రజా చైతన్యం ముందు నిలబడలేదు. మెజార్టీలలో రికార్డులు బద్దలు కొడుతూ కూటమి అభ్యర్థులకు ప్రజలు పట్టం కట్టారు. దాదాపు రెండు దశాబ్దాల నుంచి టీడీపీ విజయమెరుగని బాపట్ల అసెంబ్లీ స్థానంలో రికార్డు మెజారిటీని ఓటర్లు అందజేశారు. పర్చూరు, రేపల్లెలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మరోమారు జై కొడుతూ హ్యాట్రిక్ విజయాన్ని అందించారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబును ముచ్చటగా మూడోసారి అసెంబ్లీకి పంపించారు. అద్దంకిలో తన వరుస విజయాల రికార్డును గొట్టిపాటి రవికుమార్ నిలబెట్టుకున్నారు. చీరాల అసెంబ్లీ బరిలో ఎం ఎం కొండయ్య తొలి ప్రయత్నంలోనే విజయ దుందుభి మోగించారు. బాపట్ల పార్లమెంట్ స్థానంలో మాజీ ఐపీఎస్ అధికారి తెన్నేటి కృష్ణప్రసాద్ ఘన విజయం సాధించారు.

తొలి రౌండ్ నుంచే ఆధిక్యం...

ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ మొదలుకాగా 8:30కు ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభమైంది. తొలి రౌండ్ నుంచే ప్రతి నియోజకవర్గంలో స్పష్టమైన ఆధిక్యాన్ని టీడీపీ అభ్యర్థులు కనబరిచారు. ఒక్క వేమూరులో మాత్రం తొలి 5 రౌండ్లు పాటు టీడీపీ, వైసీపీల మధ్య మెజారిటీ దోబూచులాడింది. తర్వాత రౌండ్ నుంచి టీడీపీ అభ్యర్థి నక్కా ఆనందబాబు తన ఆధిక్యాన్ని కనబరిచారు. బాపట్ల అసెంబ్లీ స్థానంలో మొత్తం 15 రౌండ్లలో కౌంటింగ్ జరగ్గా 3, 8 రౌండ్లలో మాత్రమే స్వల్ప ఆధిక్యాన్ని వైసీపీ కనబరిచింది. మిగిలిన అన్ని రౌండ్లలోనూ టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ పైచేయి కనబరిచారు. రేపల్లె, పర్చూరు, అద్దంకి, చీరాలలో తొలి రౌండ్ నుంచి తమ ఆధిక్యాన్ని కనబరిచారు

అత్యధిక మెజారిటీ రేపల్లెదే...

రేపల్లె అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ 40,018 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాల్లో ఇదే అత్యధిక మెజారిటీ. ఇక వరుసగా నాలుగు పర్యాయలుగా ఓటమి పాలవుతూ వస్తున్న బాపట్ల స్థానంలో ఈ దఫా ఏకంగా 27,768 ఓట్ల మెజారిటీతో వేగేశన నరేంద్రవర్మ గెలుపొందారు. 1994 ఎన్నిక తర్వాత బాపట్ల స్థానంలో ఇదే అత్యధిక మెజారిటీగా నిలిచింది. చీరాలలో ఎంఎం కొండయ్య 20,558 ఓట్ల మెజార్టీతో విజయం సాధించగా, 24,138 ఓట్లతో పర్చూరులో ఏలూరి సాంబశివరావు, అద్దంకిలో గొట్టిపాటి 24,890 ఓట్లతో వరుసగా ఐదో సారి అసెంబ్లీలో అడు గుపెట్టనున్నారు. 21,923 ఓట్ల మెజారిటీతో వే మూరులో నక్కా ఆనందబాబు మూడో సారి విజయం సాధించారు.

ఫలితాలివ్వని జిమ్మిక్కులు..

ఓటమి నుంచి తప్పించుకోవడానికి వైసీపీ సరిగ్గా ఎన్నికలకు మూడు నెలల ముందు నుంచి రకరకాల జిమ్మిక్కులు చేసింది. వేమూరు నుంచి గెలిచి మంత్రిగా ఉన్న మేరుగ నాగార్జున దోపిడీ పతాక స్థాయికి చేరుకోవడంతో ఆయన్ను పొరుగు జిల్లా ప్రకాశానికి పంపించి ఇక్కడ వరికూటి అశోక్‌బాబును రంగంలోకి దింపింది. మార్పు వ్యూహాన్ని అమలు చేసి ఓటర్లను ఏమార్చాలని చూసినా వేమూరు ఓటర్లు వైసీపీ సమర్థంగా తిప్పికొట్టారు. రేపల్లెలో సామాజిక ఎత్తుగడకు తెరతీసి టీడీపీ అభ్యర్థి అనగానికి తొలి నుంచి అండగా ఉంటున్న సొంత సామాజిక ఓట్లను చెల్లాచెదురుచేసి రాజకీయ ప్రయోజనం పొందాలనే కుట్రకు వైసీపీ తెర లేపగా ఓటర్లు చెంప చెళ్లుమనిపించేటట్లుగా జిల్లాలోనే అత్యధికమెజారిటీని అనగానికి కట్టబెట్టారు. అద్దంకి, పర్చూరులోనూ అభ్యర్థుల మార్పు విషయంలో అనేక జిమ్మిక్కులకు వైసీపీ పాల్పడినా ఆ పాచిక లేవీ పారకపోగా ఆ రుస్థానాల్లోనూ టీడీపీ విజయం సాధించింది.



గొట్టిపాటి రవికుమార్

కౌంటింగ్ కేంద్రం నుంచి పలాయనం..

పదింటికే కూటమిదే హవా అని ట్రెండ్ అని తెలియడంతో వైసీపీ అభ్యర్థులు మధ్యలోనే పలాయనం చిత్తగించారు. టీడీపీ అభ్యర్థులకు రౌండ్‌రౌండ్‌కు మెజారిటీలు పెరుగుతుండడంతో గెలుపుపై ఆశలు వదిలేసుకుని విషాద వదనంతో కౌంటింగ్ కేంద్రాలను విడిచారు. బాపట్ల అసెంబ్లీ స్థానం పదో రౌండ్ కౌంటింగ్ సాగుతుండగానే వైసీపీ అభ్యర్థి కోన రఘుపతి వెళ్లిపోయారు. బాపట్ల ఎంపీ వైసీపీ అభ్యర్థి నందిగం సురేష్‌తో పాటు వేమూరు, రేపల్లె అభ్యర్థులు కూడా మధ్యలోనే కౌంటింగ్ కేంద్రాన్ని వీడారు.

తొలిసారి అసెంబ్లీకి..

తొలిసారి ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలోకి దిగిన ఇద్దరినీ విజయం వరించింది. పూర్తి ప్రతికూలతల నడుమ పార్టీ పగ్గాలు చేపట్టి చీరాల నుంచి బరిలో నిలిచిన ఎంఎం.కొండయ్య ఒకరు కాగా ఏళ్ల తరబడి సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో పరపతిని పెంచుకుని రాజకీయ ఎదుగుదలకు సోపానాలు వేసుకున్న బాపట్ల నుంచి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా గెలుపొందిన వేగేశన నరేంద్రవర్మ మరొకరు. కొండయ్య 2009లో టీడీపీ తరపున ఒంగోలు పార్లమెంట్ బరిలో నిలిచి పరాజయం పాలయ్యారు. మారిన రాజకీయ పరిస్థితుల్లో 2022లో చీరాల ఇన్‌చార్జిగా పార్టీ పగ్గాలు చేపట్టిన ఎంఎం.కొండయ్య టీడీపీని విజయతీరాలకు చేర్చడంలో సఫలీకృతులయ్యారు. ముక్కోణపు పోటీ జరిగిన చీరాలలో 20,558 ఓట్ల భారీ ఆధిక్యంతో కొండయ్య గెలుపొంది తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు. బాపట్ల అసెంబ్లీ నియోజక వర్గంలో వరుసగా నాలుగు పర్యాయలుగా టీడీపీ ఓటమి చవిచూస్తూనే ఉంది. సామాజిక సమీకరణాల పరంగా కూడా ఈసీటు టీడీపీ ఖాతాలోకి వెళ్లడం కష్టమని రాజకీయ మేధావులు సైతం అంచనా వేస్తూ వచ్చారు. కానీ వీటన్నింటినీ పటాపంచలు చేస్తూ తొలి ప్రయత్నంలోనే 27,768 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి అసెంబ్లీలోకి వేగేశన నరేంద్రవర్మ అడుగుపెట్టనున్నారు



కలెక్టర్ నుంచి గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కృష్ణప్రసాద్

ప్రశాంతంగా ముగిసిన కౌంటింగ్

బాపట్ల: బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం ఉదయం 8గంటలకు ప్రారంభమైన కౌంటింగ్ ప్రక్రియ భారీ బందోబస్తు మధ్య సాయంత్రానికి పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్‌లు పర్యవేక్షించారు. కంట్రోల్ రూమ్ నుంచి జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలను ఎస్పీ పర్యవేక్షించారు.

పటిష్ట బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు

కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లేదారులన్నీ ఉదయం నుంచే పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు.గడియార స్తంభం దగ్గర ఓ దశ తనిఖీలు చేపట్టిన పోలీసులు తర్వాత ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రెండు చోట్ల సోదాలు నిర్వహించిన తర్వాతనే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించారు. పార్టీల ఏజెంట్లకు కేవలం ఐడీ కార్డు మాత్రమే మంజూరు చేశారు. కానీ పోలీసులు ఫాం18 అడగడంతో పోలీసులతో ఏజెంట్లు వాగ్వాదానికి దిగారు. అవి ఉన్న వారిని మాత్రమే అనుమతిస్తామని పోలీసులు చెప్పడం, తర్వాత సంబంధిత అధికారుల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది

పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు సాయంత్రం వరకు..

ఉదయం 8 గంటలకు మొదలైన పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. 8:30కు ఈవీఎంలు ఓపెన్ చేసినప్పటికీ సమాంతరంగా పోస్టల్ కౌంటింగ్‌ను అధికారులు కొనసాగించారు. తొలుత ఈవీఎంల రౌండ్‌ల ఫలితాలనే అధికారులు విడుదల చేశారు. తర్వాత పోస్టల్ ఫలితాలను తెలిపారు. రేపల్లె నియోజకవర్గ పరిధిలోని మూడు ఈవీఎంలు సాంకేతిక కారణాలతో మొరాయించడంతో వాటిని పక్కన బెట్టి కౌంటింగ్ కొనసాగించారు. సాయంత్రం వాటిని టెక్నికల్ నిపుణుల సాయంతో తెరిచి కౌంటింగ్ చేపట్టారు



కౌంటింగ్ కేంద్రాల్లో కలెక్టర్, ఎస్పీ



గెలుపు ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న నరేంద్ర, నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్

సైకిల్ జోరు

- ఆరు చోట్ల టీడీపీ, ఒక చోట జనసేన గెలుపు
- 3,44,695 ఓట్ల భారీ మెజార్టీతో పెమ్మసాని చంద్రశేఖర్ విజయఢంకా

గుంటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఓటింగ్‌కు పోటెత్తిన ఓటర్లు.. కూటమి అభ్యర్థులపై అభిమానం చాటారు. మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈవీఎం లను లెక్కించగా కూటమి ప్రభంజనం కనిపించింది. రాష్ట్రానికి అమరావతి రాజధాని లేకుండా చేసిన వైసీపీపై గుంటూరు జిల్లా ఓటర్లు కసి తీర్చుకున్నారు. గుంటూరు లోక్‌సభ సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. జిల్లాలో సైకిల్ జోరుతో ఫ్యాన్ రెక్కలు విరిగిపోయాయి. ఓట్ల ప్రభంజనంతో తిరుగులేదని టీడీపీ, జనసేనలు నిరూపించుకున్నాయి. జిల్లాల విభజన అనంతరం ప్రస్తుత గుంటూరు జిల్లాలో ప్రప్రథమంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి సత్తా చాటింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, లోక్‌సభ స్థానాన్ని భారీ మెజార్టీలతో కూటమి దక్కించుకున్నది. ఏ ఒక్క రౌండ్ లోనూ వైసీపీ అభ్యర్థులు పోటీలో నిలబడలేక పోయారు. తెనాలిలో జనసేన గ్లాసు మిలమిల మెరిసిపోయింది. రాష్ట్రంలోనే అత్యధిక ఓట్ల మెజార్టీ సాధించిన ఎంపీలలో పెమ్మసాని చంద్రశేఖర్ రెండో స్థానంలో నిలిచి చరిత్ర సృష్టించారు. తాడికొండ అసెంబ్లీ సెగ్మెంట్‌లో టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌కు 39,606, తెనాలిలో జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కు 48,112, గుంటూరు తూర్పులో షేక్ నసీర్ అహ్మద్ 31,962, పశ్చిమలో 51,160, పొన్నూరులో 32,915, ప్రత్తిపాడులో 42,015, మంగళగిరిలో 91,413 ఓట్ల మెజార్టీతో టీడీపీ, జనసేన అభ్యర్థులు భారీ మెజార్టీలతో గెలుపొందారు. ఇవన్ని లెక్కిస్తే 3 లక్షల 37 వేల 183 ఓట్ల మెజార్టీగా ఉంది. అయితే గుంటూరు లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కి ఇంతకంటే ఎక్కువగా 3,44,695 ఓట్ల మెజార్టీ లభించింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే పెమ్మసానికి 7,512 ఓట్లు అధికంగా లభించాయి.



గుంటూరులో సంబరాలు

అమరావతిలో సంబరాలు

నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతిలో రైతుల సంబరాలు అంబరాన్ని తాకాయి. రాజధాని మహా స్వప్నాన్ని చిదిమేసిన అధికార వైసీపీ నేలమట్టం కావడం, టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి కనీవినీ ఎరుగని ఏకపక్ష విజయాన్ని సొంతం చేసుకోవడంతో రాజధాని రైతులు, మహిళల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఐదేళ్ల క్రితం వారికి దూరమైన ఆనందం తిరిగి వారి మోముల్లో చిగురించింది. ఎన్నికల ఫలితాలు మొదలైన కొద్ది సేపటికే రాజధాని గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది. చిన్నా, పెద్ద ముసలి ముతక అంతా ఒక్కటై సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఎవరికి వారే తమ ఇళ్ల ముందు టపాసులు పేల్చి ఆనందం వ్యక్తం చేస్తూ వీధుల్లోకొచ్చి టపాసులు కాలుస్తూ, సీట్లు పంచుకుంటూ సందడి చేశారు. ఓట్ల లెక్కింపు మొదలైన అరగంట నుంచే 29 గ్రామాల్లో సం బరాలు మొదలయ్యాయి. పోలీసు ఆంక్షలు ఉన్నప్పటికీ వందలాదిమంది రైతులు, రైతు కూలీలు, మహిళలు ఆయా గ్రామాల్లోని రాజధాని రైతుల దీక్షా శిబిరాల వద్దకు ఉదయాన్నే చేరుకుని భారీ ఎల్ ఈడీ స్క్రీన్లలో ఫలితాలను చూస్తూ సంబరాలు మొదలు పెట్టారు. గంట గంటకు ఆ విజయ పరంపర పెరుగు తుండడంతో వారిలో ఉత్సాహం రెట్టిస్తూ పోయింది.



గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న మాధవి, నసీర్



గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి శ్రావణ్‌కుమార్, రామాంజనేయులు

అయ్యో.. జొకో

గాయంతో ఫ్రెంచ్ ఓపెన్ నుంచి అవుట్

సెమీస్‌కు గాఫ్, స్వియటెక్



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో అనూహ్య పరిణామం. 25వ గ్రాండ్‌స్లామ్ వేటలోనున్న పురుషుల డిఫెండింగ్ చాంప్, వరల్డ్ నెంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ టోర్నీ నుంచి వైదొలిగాడు. కుడి మోకాలి గాయం కారణంగా జొకో క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ ఆడడం లేదని నిర్వాహకులు మంగళవారం ప్రకటించారు. ఫ్రాన్సిస్కోతో జరిగిన ప్రీక్వార్టర్స్ పోరును అతికష్టమ్మీద నెగ్గిన జొకోవిచ్.. ఆ మ్యాచ్‌లో పలుమార్లు ఇబ్బందిపడ్డాడు. ఈ క్రమంలో నొప్పితోనే ఆ మ్యాచ్‌ను కొనసాగించిన జొకో.. చివరకు ఐదుసెట్ల పాటు పోరాడి గట్టెక్కాడు. మ్యాచ్ తర్వాత ఎమ్ఆర్ఐ స్కానింగ్ తీయించగా, గాయమైనట్టు బయటపడింది. దీంతో జొకోతో క్వార్టర్‌ఫైనల్స్‌లో తలపడాల్సిన కాస్పర్ రూడ్ వాకోవర్‌తో నేరుగా సెమీఫైనల్ చేరాడు. క్వార్టర్స్‌కు ముందే నిష్క్రమించడంతో జొకోవిచ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తన నెంబర్‌వన్ స్థానాన్ని రెండోసీడ్ జానిక్ సిన్నర్‌కు కోల్పోనున్నాడు. ఇక, సిన్నర్ 6-2, 6-4, 7-6(3)తో దిమిత్రోవ్‌ను చిత్తుచేసి సెమీఫైనల్‌కు దూసుకెళ్లగా.. జ్వెరెవ్ 4-6, 6-1, 5-7, 7-6(2), 6-2తో హోల్గర్ రూన్‌ను ఓడించి క్వార్టర్స్ చేరాడు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ స్వియటెక్, మూడోసీడ్ కొకొ గాఫ్ సెమీఫైనల్లో అమీతుమీకి సిద్ధమయ్యారు. క్వార్టర్‌ఫైనల్స్‌లో స్వియటెక్ 6-0, 6-2తో ఐదోసీడ్ వొంద్రుసోవాను ఓడించగా.. గాఫ్ 4-6, 6-2, 6-3తో 8వ సీడ్ జెబ్యూర్‌పై విజయం సాధించింది.

వేటకు వేళాయె!


రోహిత్

టీ20 ప్రపంచకప్‌లో తొలి పోరుకు భారత్ సై

నేడు ఐర్లాండ్‌తో ఢీ

రాత్రి 8 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

న్యూయార్క్: భారత క్రికెట్ అభిమానులంతా ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న తరుణం రానేవచ్చింది. టీ20 ప్రపంచకప్ గ్రూప్ 'ఎ'లో భాగంగా బుధవారం తమ తొలి మ్యాచ్‌ను ఐర్లాండ్‌తో ఆడనుంది. 2007లో తొలి ప్రపంచకప్‌ను అందుకున్నాక భారత జట్టుకు ఈ మెగా టోర్నీ ఊరిస్తూనే ఉంది. కెప్టెన్ రోహిత్, విరాట్ కోహ్లీలాంటి అనుభవజ్ఞులు.. సూర్యకుమార్, పంత్, బుమ్రాలాంటి యువ ఆటగాళ్ల సహకారంతో ఈసారైనా కప్‌ను ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. ఇక తాజా టోర్నీలో చిన్న జట్లు అద్భుతంగా పోరాడుతున్న సమయంలో ఐర్లాండ్‌ను తక్కువగా అంచనా వేయడానికి లేదు. అలాగే ఈ జట్టుకు గతంలో పెద్ద జట్లకు షాకిచ్చిన అనుభవం కూడా ఉంది. ఆసీస్‌లో జరిగిన చివరి వరల్డ్‌కప్‌లో ఈ జట్టు ఇంగ్లండ్‌ను ఓడించింది. అలాగే ఇటీవల పాక్‌ను కూడా మట్టికరిపించింది. బల్బిర్నీ, స్టిర్లింగ్, వికెట్ కీపర్ టక్కర్‌లతో పాటు పేసర్ జోషువా లిటిల్ జట్టులో కీలక ఆటగాళ్లు. అటు స్థానిక నసౌ కౌంటీ క్రికెట్ స్టేడియంలో డ్రాప్ ఇన్ పిచ్ ఎలా స్పందిస్తుందనేది ఇరు జట్లకు సవాల్‌గా మారింది. ఐపీఎల్ మాదిరి ఇక్కడ బ్యాటర్లు చెలరేగుదామనుకుంటే బోర్లా పడక తప్పదు. మంగళవారం దక్షిణాఫ్రికా-శ్రీలంక మధ్య జరిగిన మ్యాచ్ ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఐర్లాండ్‌తో ఆడిన ఏడు టీ20ల్లోనూ భారత్ గెలిచింది.

ఓపెనింగ్ ఎవరో?: ఈ టోర్నీలో భారత్ ఓపెనర్లుగా ఎవరిని బరిలోకి దింపుతారనేది చర్చనీయాంశంగా మారింది. కోచ్ ద్రవిడ్ ఈ విషయమై స్పష్టత ఇవ్వకపోయినా.. రోహిత్‌కు జతగా కోహ్లీని ఆడించే అవకాశం ఉంది. అలా జరిగితే జైస్వాల్ బెంచీకే పరిమితమవుతాడు. ఐపీఎల్ ఫామ్‌ను విరాట్ ఇక్కడా కొనసాగిస్తే జట్టుకు లాభమే. వికెట్ కీపర్‌గా పంత్ ఆడడం ఖాయమే. సూర్యకుమార్‌తో పాటు శివమ్ దూబే, హార్దిక్ మిడిలార్డర్‌లో రానున్నారు. ఇక్కడి పిచ్ స్పిన్‌కు అనుకూలించనుండడంతో లెఫ్టామ్ స్పిన్నర్లు జడేజా, అక్షర్‌లతో పాటు కుల్దీప్‌ను సైతం ఆడించనున్నారు. అయితే బుమ్రాకు జతగా రెండో పేసర్‌గా సిరాజ్, అర్ష్‌దీప్‌లలో ఎవరిని ఎంపిక చేయాలనే డైలమాలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది. హార్దిక్ మూడో పేసర్‌గా సేవలందించనున్నాడు.


స్టిర్లింగ్

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, పంత్, సూర్యకుమార్, దూబే, హార్దిక్, జడేజా, అక్షర్, కుల్దీప్, బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్.

ఐర్లాండ్: బల్బిర్నీ, స్టిర్లింగ్ (కెప్టెన్), టక్కర్, టెక్టర్, కాంఫర్, డాకెరెల్, డిలానీ, అడెయిర్, మెక్‌కార్తి, యంగ్, లిటిల్.

పిచ్, వాతావరణం: పిచ్ స్పందనపై అనిశ్చితి కొనసాగుతోంది. చివరి మ్యాచ్‌లో శ్రీలంక 77 పరుగులకు కుప్పకూలింది. అటు సఫారీలు కూడా ఇబ్బందిపడ్డారు. స్పిన్, పేస్‌కు కూడా అనుకూలించడం సానుకూలాంశం.

ప్రణయ్‌కు రజావత్ షాక్

'ఇండోనేసియా'లో గాయత్రి జోడీ ముందంజ

జకార్తా: ఇండోనేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ హెచ్ఎస్ ప్రణయ్‌కు చుక్కెదురైంది. భారత్‌కే చెందిన యువ ఆటగాడు ప్రియాన్షు రజావత్ 21-17, 21-12తో మాజీ వరల్డ్ నెంబర్‌వన్ ప్రణయ్‌కు షాకిచ్చి రెండోరౌండ్ చేరాడు. మరో ఆరంభ రౌండ్ పోరులో లక్ష్యసేన్ 21-12, 21-17తో కెంటా సునెయామ (జపాన్)ను ఓడించాడు. ఇతర భారత షట్లర్లలో మహిళల డబుల్స్ ద్వయం గాయత్రి/ట్రీసా జాలీ, మిక్స్‌డ్ జోడీ సుమిత్/సిక్కి రెడ్డి ప్రత్యర్థులపై గెలిచి రెండోరౌండ్లో ప్రవేశించారు.

విహారికి ఎన్‌ఓసీ!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రంజీ జట్టు ఎంపికపై ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)-క్రికెటర్ హనుమ విహారి మధ్య గత సీజన్‌లో జరిగిన వివాదం గుర్తుందిగా! అప్పటి నుంచి తాను వేరే రాష్ట్రానికి ఆడతానని, ఇందుకోసం ఎన్‌ఓసీ (నిరభ్యంతర పత్రం) ఇవ్వాలంటూ రెండు నెలల్లో విహారి నాలుగుసార్లు ఈమెయిల్స్ పంపించినా స్పందించని ఏసీఏ.. ఏపీలో ఎన్నికల ఫలితాల్లో వైసీపీ పార్టీ ఘోరంగా ఓడడంతో ఒక్కసారిగా దిగొచ్చింది. ఈనెల 3వ తేదీన ఎన్‌ఓసీ జారీ చేసినట్టు లేఖ తయారు చేసి, విహారికి పంపించింది. కాగా, ఏపీ ఎన్నికల్లో గెలిచిన ఎన్డీఏ కూటమికి 'ఎక్స్'లో అభినందనలు తెలిపిన విహారి.. 'కర్మ ఎవరినీ ఉపేక్షించదు' అని పోస్టు చేయడం గమనార్హం.

ఐదేసిన ఫరూఖీ

- అఫ్ఘానిస్థాన్ శుభారంభం
- 125 పరుగులతో ఉగాండా చిత్తు



ప్రావిడెన్స్ (గయానా): టీ20 వరల్డ్‌కప్‌ను అఫ్ఘానిస్థాన్ ఘన విజయంతో ఆరంభించింది. రహ్మానుల్లా గుర్బాజ్ (76), ఇబ్రహీం జద్రాన్ (70) అర్ధశతకాలతోపాటు పేసర్ ఫజల్‌హక్ ఫరూఖీ (5/9) ఐదు వికెట్లతో విజృంభించడంతో.. గ్రూప్-సిలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో అఫ్ఘాన్ 125 పరుగుల తేడాతో ఉగాండాను చిత్తు చేసింది. తొలుత అఫ్ఘాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 183 పరుగులు చేసింది. కాస్మాస్, మసాబా చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఉగాండా 16 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూలింది. రాబిన్సన్ ఒబుయా (14), రియాజత్ అలీ షా (11) మాత్రమే డబుల్ డిజిట్ స్కోర్లు చేశారు. రషీద్, నవీనుల్ చెరో 2 వికెట్లు తీశారు.

బిజినెస్

మదుపరి షాక్.. సూచీలు షేక్



'పోల్' పంచ్‌కు రక్తమోడిన దలాల్‌స్ట్రీట్

- ఒకదశలో 6,234 పాయింట్లు పతనమై 70,000 స్థాయికి జారుకున్న సెన్సెక్స్
- చివరికి 4,390 పాయింట్ల నష్టంతో 72,079 స్థాయి వద్ద ముగిసిన సూచీ
- ఇంట్రాడేలో నిఫ్టీ దాదాపు 2,000 పాయింట్లు డౌన్
- చివర్లో 1,379 పాయింట్ల నష్టంతో 21,885 వద్ద క్లోజ్
- గడిచిన నాలుగేళ్లలో ఇదే అతిపెద్ద మార్కెట్ పతనం
- ఒకదశలో దాదాపు రూ.40 లక్షల కోట్ల సంపద ఉఫ్
- రూ.31 లక్షల కోట్ల నష్టంతో రూ.394.83 లక్షల కోట్లకు పడిపోయిన బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్

ముంబై: లోక్‌సభ ఎన్నికల ఫలితాలు స్టాక్ మార్కెట్‌ను భారీగా కుదిపేశాయి. ఎన్డీఏకు సీట్లు 300 కంటే తగ్గడంతోపాటు బీజేపీకి పూర్తి మెజారిటీ లభించకపోవడం మార్కెట్ వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇన్వెస్టర్లు అమ్మకాలు పోటెత్తించడంతో మంగళవారం సూచీలు కుప్పకూలాయి. నాలుగేళ్లలో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. దాంతో ఎగ్జిట్ పోల్స్ జోష్‌తో సోమవారం ఆర్జించిన లాభాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఒకదశలో 6,234.35 పాయింట్ల (8.15 శాతం) వరకు క్షీణించి దాదాపు 5 నెలల కనిష్ఠ స్థాయి 70,234.43 వద్దకు పడిపోయింది. ఆ తర్వాత కాస్త కోలుకున్న సూచీ.. చివరికి 4,389.73 పాయింట్ల (5.74 శాతం) నష్టంతో రెండు నెలలకు పైగా కనిష్ఠ స్థాయి 72,079.05 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 1,982.45 పాయింట్లు (8.52 శాతం) పతనమై 21,281.45 వద్దకు పడిపోయింది. ట్రేడింగ్ నిలిచేసరికి సూచీ 1,379.40 పాయింట్ల (5.93 శాతం) నష్టంతో 21,884.50 వద్ద స్థిరపడింది. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ విధించడంతో 2020 మార్చి 23న సెన్సెక్స్, నిఫ్టీ 13 శాతం మేర క్షీణించాయి. ఆ తర్వాత సూచీలకు ఇదే అతిపెద్ద ఒక్కరోజు నష్టం. అమ్మకాల సునామీలో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.31 లక్షల కోట్లకు పైగా హరించుకుపోయి రూ.394.83 లక్షల కోట్లకు (4.73 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. ఒకదశలోనైతే మార్కెట్ సంపద దాదాపు రూ.40 లక్షల కోట్ల మేర ఆవిరైంది.

మోదీ సర్కారు హయాంలో నిఫ్టీ అతిపెద్ద నష్టాలు

తేదీ	నష్టం పాయింట్లు	నష్టం శాతం
2024 జూన్ 4	1,379.40	5.93
2022 ఫిబ్రవరి 22	531.95	3.06
2021 నవంబరు 26	509.80	2.91
2021 ఏప్రిల్ 12	524.05	3.53
2021 ఫిబ్రవరి 26	568.20	3.76
2020 మార్చి 23	1,135.20	12.98
2020 మార్చి 16	757.80	7.61
2020 మార్చి 12	868.25	8.30
2020 మార్చి 9	538.00	4.90

మరిన్ని ముఖ్యాంశాలు..

- ఎన్నికల ఫలితాలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అనుగుణంగా లేకపోవడంతో ఇన్వెస్టర్లు ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, పవర్, యుటిలిటీస్, ఎనర్జీ, ఆయిల్ అండ్ గ్యాస్, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో భారీగా లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. పలు ప్రభుత్వ రంగ షేర్లు పరిమితికి మించి పతనమవడంతో వాటిల్లో ట్రేడింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది.
- సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 27 నష్టపోయాయి. ప్రభుత్వ రంగ ఎన్‌టీపీసీ షేరు 15 శాతానికి పైగా క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఎస్‌బీఐ, ఎల్ అండ్ టీ, పవర్‌గ్రిడ్ సైతం రెండంకెల స్థాయిలో నష్టపోయాయి. ఎఫ్ఎంసీజీ రంగ దిగ్గజం హెచ్‌యూఎల్ మాత్రం 6 శాతం లాభపడి సెన్సెక్స్ టాప్ గెయినర్‌గా నిలిచింది. నెస్లే ఇండియా 3 శాతానికి పైగా పెరిగింది.
- బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 8.07 శాతం క్షీణించగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 6.79 శాతం నష్టపోయింది. ఎఫ్ఎంసీజీ మినహా మిగతా రంగాల సూచీలన్నీ నేలచూపులు చూశాయి. యుటిలిటీస్ 14.40 శాతం, పవర్ 14.25 శాతం పతనమవగా.. ఆయిల్ అండ్ గ్యాస్ 13.07 శాతం, సర్వీసెస్ 12.65 శాతం, క్యాపిటల్ గూడ్స్ 12.06 శాతం, ఎనర్జీ 11.62 శాతం నష్టపోయాయి.
- బీఎస్ఈలో 3,934 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 3,349 కంపెనీల స్టాక్ నష్టాలు చవిచూశాయి. 488 మాత్రం లాభపడ్డాయి. 97 యథాతథంగా ముగిశాయి. కాగా, 292 కంపెనీల షేర్లు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోగా.. 139 ఏడాది గరిష్ఠాన్ని చేరాయి.
- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 37 పైసలు క్షీణించి 83.51 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో అమ్మకాలు పోటెత్తడంతో పాటు అంతర్జాతీయంగా డాలర్ బలపడటం ఇందుకు కారణమైంది.

అదానీ షేర్లు ఢమాల్: నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహిత కార్పొరేట్ ప్రముఖుడిగా పేరున్న గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ షేర్లు మహా పతనాన్ని చవిచూశాయి. ఇంట్రాడేలో అదానీ పోర్ట్స్ 25 శాతం వరకు క్షీణించింది. పలు కంపెనీల షేర్లు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. దాంతో గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ సంపద ఒక్కరోజులోనే రూ.3.64 లక్షల కోట్లు తగ్గి రూ.15.78 లక్షల కోట్లకు పడిపోయింది.

పీఎస్‌యూ స్టాక్స్ పరేషాన్: ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూ), ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల(పీఎస్‌బీ) షేర్లు భారీగా కుదేలయ్యాయి. ఆర్ఈసీ షేరు ఏకంగా 24.07 శాతం క్షీణించగా.. పీఎఫ్‌సీ 21.62 శాతం, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 19.43 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ 19.21 శాతం, ఓఎన్‌జీసీ 16.23 శాతం, కోల్ ఇండియా 13.54 శాతం, ఎన్‌టీపీసీ 14.52 శాతం నష్టపోయాయి. దాంతో నిఫ్టీ పీఎస్ఈ ఇండెక్స్ 16.38 శాతం పతనమై 9,475 స్థాయికి జారుకుంది. పీఎస్‌బీలదీ అదే పరిస్థితి. యూనియన్ బ్యాంక్ 17.65 శాతం, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 15.15 శాతం చొప్పున నష్టపోయాయి. కెనరా బ్యాంక్ 13.45 శాతం, ఎస్‌బీఐ 13.37 శాతం తగ్గాయి. దాంతో నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 15.14 శాతం దిగజారి 6,794.25 వద్దకు పడిపోయింది. పీఎస్‌బీలతోపాటు ప్రైవేట్ బ్యాంక్‌లూ భారీ నష్టాలను చవిచూశాయి. దాంతో నిఫ్టీ బ్యాంక్ సూచీ 7.95 శాతం క్షీణించి 46,928.60 వద్దకు జారుకుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,870 ▲	66,800 ▲	98,500 ▲
ముంబై	71,969 ▲	65,924 ▲	88,837 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

5వ తేదీ

హైదరాబాద్	480
వరంగల్	482
చిత్తూరు	563
విజయవాడ	450
గోదావరి	445
విశాఖపట్నం	450

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	147
వరంగల్	147
కరీంనగర్	147
మహబూబ్‌నగర్	147
కర్నూలు	147
విశాఖపట్నం	135
గోదావరి	149
విజయవాడ	149
గుంటూరు	149
ఒంగోలు	149
చిత్తూరు	142
నెల్లూరు	142
అనంతపురం	149



పవన్‌కల్యాణ్‌కు సినీ ప్రముఖుల అభినందనలు

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమితో పొత్తు కుదుర్చుకున్న పవన్ కల్యాణ్.. పిఠాపురంలో ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు జనసేన పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాలలోనూ(21) జయకేతనం ఎగురవేశారు. ఈ నేపథ్యంలో పవన్‌కు పలువురు టాలీవుడ్ సెలబ్రిటీల నుంచి అభినందలు వెల్లువెత్తాయి. "ఎవ్వరికి అందదు అతని రేంజ్.. రెప్ప తెరిచేను రగిలే రివెంజ్" అని పేర్కొంటూ.. 'ఓజీ' టైమ్ బిగిన్స్ అనే ఓ సినిమా పోస్టర్‌ను నిర్మాణ సంస్థ డీవీవీ మూవీస్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. "ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, హీరోలు బాలకృష్ణ, పవన్‌కల్యాణ్, బీజేపీ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరికి హృదయపూర్వక అభినందనలు" అని తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్మాతల మండలి పేర్కొంది. మరోవైపు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకి మోహన్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. "ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇంతటి ఘనవిజయం అందుకున్న నారా చంద్రబాబునాయుడుకు నా హృదయపూర్వక అభినందనలు. మీ పాలనలో రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తుందని .. ఉన్నత శిఖరాలను చేరుకుంటుందని విశ్వసిస్తున్నాను" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఒక అన్నగా గర్వంగా ఉంది



"డియర్ కల్యాణ్ బాబూ ..ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన నిన్ను, తగ్గావని ఎవరు అనుకున్నా అది ప్రజలని గెలిపించటానికే అని నిరూపించిన నిన్ను చూస్తుంటే ఒక అన్నగా గర్వంగా వుంది. నువ్వు గేమ్‌చేంజర్‌వి మాత్రమే కాదు, 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'వి కూడా అని అందరూ నిన్ను కొనియాడుతుంటే నా హృదయం ఉప్పొంగుతోంది.

- చిరంజీవి

హృదయపూర్వక శుభాకాంక్షలు

చిరస్మరణీయమైన విజయం అందుకున్న పవన్ కల్యాణ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు. ప్రజలకు నిరంతరం సేవ చేయాలన్న మీ కృషి, అంకితభావం, నిబద్ధత హృదయాన్ని హత్తుకునేలా ఉంటాయి. మీ కొత్త రాజకీయ ప్రయాణానికి అంతా మంచే జరగాలని కోరుకుంటున్నాను.

- అల్లుఅర్జున్

మీ గెలుపు స్ఫూర్తిదాయకం

రీల్ లైఫ్‌లోనూ.. రియల్ లైఫ్‌లోనూ అసలు సిసలు హీరో అయిన పవన్ కల్యాణ్‌కు అభినందనలు. ఈ గెలుపు కోసం మీరు చేసిన పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకంగా.. ఓ పాఠంలా ఉంది. మీరు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి.

- నాని

చరిత్రను సృష్టించారు

ఓ అభిమానిగా.. ఓ సోదరుడిగా నాకు ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. ఎన్నికల్లో చరిత్రను సృష్టించారు. మీ సత్తాతో కూటమిని నిలబెట్టారు. ఈ విజయానికి మీరు అర్హులు. మీరెప్పటికీ మా పవర్‌స్టారే.

- నితిన్

తగిన ప్రతిఫలం దక్కింది

శుభాకాంక్షలు పవన్ కల్యాణ్. మీ కృషికి, అంకితభావానికి తగిన ప్రతిఫలం దక్కింది.

- కాజల్ అగర్వాల్

ఓం బిర్లా రికార్డ్

» స్పీకర్‌గా చేసి మళ్లీ ఎంపీగా ఎన్నిక

న్యూఢిల్లీ, మే 4: లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన స్పీకర్ ఓం బిర్లా ఓ రికార్డ్ సాధించారు. స్పీకర్‌గా చేసి మళ్లీ లోక్‌సభకు ఎన్నికైన నేతగా నిలిచారు. గత 20 ఏళ్లలో ఈ ఘనత సాధించింది ఓం బిర్లానే. గతంలో కాంగ్రెస్‌కు చెందిన పీఏ సంగ్మా 1996లో లోక్‌సభ స్పీకర్‌గా చేసి, 1998లో మేఘాలయా రాష్ట్రంలోని తురా నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత ఈ ఫీట్ సాధించింది ఓం బిర్లానే. 1999లో ఏపీలోని అమలాపురం నుంచి టీడీపీ తరఫున గెలిచిన జీఎంసీ బాలయోగి లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 2002లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. బాలయోగి అనంతరం స్పీకర్‌గా ఎన్నికైన శివసేన నేత మనోహర్ జోషి.. 2004లో ముంబై నార్త్ సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీచేసి.. కాంగ్రెస్ అభ్యర్థి ఎక్‌నాథ్ గైక్వాడ్ చేతిలో ఓడిపోయారు. 2004లో బోల్‌పూర్ నియోజకవర్గం నుంచి గెలిచిన సీపీఎం నేత సోమ్‌నాథ్ చటర్జీ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 2009లో సీపీఎంతో విభేదాలు రావడంతో ఆయన రాజకీయాల నుంచి నిష్క్రమించారు. 2009లో బిహార్‌లో ససరామ్ నియోజకవర్గం నుంచి గెలిచిన కాంగ్రెస్ సభ్యురాలు మీరా కుమార్ 15వ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆమె ఓడిపోయారు. 2014లో స్పీకర్‌గా ఎన్నికైన బీజేపీ నాయకురాలు సుమిత్రా మహాజన్.. 2019 ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఆ తర్వాత 2019లో స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లా.. ఇప్పుడు మళ్లీ ఎంపీగా గెలిచి రికార్డు సృష్టించారు.

ఇండియా కొంప ముంచిన స్నేహపూర్వక పోటీ!

లేకుంటే కాంగ్రెస్ ఖాతాలో మరికొన్ని సీట్లు

» ఉమ్మడి అభ్యర్థులున్న చోట ఘన విజయం
» హిందీబెల్ట్‌లో ఫలించిన కాంగ్రెస్ వ్యూహం
» మిత్రుల పోటీతో పంజాబ్, బెంగాల్‌లో నష్టం


సురేశ్ గోపి

"బీజేపీని దెబ్బతీయాలంటే.. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలి. మనలో మనం పోటీ పడకూడదు.." గత ఏడాది జూలై 17న బెంగళూరులో జరిగిన ఇండియా కూటమి(40 పార్టీలు) సమావేశంలో సూత్రప్రాయంగా తీసుకున్న నిర్ణయం ఇది..! ఆ తర్వాత ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో ముంబైలో జరిగిన సమావేశంలోనూ ఇదే అంశంపై చర్చ జరిగింది..! క్షేత్రస్థాయిలో మాత్రం కొన్ని రాష్ట్రాల్లో ఇది సాధ్యం కాలేదు. 'స్నేహపూర్వక పోటీ'ని కూటమి పక్షాలు ప్రకటించుకున్నాయి. ఇప్పుడు ఆ స్నేహపూర్వక పోటీలే కూటమి కొంప ముంచాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మిత్రుల మధ్య పోటీతో నష్టం

ఇండియా కూటమిలోని వంచిత్ బహుజన్ అఘాడీ వంటి పలు చిన్న పార్టీలు కొన్ని చోట్ల కాంగ్రెస్‌పై తమ అభ్యర్థులను నిలిపాయి. వీటి ద్వారా కొంత మేర నష్టం జరగ్గా.. కేరళ, పశ్చిమబెంగాల్, పంజాబ్‌లలో మాత్రం పూడ్చలేని నష్టం వాటిల్లింది. 'ఉమ్మడి అభ్యర్థి' నిబంధనకు కట్టుబడి ఉంటే.. కాంగ్రెస్ కూటమికి ఈ మూడు రాష్ట్రాల్లో అదనంగా 11-16 సీట్లు వచ్చి ఉండేవని తాజా ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ స్నేహపూర్వక పోటీ పంజాబ్‌లో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు విజయాన్ని కట్టబెట్టింది. ఖదూర్‌సాహి నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థికి 3.76 లక్షల ఓట్లు రాగా.. అక్కడి ఆప్-కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్ల మొత్తం 5.25 లక్షలకు పైనే..! ఫరీద్‌కోటాలో కూడా 2.96 లక్షలతో ఇండిపెండెంట్ అభ్యర్థి అగ్రస్థానంలో నిలవగా.. అక్కడ కాంగ్రెస్, ఆప్‌కు వచ్చిన ఓట్ల మొత్తం 3.8 లక్షలు. బఠిండాలో శిరోమణి అకాలీదళ్ 3.75లక్షలతో విజయం సాధించగా.. అక్కడ కూడా ఆప్-కాంగ్రెస్‌లకు వచ్చిన ఓట్ల సంఖ్య 5.25 లక్షలు. పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమిలోని టీఎంసీ, కాంగ్రెస్, సీపీఎం పరస్పర పోటీ వల్ల 8-10 సీట్లలో బీజేపీ పాగా వేసింది. ఇక్కడ కూడా బీజేపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లతో పోలిస్తే.. విడివిడిగా కూటమికి వచ్చిన ఓట్ల సంఖ్య చాలా ఎక్కువ కావడం గమనార్హం.! కేరళలోని త్రిషూర్ నియోజకవర్గం నుంచి నటుడు, బీజేపీ అభ్యర్థి సురేశ్‌గోపీ ఘనవిజయం సాధించారు. అక్కడ కమ్యూనిస్టులకు, కాంగ్రెస్‌కు వచ్చిన మొత్తం ఓట్ల కంటే.. సురేశ్‌గోపీ సాధించిన ఓట్లు దాదాపు 2.06 లక్షల మేర తక్కువ కావడం గమనార్హం. కేరళలో కాంగ్రెస్ గెలిచిన స్థానాల్లో చాలా వరకు కమ్యూనిస్టులే రెండో స్థానంలో ఉన్నారు. అక్కడ విడివిడిగా పోటీచేయకుండా ఉండిఉంటే.. భారీ మెజారిటీ వచ్చేదనేది నిర్వివాదాంశం.

ఆ రాష్ట్రాల్లో గ్రాండ్ సక్సెస్..!

ప్రీపోల్ సర్వేలు మొదలు.. ఎగ్జిట్ పోల్స్ దాకా ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ హవా అంటూ ఫలితాలొచ్చాయి. మంగళవారం నాటి ఫలితాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. 80 స్థానాలున్న యూపీలో ఇండియా కూటమిదే పైచేయి అయ్యింది. 2014లో 77, 2019లో 62 సీట్లను సాధించిన బీజేపీ ఈ సారి 33 స్థానాలకే పరిమితమైంది. ఇందుక్కారణం.. 'ఉమ్మడి అభ్యర్థి' నిబంధనకు కట్టుబడి ఉండడమే..! బీజేపీ అధికారంలో ఉన్న యూపీలో ఈ ప్రయోగంతో గ్రాండ్ సక్సెస్ అయినట్లే. అంతే కాదు.. మహా వికాస్ అఘాడీ పేరుతో ముందు నుంచి కూటమిగా ఉన్న కాంగ్రెస్, ఎన్‌సీపీ(శరద్ వర్గం), శివసేన(ఉద్ధవ్ వర్గం) 48 లోక్‌సభ స్థానాలున్న మహారాష్ట్రలోనూ 'ఉమ్మడి' ధర్మాన్ని పాటించాయి. ఫలితంగా 29 స్థానాల్లో ఘనవిజయం సాధించాయి. రాజస్థాన్, ఝార్ఖండ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లోనూ ఈ ప్రయోగం ఫలించింది. హిందీబెల్ట్‌లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్ మినహా.. ఇండియా కూటమి మంచి ఫలితాలను సాధించింది. గత ఎన్నికల్లో ఈ బెల్ట్‌లో బీజేపీ ఏకపక్ష హవా కొనసాగిన విషయం తెలిసిందే..!

- సెంట్రల్ డెస్క్

భారీగా పుంజుకున్న కాంగ్రెస్

2014, 2019 ఎన్నికలతో పోలిస్తే.. కాంగ్రెస్ ఈసారి పుంజుకుంది. తాజా ఎన్నికల్లో ఆ పార్టీ ఒంటరిగా 99 స్థానాల్లో విజయం సాధించింది. నిజానికి 2014లో 44 సీట్లు.. 2019లో 52 స్థానాలను మాత్రమే సాధించిన కాంగ్రెస్.. లోక్‌సభలో విపక్ష పార్టీ హోదాను కూడా దక్కించుకోలేదు. ఓ దశలో బీజేపీ దూకుడుతో క్రమంగా కాంగ్రెస్ కనుమరుగవుతోందా? అనే అనుమానాలు రాజకీయవర్గాల నుంచి వ్యక్తమైన నేపథ్యంలో.. రాహుల్‌గాంధీ రెండుసార్లు చేపట్టిన 'భారత్ జోడో యాత్ర'లు ప్రజల్లో మళ్లీ ఆదరణను తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా దక్షిణాదిన కేరళలో తిరిగి తన సత్తాను చాటుకోగా.. హిందీబెల్ట్‌లో ఆశించిన స్థాయిలో పురోగతిని నమోదు చేసుకుంది. వచ్చే ఎన్నికల్లోగా ఆ పార్టీ మరింత వేగంగా పుంజుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లోక్‌సభకు రామాయణ్ రాముడు.. రచన.. కంగన..

ఎన్నికల్లో వివిధ పార్టీల తరఫున మెరిసిన తారలు



న్యూఢిల్లీ, జూన్ 4: లోక్‌సభ ఎన్నికల్లో తారలు తళుక్కుమన్నారు. రామానంద్ సాగర్ రామాయణ్‌లో శ్రీరాముడి పాత్రధారి, బాలీవుడ్ నటుడు అరుణ్ గోవిల్ తొలిసారిగా చట్టసభలో అడుగుపెట్టనున్నారు. యూపీలోని మేరఠ్ నుంచి పోటీచేసిన ఆయన ఎస్పీ అభ్యర్థి సునీతా వర్మపై 9,366 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రముఖ సినీనటి, తెలుగులో 'కన్యాదానం', 'మావిడాకులు', 'నేను ప్రేమిస్తున్నాను' వంటి చిత్రాల్లో నటించిన రచనా బెనర్జీ టీఎంసీ తరఫున విజయం సాధించారు. బెంగాల్‌లోని హుగ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆమె 74,048 ఆధిక్యాన్ని సాధించారు. బెంగాల్‌లోని జాదవ్‌పూర్ నుంచి టీఎంసీ నుంచే బరిలో నిలిచిన బెంగాలీ సినిమా, టీవీ నటి సయానీ ఘోష్ 2.50 లక్షల ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థిపై గెలుపొందారు. ఇప్పటికే ఓసారి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించిన ప్రముఖ మలయాళీ నటుడు సురేశ్ గోపీ కేరళలోని త్రిషూర్‌లో విజయం సాధించి, లోక్‌సభలో అడుగుపెట్టనున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి స్థానం నుంచి బీజేపీ నుంచి రేసులో నిలిచిన బాలీవుడ్ నటి కంగనా రనౌత్ 74,755 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈశాన్య ఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసిన భోజ్‌పూరి నటుడు మనోజ్ తివారీ సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి కన్హయ్య కుమార్‌పై 1,22,135 ఓట్ల ఆధిక్యాన్ని సాధించారు. బెంగాల్‌లోని అసన్సోల్ స్థానం నుంచి పోటీ చేసిన సిటింగ్ ఎంపీ, ఈసారి కాంగ్రెస్ తరఫున పోటీచేసిన బాలీవుడ్ సీనియర్ నటుడు శతృఘ్న సిన్హా, బీజేపీ అభ్యర్థి సురేంద్రజీత్‌పై విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి హేమామాలిని యూపీలోని మథుర స్థానం నుంచి 2.91లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రముఖ నటుడు, యూపీలోని గోరఖ్‌పూర్ సిటింగ్ ఎంపీ, రేసుగుర్రం సినిమాలో ప్రతినాయకుడు రవికిషన్(రవీంద్ర శుక్లా).. ఎస్పీ అభ్యర్థి కాజల్ నిషాద్‌పై లక్ష పైచిలుకు ఓట్లతో గెలుపొందారు. బెంగాల్‌లోని ఘటల్ నుంచి పోటీ చేసిన తృణమూల్ సిటింగ్ ఎంపీ, సినీనటుడు దీపక్ అధికారి బీజేపీ అభ్యర్థి హిరణ్మయి చటోపాధ్యాయపై 1.75 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అయితే భోజ్‌పురీ నటుడు, నేపథ్య గాయకుడు పవన్ సింగ్‌కు బిహార్‌లోని కరాకట్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, ఓటమిపాలయ్యారు. యూపీలోని ఆజంఘఢ్ నుంచి భోజ్‌పురీ నటుడు దినేశ్ లాల్ యాదవ్ ఎస్పీ అభ్యర్థి ధర్మేంద్రయాదవ్ చేతిలో 1.6 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయారు. టీవీ నటిగా, మోడల్‌గా గుర్తింపు పొంది రాజకీయాల్లోకి అడుగుపెట్టిన స్మృతీ ఇరానీ.. అమేథీ నుంచి పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో 1.62 లక్షల ఓట్లతో ఓడిపోయారు. తమిళనాడులోని విరుద్‌నగర్ నుంచి బీజేపీ తరఫున పోటీచేసిన నటి రాధిక, అమరావతి నుంచి పోటీ చేసిన నవనీత్‌కౌర్ ఓడిపోయారు.

సందేశ్‌ఖాలీలో బీజేపీ ఓటమి

కోల్‌కతా, మే 4: సందేశ్‌ఖాలీ.. గత కొన్ని రోజులుగా వార్తల్లో విపరీతంగా వైరల్ అయిన స్థానం.. బెంగాల్ బీజేపీ నేతలు ఎక్కువగా ప్రస్తావించిన పేరిది.. ఈ నియోజకవర్గానికి చెందిన ఓ మహిళను టీఎంసీ నాయకులు లైంగికంగా వేధించారంటూ బీజేపీ పలు ఆందోళనలు చేసింది. కానీ, ఇవేవీ లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓట్లను రాల్చలేదు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన బశీర్‌హాట్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో సందేశ్‌ఖాలీ కూడా ఒకటి. ఈ నియోజకవర్గంలో బీజేపీ దారుణ పరాజయాన్ని చవిచూసింది. బీజేపీ అభ్యర్థి రేఖా పాత్రను టీఎంసీ అభ్యర్థి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు హాజీ నూరుల్ ఇస్లాం దాదాపు రెండు లక్షల ఓట్ల తేడాతో ఓడించారు. ఈ సందర్భంగా హాజీ నూరుల్ ఇస్లాం మాట్లాడుతూ.. "నా విజయంతో సందేశ్‌ఖాలీ గురించి ప్రచారం చేసినవన్నీ అబద్ధాలేనని తేలిపోయింది. ప్రజలెవరూ వాటిని నమ్మలేదు. వైరల్ చేసిన వీడియోల వెనుక బీజేపీ పాత్ర ఉందని వారు భావించారు. అందుకే బీజేపీ పన్నిన కుట్రకు నా విజయంతో చక్కటి సమాధానం చెప్పారు" అని అన్నారు.



బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



కేక్ కట్ చేసి ఆనందం పంచుకుంటున్న జనసైనికులు, జనసేననాయకుడు చిలకల సురేంద్రబాబు

పవన్‌కళ్యాణ్, నరేంద్రవర్మ గెలుపుతో జనసైనికుల సంబరాలు

కర్లపాలెం, జూన్ 4 : ఆంధ్రరాష్ట్రంలో పిఠాపురం నుంచి పోటీ చేసిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ భారీ మెజార్టీతో గెలిచిన సందర్భంగా, బాపట్ల బీజేపీ, జనసేన,తెలుగుదేశం ఉమ్మడి కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మలు భారీ మెజార్టీతో గెలవటంతో కర్లపాలెంలోని జనసైనికులు, మండల ఉపాధ్యక్షులు చిలకల సురేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు చేసుకున్నారు. 133వ బూత్ ఆధ్వర్యంలోని జనసైనికులు, టీడీపీ, బీజేపీ నాయకులు, అభిమానులు నరేంద్రవర్మ, పవన్‌కళ్యాణ్‌ల గెలుపు కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కంకిపాటి భోజరాజు, పెనుమెత్స బాపిరాజు, బేతాళం సుబ్బరాజు, వీరాంజనేయులు, పసుపతి, బుర్ల మణికంఠ, భూదేవి గోపి, అన్నవరపు సాయి, బీజేపీ, టీడీపీ,జనసేననాయకులు పాల్గొన్నారు.

నరేంద్రవర్మకు కర్లపాలెం మండలంలో 6,500 మెజార్టీ

కర్లపాలెం,జూన్ 4 : కర్లపాలెం మండలంలో మొట్టమొదటిసారి అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మకు కర్లపాలెం మండల ప్రజలు 6,500 భారీ మెజార్టీని కట్టబెట్టారు. మండలంలో ఇంత భారీ మెజార్టీ కైవశం చేసుకోవటం మొట్టమొదటిసారి అని పార్టీ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఓటర్లు ఉదయం 8గంటలు నుంచే టివిల ముందు కూర్చొని ఎన్నికల ఫలితాలను ఆసక్తిగా వీక్షించారు. ఉమ్మడి కూటమి ప్రారంభం నుంచే దూసుకుపోవటంతో మండలంలోని పలుగ్రామాల కార్యకర్తలు, నాయకులు, అభిమానులు టపాసులు పేల్చుకుంటూ కేక్‌లు కట్ చేసుకొని మిఠాయిలు పంపిణీ చేశారు. మండలంలోని కూటమి అభ్యర్థులు కర్లపాలెం మండలంలో మొట్టమొదటిసారిగా తెలుగుదేశం కూటమి విజయదుంధుబి మోగించటంతో ఆనందం వ్యక్తం చేశారు.



కౌంటింగ్ సందర్భంగా నిర్మానుష్యంగాబాపట్ల-చీరాల రహదారి

ప్రజలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూసిన కేంద్ర, పోలీసు బలగాలు

పిట్టలవానిపాలెం, జూన్ 4 : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా ఆదేశాల మేరకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని మంగళవారం ప్రశాంతంగా నిర్వహించారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఎన్నికల విధులకు హాజరైన కేంద్ర బలగాలు, జిల్లాస్థాయి పోలీసు యంత్రాంగం తమ విధులను ప్రజలు, ప్రయాణికులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా బాపట్ల జిల్లా, నియోజకవర్గంలోని సంబంధిత పోలీసు అధికారులు బాపట్ల మార్కెట్ యార్డు దగ్గర నుంచి చీలురోడ్డు, పాతబస్టాండ్, గడియార స్తంభం కూడలి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కూడలి, కమ్మ కల్యాణమండపం కూడలి, కంకటపాలెం-జమ్ములపాలెం కూడలి వరకు పోలీసు బలగాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. లెక్కింపు జరిగే కేంద్రానికి వివిధ ప్రాంతాలు నుంచి వాహనాల ను 200 మీటర్ల దూరంలో పార్కింగ్ నిర్వహించారు. పోలీసు 30 యాక్ట్, 144 సెక్షన్‌లను మరింత కఠినతరం చేశారు. డీఎస్పీ టి.మురళీకృష్ణ, సీఐలు, పోలీసు సిబ్బంది, బాపట్ల రూరల్, టౌన్, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్‌లకు పోలీసు సిబ్బంది ప్రజలకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా విధులు నిర్వహించారు.

బాపట్ల గడ్డపై.. పసుపు జెండా

● వైసీపీ కోటను బద్దలు కొట్టిన నరేంద్రవర్మ
● రెండు దశాబ్దాల తర్వాత టీడీపీ విజయం

బాపట్ల, జూన్ 4: రెండు దశాబ్దాల కాలం తర్వాత బాపట్ల గడ్డపై తెలుగుదేశం జెండా రెపరెపలాడింది. గత నాలుగు పర్యాయములుగా బాపట్ల నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ ఓటమీ పాలు అవుతూ వచ్చింది. ఈ పర్యాయం టీడీపీ,జనసేన, బీజేపీకూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన వేగేశన నరేంద్రవర్మ వైసీపీ కోటను బద్దలు కొట్టి పాగా వేశారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కార్యక్రమంలో మొదటి రౌండ్ నుంచి నరేంద్రవర్మ అధిక్యత ప్రదర్శిస్తూ వచ్చారు. మొత్తం 15రౌండ్లలో నరేంద్రవర్మకు 88,827 ఓట్లురాగా వైసీపీ అభ్యర్థి కోన రఘుపతికి 62,027 ఓట్లు వచ్చాయి. దీంతో నరేంద్రవర్మకు 26,800 ఓట్ల మెజార్టీ లభించింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో నరేంద్రవర్మకు 1799 ఓట్లు రాగా కోన రఘుపతికి 831 ఓట్లు వచ్చాయి. ఇందులో నరేంద్రవర్మకు 968 ఓట్ల మెజార్టీ లభించింది. మొత్తం 27,768 ఓట్ల మెజార్టీతో నరేంద్రవర్మ విజయం సాధించారు. కాంగ్రెస్‌పార్టీ నుంచి పోటీ చేసిన గంటా అంజిబాబుకు 4,193 ఓట్లు లభించి తృతీయ స్థానంలో నిలిచారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యధిక మెజార్టీతో నరేంద్రవర్మ విజయం సాధించటం పట్ల పార్టీశ్రేణులలో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. పెద్దఎత్తున ఆయనకు అభినందనలు తెలిపారు. నరేంద్రవర్మకు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్ ఎంపిక పత్రాన్ని అందజేశారు.



పార్టీశ్రేణులతో కలిసి ఎంపికపత్రం చూపిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్న వేగేశన నరేంద్రవర్మ

క్రాస్ ఓటింగ్‌లో నరేంద్రవర్మకు మెజార్టీ ఓట్లు

● ఎంపీ అభ్యర్థికి తగ్గిన 7,259 ఓట్లు

బాపట్ల, జూన్ 4 : బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో క్రాస్ ఓటింగ్ చేయటం పరిపాటిగా మారింది. గత ఎన్నికలలో ఇక్కడ ఎమ్మెల్యే అభ్యర్థి కన్న ఎంపీ అభ్యర్థికి మెజార్టీ ఓట్లు ఎక్కువ వచ్చాయి. ఈపర్యాయం ఎంపీ అభ్యర్థి కన్న ఎమ్మెల్యే అభ్యర్థికి మెజార్టీ ఓట్లు ఎక్కువ వచ్చాయి. దీనికి కారణం క్రాస్ ఓటింగ్. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మకు మొదటిరౌండ్‌లో 1394, రెండో రౌండ్‌లో 2,362, నాల్గొవ రౌండ్‌లో 3,161, 5వ రౌండ్‌లో 3,285, 6వ రౌండ్‌లో 3,108, 7వ రౌండ్‌లో 2,339 ఓట్లు, 9వ రౌండ్‌లో 1520 ఓట్లు, 10వ రౌండ్‌లో 2777ఓట్లు, 11వ రౌండ్‌లో 1450 ఓట్లు, 12వ రౌండ్‌లో 1899 ఓట్లు 13వ రౌండ్‌లో 306 ఓట్లు, 14వ రౌండ్ 2610ఓట్లు, 15వ రౌండ్‌లో 1341 చొప్పున మొత్తం 26,800 ఓట్లు మెజార్టీ వచ్చింది. 3వ రౌండ్, 8వ రౌండ్‌లో మాత్రమే వైసీపీకి స్వల్ప మెజార్టీ వచ్చింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో మెజార్టీ 968 లభించింది. కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌కు బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో మెజార్టీ ఓట్లు తగ్గాయి. మొదటి రౌండ్‌లో ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ 870ఓట్ల మెజార్టీ లభించింది. రెండో రౌండ్‌లో 2186 ఓట్ల మెజార్టీ రాగా మూడో రౌండ్‌లో వైసీపీ అభ్యర్థికి 1567 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఈ రౌండ్‌లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి కేవలం 405 ఓట్ల మెజార్టీ మాత్రమే వచ్చింది. నాల్గొవ రౌండ్‌లో తెన్నేటి కృష్ణప్రసాద్‌కు 2621 ఓట్ల మెజార్టీ, 5వ రౌండ్‌లో 3242 ఓట్లు, 6వ రౌండ్‌లో 2603 ఓట్లు, 7వ రౌండ్‌లో 2203 ఓట్ల మెజార్టీ వచ్చింది. 8వ రౌండ్‌లో వైసీపీ అభ్యర్థికి 686 ఓట్ల మెజార్టీ రాగా ఇదే రౌండ్‌లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి 347 ఓట్ల మెజార్టీ వచ్చింది. 9వ రౌండ్‌లో కృష్ణప్రసాద్‌కు 970 ఓట్ల మెజార్టీ, 10వ రౌండ్‌లో 2024ఓట్లు, 11వ రౌండ్‌లో 854ఓట్లు, 19వ రౌండ్‌లో 1485 ఓట్లు వచ్చాయి. 13వ రౌండ్‌లో వైసీపీకి 614 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఇదే రౌండ్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మకు 306 ఓట్ల మెజార్టీ లభించింది.

14వ రౌండ్‌లో 2147 ఓట్ల మెజార్టీ కృష్ణప్రసాద్‌కు లభించింది 15వ రౌండ్‌లో 1202 ఓట్ల మెజార్టీ లభించింది. ఈవిధంగా ఎంపీ అభ్యర్థి కన్న ఎమ్మెల్యే అభ్యర్థికే మెజార్టీ ఓట్లు వచ్చాయి. కేవలం క్రాస్ ఓటింగ్ కారణంగానేనని తెలుస్తుంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా అంజిబాబుకు బాపట్ల నియోజకవర్గంలో 4088 ఓట్లు రాగా ఎంపీ అభ్యర్థి జేడీ శీలంకు 6701 ఓట్లు వచ్చాయి. మొత్తం నియోజకవర్గంలో ఈవీఎం యంత్రాల ద్వారా వచ్చిన ఓట్లలో వేగేశన నరేంద్రవర్మకు బాపట్ల నియోజకవర్గంలో 26800 మెజార్టీ రాగా ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ 19,541 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఈవిధంగా క్రాసింగ్ ఓటింగ్ జరిగింది. ఫలితంగా ఎంపీ అభ్యర్థి కంటే ఎమ్మెల్యే అభ్యర్థి నరేంద్రవర్మకు నియోజకవర్గంలో 7,259 ఓట్లు అధికంగా వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వీటికి అదనం.

ప్రజల తీర్పును గౌరవిస్తూ బాధ్యతగా పనిచేస్తాం

● బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, జూన్ 4 : బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల తీర్పును గౌరవిస్తూ బాధ్యతగా పని చేస్తానని కూటమి ఎంపీగా గెలుపొందిన తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ప్రక్రియ ముగియగానే మీడియా సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ మొదటిసారిగా ఎన్నికలలో పోటీ చేసిన తనపై ప్రజలు నమ్మకం ఉంచి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలలో కూటమి అభ్యర్థులు విజయం సాధించటం సంతోషదాయకమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం చెప్పిన ప్రతి హామీని అమలు చేస్తానని చెప్పారు. ఏ ఒక్క హామీని మరిచిపోకుండా అమలు చేస్తానన్నారు. ఒక అధికారిగా ఎంతో బాధ్యతగా పని చేసిన తాను కేపీ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు అందిస్తూ వచ్చానని, ఇకపై ప్రజాప్రతినిధిగా ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతానని చెప్పారు. అధికారం చేయటానికి కాకుండా సేవ చేయటం కోసమే తాను వచ్చినట్లు తెలిపారు.



విజయసంకేతం చూపుతున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ప్రజల ఆకాంక్ష నెరవేరింది : ఎమ్మెల్యే నరేంద్రవర్మ

ప్రజల ఆకాంక్ష నెరవేరిందని తిరిగి రాష్ట్రానికి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాబోతున్నారని కూటమి ఎమ్మెల్యేగా గెలుపొందిన వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్ల నియోజకవర్గంలో నాలుగుసార్లుగా తెలుగుదేశం పార్టీ ఓటమిపాలవుతూ వచ్చిందన్నారు. మొట్టమొదటిసారిగా ఎన్నికల బరిలో పోటీ చేసిన తనను అఖండ మెజార్టీతో గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరు తన విజయానికి కృషి చేసినందుకు అభినందనలు తెలిపారు.

అన్నం సతీష్‌ప్రభాకర్‌కు నరేంద్రవర్మ కృతజ్ఞతలు

బాపట్ల, జూన్ 4 : ఎమ్మెల్యేగా తన విజయానికి కృషి చేసిన ప్రతిఒక్కరికి వేగేశన నరేంద్రవర్మ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకులు అన్నంసతీష్ ప్రభాకర్‌ను మంగళవారం సాయంత్రం కలిసి కృతజ్ఞతలు తెలిపిన నరేంద్రవర్మకు ఆయన అభినందనలు తెలిపారు. అదేవిధంగా నరేంద్రవర్మ అనేక మందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ జిట్టా ప్రమీలారాణి, జనసేననాయకురాలు గుంటుపల్లి తులసీకుమారి, టీడీపీసీనియర్ నాయకులు కామేపల్లి కృషిబాబు తదితరులు ఉన్నారు.



మాజీ ఎమ్మెల్సీ, బీజేపీనాయకులు అన్నం సతీష్ ప్రభాకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న వేగేశన నరేంద్రవర్మ

ఎమ్మెల్యే నరేంద్రవర్మకు ఘనస్వాగతం పలికిన నాయకులు



ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్వాగతం పలుకుతున్న నాయకులు

కర్లపాలెం, జూన్ 4 : బాపట్ల నియోజకవర్గ ఉమ్మడికూటమి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కర్లపాలెంలోని దాసనగర్‌కు చేరుకోగా మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ బాషా, మాజీ జడ్పీటీసీ గుంపుల కన్నయ్య, మాజీ ఎంపీటీసీ బెజ్జం వెంకటేశ్వర్లు, ఎర్మియా, జిలానీ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. మహిళలు కొబ్బరికాయలతో దిష్టి తీసి నుదుటన వీరతిలకం దిద్ది మంగళహారతినిచ్చారు. కోఆప్షన్ సభ్యులు బాషా, మాజీ జడ్పీటీసీ గుంపులకన్నయ్య, మాజీ ఎంపీటీసీ బెజ్జం వెంకటేశ్వర్లు దుశ్శాలువా, పూలమాలలతో నరేంద్రవర్మను ఘనంగా సన్మానించారు. జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌కు, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుకు, బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మకు పెద్దఎత్తున జేజేలు పలికారు. తన గెలుపునకు విశేష కృషి చేసిన కార్యకర్తలు, నాయకులకు ప్రతిఒక్కరికి నరేంద్రవర్మ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్.జిలానీ, జెట్టి ఇమానీయేలు, బీజేపీనాయకులు మంతెన నరసింహమూర్తిరాజు, మూషా, తాజు, జాలాది రత్నదాసు, గేరా చైతన్య, మేకల మౌనిక, గుంపుల దయమణి, మేకల విజేత, ముస్లిం యూత్, క్రిస్టియన్ యూత్, చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేమూరు నియోజకవర్గంలో సైకిల్ జోరు

- అమోఘ విజయం సాధించిన ఆనందబాబు
- 22,021 ఓట్ల మెజార్టీతో గెలుపు
- వైసీపీ కంచుకోట చుండూరులో ఆధిక్యతకు భారీ గండి
- గతంలో ఎన్నడూ లేని మెజార్టీ



వేమూరు, జూన్ 4 : సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వేమూరు నియోజకవర్గంలో సైకిల్ జోరు సాగింది. కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు అమోఘ విజయం సాధించారు. 22,021 ఓట్లతో గతంలో ఎన్నడూ లేని విధంగా మెజార్టీ సాధించారు. ఆయనకు 94,922 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి అశోక్ బాబుకు 72,901ఓట్లు లభించాయి. 1,97,458 ఓట్లకు గాను 1,73,042 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పోస్టల్ బ్యాలెట్ కూడా కలసి ఉన్నాయి. వైసీపీకి కంచుకోటగా ఉన్న చుండూరు మండలంలో కూడా టీడీపీ ఆనందబాబుకు గణనీయంగా ఓట్లు పడ్డాయి. గతంలో ఉన్న మెజార్టీని 600లకు తగ్గించగలిగారు. గతంలో ఇక్కడ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్, వైసీపీలకు 4 వేల నుంచి 5వేల వరకు మెజార్టీ వచ్చేంది. నియోజకవర్గంలో జనసేన బిజెపి కలవడంతో ఆ పార్టీల ఓట్లు గణనీయంగా రావడం భారీ విజయానికి దోహదపడింది.



జంపనిలో సంబరాలు జరుపుకుంటున్న కూటమి శ్రేణులు

గ్రామాల్లో జోరుగా సంబరాలు

సార్వత్రిక ఎన్నికల్లో మాజీ మంత్రి, కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు వేమూరు నియోజకవర్గం నుంచి ఘన విజయం సాధించడంతో టిడిపి శ్రేణుల్లో పట్టరాని ఆనందాన్ని కనబరిచారు. మంగళవారం ఉదయం 10గంటల నుండే గ్రామాల్లో జనసేన, టిడిపి శ్రేణులు జోరుగా సంబరాలు జరిపారు. పెద్ద ఎత్తున బాణా సంచాకాల్చడంతో పాటు పెద్ద ఎత్తున ర్యాలీలు జరిపారు. యువత కేరింతలు కొడుతూ మిఠాయిలు పంపిణీ చేశారు. ఆనందబాబు విజయం ముందస్తుగా తాము ఊహించినట్లే జరిగిందంటూ శ్రేణులు మరింత ఉత్సాహాన్ని వ్యక్తపరిచారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు, జూన్ 4 : కూటమి అభ్యర్థులు విజయం సాధించడంతో టీడీపీ శ్రేణులు వాడవాడలా విజయోత్సవాలు జరుపుకున్నారు. అనూహ్యమైన విజయం సాధించడంతో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బాణా సంచా కాల్చుతూ గులాలు చల్లుకుంటూ ఆనందోత్సహాల నడుమ విజయోత్సవాలు జరిపారు. భట్టిప్రోలుతో పాటుగా అన్ని గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు నాయకులు విజయోత్సవాలు జరుపుకున్నారు. గ్రామాల ప్రధాన కూడళ్ళల్లో ద్విచక్రవాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించి కేరింతలు కొట్టారు. టీడీపీ, జనసేన శ్రేణులు ఉమ్మడిగా సంబరాలు జరుపుకున్నారు. పోలీసులు 144 సెక్షన్ విధించడంతో గ్రామాలు నిర్మానుష్యంగా మారాయి. వేమూరు ఎమ్మెల్యేగా ఆనందబాబు గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తూ టీడీపీ శ్రేణులు ఆనందోత్సాహాలు చేసుకున్నాయి.



చావలి సెంటర్‌లో కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు

మొక్కు చెల్లించిన మహిళలు

అమృతలూరు, జూన్ 4 : రాక్షస పాలన పోయింది... చంద్రన్న పాలన వచ్చింది అంటూ మహిళలు గ్రామ దేవతకు మొక్కులు చెల్లించారు. తెలుగుదేశం కూటమి ఎన్నికల్లో ఘన విజయం సాధించడంతో అమృతలూరు గ్రామ దేవత శ్రీ పుట్లలమ్మ తల్లికి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించారు. విశ్రాంత ఉపాధ్యాయురాలు గుత్తికొండ శాంతకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ దేవతకు టెంకాయలు కొట్టారు. చంద్రబాబు వర్ధిలాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని తెలుగు బాప్టిస్టు చర్చి దక్షిణం వద్ద కార్యకర్తలు 101 టెంకాయలు కొట్టారు.



గ్రామ దేవతకు మొక్కులు చెల్లిస్తున్న మహిళలు



కొల్లూరు మండలంలో ఆనందబాబుకు 8038 ఓట్ల మెజారిటీ

కొల్లూరు, జూన్ 4 : కొల్లూరు మండలంలో కూటమి అభ్యర్థి నక్కా ఆనంద బాబుకు 8038 ఓట్ల మెజారిటీ లభించింది. కొల్లూరు మండలంలోని 24 గ్రామాల్లో మొత్తం ఓట్లు 45059గాను 39180 ఓట్లు పోల్ అయ్యాయి. అందులో టీడీపీ కూటమి 8038 ఓట్ల మెజారిటీ సాధించింది. గ్రామాల వారీగా ఆనందబాబుకు లభించిన మెజారిటీ ఇలా ఉంది. క్రాపలో రెండు పోలింగ్ బూత్‌ల పరిధిలో కూటమికి 306, చినపులివర్రులో 160, దోనేపూడిలో 287, కొల్లూరులో 2554, బొద్దులూరుపాడులో 20, అనంతరం 398, చిలుమూరు 442, ఈపూరు 401, ఈపూరులంక 111, పెదలంక 229, పెసర్లంక 964, ఆవులవారిపాలెం 128, గాజుల్లంక 741, సుగ్గునలంక 629, పోతార్లంక 368, తిప్పలకట్ట 148, కిష్కిందపాలెం 257, తడికలపూడి 187, జువ్వలపాలెం 250 ఓట్ల మెజారిటీ ఆనందబాబు సొంతం చేసుకున్నారు. మొత్తం ఆనందబాబుకు 8440 ఓట్లు మెజారిటీ వచ్చింది. కాగా వైసీపీ అభ్యర్థి అశోక్‌బాబుకు కేవలం ఐదు గ్రామాల్లో మాత్రమే అతి తక్కువగా మెజారిటీ వచ్చింది. రావికంపాడులో 164, మొసలిపాడు 70, తడిగిరిపాడు 57, చింతల్లంక 48, తోకలవానిపాలెం 210 ఓట్లు రాగా మొత్తం 549 ఓట్లు మెజారిటీ వచ్చింది. ఆనందబాబుకు వచ్చిన టీ మెజారిటీలో వైసీపీ అభ్యర్థికి వచ్చిన మెజారిటీ 549 ఓట్లు మినహాయించగా 8038 ఓట్లు అధిక్యత కొల్లూరు మండలంలో ఆనందబాబుకు దక్కింది. 2009, 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఆనందబాబుకు 3 వేల లోపు ఓట్ల మెజారిటీ రాగా 2024 ఎన్నికల ఫలితాల్లో అనూహ్యంగా 21,973 ఓట్లు మెజారిటీ సాధించి విజయభేరి మ్రోగించారు.

ఆనందోత్సాహాల్లో టీడీపీ, జనసేన శ్రేణులు

ఎన్నికల ఫలితాల్లో టీడీపీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు భారీ మెజారిటీతో అఖండ విజయం సాధించడంతో టీడీపీ, జనసేన శ్రేణులలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. మొదటి 5 రౌండ్లలో నువ్వా నేనా అన్నట్లు సాగిన కౌంటింగ్ ఆరో రౌండ్ నుంచి కూటమి అభ్యర్థి ఆనందబాబు వైపే ఎన్నికల ఫలితాలు మొగ్గు చూపాయి. ప్రతి రౌండ్‌లో స్పష్టమైన మెజారిటీ సాధించి ప్రత్యర్థిపై 21,516 ఓట్లతో పైచేయి సాధించారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించగా అందులోనూ 457 ఓట్లు సాధించడంతో పూర్తి మెజారిటీ 21973 ఓట్లకు చేరింది.

కొల్లూరులో విజయోత్సవం ర్యాలీ

కొల్లూరు, జూన్ 4 : తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు విజయం సాధించడంతో సంబరాలు నిర్వహించారు. మండల గ్రామం కొల్లూరులో మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూధనప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరిపారు. మిఠాయిలు పంపిణీ చేశారు.

అమృతలూరులో...



ఎన్టీఆర్ విగ్రహానికి లైటింగ్ వేసిన అభిమానులు

అమృతలూరు, జూన్ 4 : సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి విజయం సాధించడంతో పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగి తేలారు. కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు విజయం సాధించ డంతో మండల కేంద్రం అమృతలూరులో పార్టీ శ్రేణులు మిఠాయిలు, కేక్‌లు పంపిణీ చేశారు. బాణా సంచా కాల్చుతూ ఆనందం వ్యక్త పరిచారు.

మొదటి సారిగా చుండూరులో టీడీపీ ఆధిక్యత

చుండూరు జూన్ 4 : మొదటి నుంచి కాంగ్రెస్, వైసీపీకి కంచుకోటగా ఉండే చుండూరు మండలం ఈ దఫా తెలుగుదేశం విజయానికి తోడ్పాటు అందించింది. గతంలో ఈ మండలం నుంచి వైసీపీకి రెండు వేల నుంచి నాలుగు వేల వరకు ఆధిక్యత లభించేది. అలాంటి చుండూరు మండలంలో ఈ ఎన్నికల్లో తొలిసారిగా తెలుగుదేశం పార్టీ 600 ఓట్ల మెజార్టీ లభించి నియోజకవర్గంలో వైసీపీ ఆధిపత్యానికి బారీ గండి వేసింది. ఆనందబాబు విజయం పట్ల గ్రామ వీధులు పసుపు మయంగా మారాయి. ఉత్సాహంతో కార్యకర్తలు, నాయకులు బాణాసంచా కాలుస్తూ డప్పు వాయిద్యాలతో ఊరేగింపులు నిర్వహించారు. గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచుకుని ఉత్సాహంగా విందు పార్టీలు నిర్వహించుకున్నారు. చుండూరు, యడ్లపల్లి, వేటపాలెం, మోదుకూరు, మండూరులో భారీ ఎత్తున ఊరేగింపులు నిర్వహించారు.



మండూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి కార్యకర్తలు



కౌంటింగ్ కేంద్రాల బయట ఫలితాల గురించి మాట్లాడుకుంటున్న గెలిచిన ఎమ్మెల్యేలు అనగాని, ఆనంద్‌బాబు, సాంబశివరావు

రేపల్లెలో హ్యాట్రిక్ సాధించిన అనగాని

- జిల్లాలోనే అత్యధిక మెజార్టీ 40,012తో గెలుపు
- అనగాని చేసిన అభివృద్ధికి పట్టం

రేపల్లె, జూన్ 4: సార్వత్రిక ఎన్నికల ఫలితాల కోసం గత 22 రోజులుగా ఇరు పార్టీలు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూశాయి. మంగళవారం వెలువడిన ఫలితాల్లో. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ ప్రభంజనం కొనసాగి అత్యధిక స్థానాలను ఆపార్టీ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. రేపల్లెలో తెలుగుదేశం అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ మూడవసారి విజయకేతనం ఎగురవేశారు. రేపల్లెలో దీనికి భిన్నంగా జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ తన ప్రత్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్‌పై ఘన విజయం సాధించారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో వందల కోట్లతో చేపట్టిన అభివృద్ధే ఆయన గెలుపునకు బాటలు వేసింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుండి ప్రతి రౌండ్‌లో అనగాని ఆధిపత్యాన్ని కొనసాగించారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో అనగాని సత్యప్రసాద్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా రేపల్లె నియోజకవర్గం నుంచి పోటీ చేయగా మోపిదేవి వెంకట రమణరావు కాంగ్రెస్ తరుపున పోటీ చేసి అనగానిపై 5 వేల పైచిలుకు ఓట్లతో గెలుపొందారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా అనగాని సత్యప్రసాద్ బరిలో దిగగా మోపిదేవి వెంకట రమణరావు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి 13351 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి ఎమ్మెల్యే అనగాని నియోజకవర్గాన్ని అంటి పెట్టుకుని ఉంటూ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారు. 2019 ఎన్నికల్లో రేపల్లె టీడీపీ అభ్యర్థిగా అనగాని సత్యప్రసాద్ పోటీ చేయగా, వైసీపీ అభ్యర్థిగా మోపిదేవి వెంకట రమణరావు, జనసేన పార్టీ అభ్యర్థిగా కమతం సాంబశివరావుల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. నియోజకవర్గ ప్రజలకు అనగానికి బ్రహ్మరథం పడుతూ మరోమారు ఆశీర్వదించారు. ఈ ఎన్నికల్లో 13,660 మెజార్టీతో అనగాని గెలుపొందారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పోటీ చేయగా వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ ఈవూరి గణేష్ పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మోపిదేవి శ్రీనివాసరావు త్రిముఖ పోటీలో ఎమ్మెల్యే అనగాని 40,012 ఓట్లతో హ్యాట్రిక్ సాధించారు. జిల్లాలోనే అత్యధిక మెజార్టీ సాధించిన వ్యక్తిగా అనగాని నిలిచారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జూన్ 4: నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ పాలనలో జగన్మోహన్‌రెడ్డి చేసిన అవినీతి, అరాచకాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా సర్వనాశనం చేశాడని, ఉద్యోగ, ఉపాధి కల్పన కల్పించటంలో వైసీపీ ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ఉన్నత చదువులు చదువుకున్న యువతకు ఉద్యోగావకాశాలు లేక పక్క రాష్ట్రాలకు వెళ్ళుతున్న పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. రాష్ట్రాభివృద్ధిలో జగన్ పాలనలో 30 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందని, రాజధాని లేని రాష్ట్రంగా చేసిన ఘనత జగన్‌దేనని ప్రజలు ఓపిక పట్టి ఓటు హక్కు ద్వారా జగన్‌కు బుద్ధి చెప్పారన్నారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరినీ సంతృప్తిపర్చటం జరిగిందన్నారు. నియోజకవర్గ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలు తనపై విశ్వాసం ఉంచి గెలిపించినందుకు వారి రుణం తీర్చుకుంటానని తనపై ఆదరాభిమానాలుచూపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేశారు.

తొలి రౌండ్ నుంచి ఆధిక్యం ప్రదర్శించిన అనగాని

- రౌండ్‌రౌండ్‌కు పెరిగిన మెజార్టీ

సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో రేపల్లె అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ తొలిరౌండ్ నుంచి తన ఆధిక్యతను ప్రదర్శించారు. రేపల్లె నియోజకవర్గానికి సంబంధించి 19 రౌండ్‌లలో ఓట్ల లెక్కింపు జరిగింది. 19 రౌండ్‌లకు గాను టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ 15 రౌండ్‌లలో స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శించారు. రౌండ్‌రౌండ్‌కు టీడీపీ అభ్యర్థి మెజార్టీ గణనీయంగా పెరుగుతూ వచ్చింది. రౌండ్‌లలో వైసీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ స్వల్ప మెజార్టీని సాధించారు. తొలిరౌండ్‌లోనే అనగాని సత్యప్రసాద్‌కు 3,920ఓట్లు మెజార్టీ అత్యధికంగా లభించింది. రెండవ రౌండ్‌లో 3,747ఓట్లు, 3వరౌండ్‌లోకి వచ్చేసరికి 11,286ఓట్లతో రౌండ్‌రౌండ్‌కు 3వేలు పైచిలుకునే మెజార్టీ పెరుగుతూ 19వ రౌండ్‌లో తిరుగులేని మెజార్టీగా 40,012ఓట్లు అధిక మెజార్టీతో గెలుపొందారు. నియోజకవర్గంలోని కూటమి అభ్యర్థిగా ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు కాపు సామాజిక వర్గం, మత్స్యకారులు, సొంత సంఘయులు, అండగా నిలవటంతో గతంలో వచ్చిన మెజార్టీ కంటే మూడు రెట్లు అధికంగా మెజార్టీని సాధించారు. ఎమ్మెల్యే అనగాని కులమతాలకు అతీతంగా అందరికి తన చేతనైన సహాయం చేస్తూ కలుపుగోలుతనంగా ఉంటూ ఆపద ఉందంటే నేనున్నానంటూ భరోసా నివ్వటం ప్రజల్లో మరింత విశ్వసనీయత పెరిగి టీడీపీ కూటమిలో భాగంగా జనసేన, బీజేపీ కలవటంతో అనగానికి కలిసి వచ్చిన పరిస్థితి నెలకొనటంతో పాటు ప్రజలంతా అనగానికే పట్టం కట్టాలనే ఉద్ధేశ్యంతోనే నియోజకవర్గ ప్రజలు అండగా నిలిచి ఘన విజయాన్ని అందించారు.

చెరుకుపల్లిలో సంబరాలు

చెరుకుపల్లి, జూన్ 4 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అత్యధిక స్థానాలు సాధించటంతో గ్రామగ్రామాన జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. మూడోసారి అనగాని సత్యప్రసాద్ హ్యాట్రిక్ సాధించటంతో చెరుకుపల్లి పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ కార్యకర్తలు భారీ జెండాలు చేతబూని బైక్‌లపై ర్యాలీ నిర్వహించారు. గ్రామాలలో కూటమి గెలుపు తెలుసుకోవటంతో ఉదయం నుంచే బాణాసంచా కాలుస్తూనే ఉన్నారు. విజయోత్సవ ర్యాలీలపై నిషేదం ఉన్నా యువత పార్టీ గెలుపుతో నిషేదాన్ని కూడా లెక్కచేయకుండా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వారసత్వ రాజకీయాన్ని నిలబెట్టిన అనగాని

- పెద్దనాన్న భగవంతరావు ఆర్థికమంత్రి
- ప్రజాసేవకే అంకితమైన అనగాని కుటుంబం
- సేవాతత్పరతోనే రాజకీయ ఎదుగుదల

రేపల్లె, జూన్ 4 : తీరప్రాంతంలోని కూచినపూడి, రేపల్లె నియోజకవర్గాల్లో అనగాని కుటుంబం సేవాతత్పరత ఉండటం, ప్రజల్లో మమేకమై ఉండటం తోటివారికి సహాయపడాలనే మానవత్వంతో మెలగటంతో ప్రజల్లో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. న్యాయవృత్తిలో స్థిరపడ్డ అనగాని భగవంతరావు పేద ప్రజలకు అండగా ఉండి వారికి న్యాయం చేసే విధంగా అండగా నిలిచారు. కోర్టు లావాదేవీల్లో నియోజకవర్గంలోని ప్రజలకు అండగా నిలిచి వారి సమస్యలను పరిష్కరిస్తూ వారిలో ఒకరిగా నిలిచారు. 1972లో అనగాని భగవంతరావు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా కూచినపూడి నియోజకవర్గంలో పోటీ చేయగా స్వతంత్ర అభ్యర్థులైన సింగం బసవపున్నయ్య, పి.వెంకటరత్నంలపై గెలుపొందటంతో అప్పటి క్యాబినెట్‌లో ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టి రేపల్లె, కూచినపూడి నియోజకవర్గాలను అభివృద్ధి పథంలో నిలిపారు. ఈనేపథ్యంలో బస్టాండ్ సమీపంలో అనగాని భగవంతరావు డిగ్రీ కళాశాలను స్థాపించి తీరప్రాంత విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు దోహదపడ్డారు. తమ్ముడు అనగాని రంగారావు కుమారుడైన అనగాని సత్యప్రసాద్ 2009లో రాజకీయవారసుడిగా అరగ్రేటం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలుగుదేశం పార్టీ నుంచి రేపల్లె నియోజకవర్గ అభ్యర్థిగా అనగాని సత్యప్రసాద్‌ను నిలబెట్టారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మోపిదేవి వెంకట రమణరావు పోటీ చేసి విజయం సాధించారు. తిరిగి 2014లో టీడీపీ నుంచి అనగాని సత్యప్రసాద్ పోటీ చేసి మోపిదేవి వెంకట రమణరావుపై విజయం సాధించారు. పెద్దనాన్నకు తగ్గ కొడుకులా రాజకీయ వార సుడిలా నిలదొక్కుకున్నారు. అయిదు సంవత్సరాల్లోనే 3వేల కోట్ల రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించి అనగాని ప్రజల మన్ననలు పొందారు. దీర్ఘకాలంగా అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారులను డబుల్‌లైన్ రహదారులుగా అభివృద్ధి చేసి అన్ని సామాజిక వర్గాలను మెప్పించే విధంగా తనదైన శైలిలో రాజకీయం చేసి జిల్లాలోనే ఆదర్శవంతంగా రేపల్లె నియోజకవర్గాన్ని తీర్చిదిద్దారు. 2019లో రెండోసారి విజయం సాధించగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో 40,012ఓట్లుతో గెలుపొంది తిరుగులేని నాయకుడుగా అనగాని నిలిచారు.



ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

బార్బర్ షాపునకు నిప్పుపెట్టిన వైసీపీ కార్యకర్తలు

అమృతలూరు, జూన్ 4: జగన్ ఓడిపోయాడని తన వాట్సప్‌లో పోస్టు పెట్టినందుకు బార్బర్ షాపుకు వైసీపీ కార్యకర్తలు నిప్పు పెట్టిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. అమృతలూరు మండలం పాంచాళవరంలో పులివర్తి శ్యాంసుందర్ అనే నాయి బ్రహ్మణుని ఇంటిపై ఆదే గ్రామానికి చెందిన తురుమెళ్ళ కిరణ్, మరో వైసీపీ కార్యకర్తల ఇరువురు దౌర్జన్యం చేశారు. ఆ సమయంలో శ్యాం సుందర్ ఇంటిలో లేకపోవడంతో అతని పిన్నిపై దౌర్జన్యం చేయడంతోపాటు నానా దుర్భాషలాడారు. అనంతరం శ్యాంసుందర్‌కు ఫోన్ చేసి నీ వాట్సప్‌లో జగన్‌కు సెలవు అని పోస్టు పెడతావా అంటూ ఫోన్ చేసి దుర్భాషలాడి నీ అంతు చూస్తా అంటూ బెదిరించారు. అమృతలూరులో నీ బార్బర్ షాపు ఉందిగా ఏలా నడుపుతావు చూస్తాను అని హెచ్చరిచడంతోపాటు అమృతలూరు వచ్చి షాపులోని సామాగ్రిని తగలబెట్టారు. గమనించిన స్థానికులు వెంటనే మంటు ఆర్పి వేశారు. దీనిపై శ్యాం సుందర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.



తగలబెట్టిన బార్బర్ షాపులోని సామాగ్రి

వేగేశన నరేంద్రవర్మ విజయంపై హర్షం

పిట్టలవానిపాలెం, జూన్ 4 : మండలంలోని చందోలు గ్రామానికి చెందిన రైల్వేబోర్డు మాజీ సభ్యులు సయ్యద్ మోసిన్ నియాజి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అధిక మెజార్టీతో విజయం సాధించటం పట్ల పలువురు టీడీపీ, జనసేన నాయకులతో కలిసి మంగళవారం అభినందనలు తెలిపారు. కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో చందోలు గ్రామ ముస్లిం, ముస్లిం వెల్ఫేర్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రషీద్ దిలీప్, మైనార్టీ నాయకులు మౌలాబేగ్, జనసేన పార్టీ మండలాధ్యక్షులు హుస్సేన్‌బేగ్, తెలుగు దేశం పార్టీ మైనార్టీ కార్యదర్శి షేక్ సలీం, మైనార్టీ నాయకులు సయ్యద్ జహీర్, ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

మనోహర్‌కు ఘన స్వాగతం

తెనాలి రూరల్, జూన్ 4: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయం సాధించిన మనోహర్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. మంగళవారం ఎన్నికల ఫలితాల అనంతరం తెనాలి వస్తున్న మనోహర్‌కు నియోజవర్గ గ్రామాలైన ఖాజీపేట, హాఫ్‌పేట, కొలకలూరు, నందివెలుగు జంక్షన్ వంటి ప్రాంతాల్లో ప్రజలు స్వాగతం పలికారు.

నమ్మించి మోసం చేసిన జగన్‌కు గుణపాఠం

- బీసీ సంక్షేమ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు



తెనాలి అర్బన్, జూన్ 4 : నమ్మించి మోసం చేసినందుకే జగన్‌కు జనం గుణపాఠం చెప్పారని బీసీ సంక్షేమ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు విమర్శించారు. మంగళవారం విలేఖర్లతో మాట్లాడుతూ బీసీ వర్గాలన్నీ టీడీపీ కూటమిని గెలిపించాయన్నారు. బీసీలకు గాని, రాష్ట్రానికి గాని ఏదో చేస్తాడనుకున్న జగన్ నట్టేట ముంచారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని బీసీ లకు చేయూత నివ్వాలని కోరారు.

కూటమి నేతల పెన్సిల్ చిత్రం



తెనాలి అర్బన్, జూన్ 4 : రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయ దుందుబి మోగించడంతో కూటమి నేతల చిత్రాన్ని తెనాలికి చెందిన చిత్రకారుడు సత్యనారాయణ చిత్రించారు. ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చిత్రాలను ఒకే ఫ్రేమ్‌లో పెన్సిల్‌తో చిత్రించేందుకు గంట సమయం పట్టిందని ఆయన తెలిపారు. కూటమి విజయాన్ని ఆస్వాదిస్తూ వేసిన చిత్రం పలువురిని ఆకట్టుకుంటుంది.

ప్రభంజనం

ఏపీ తీర్పు @ 2024



మాచర్ల పట్టణం

20 ఏళ్ల తర్వాత

ఆ నాలుగు చోట్ల టీడీపీ గెలుపు

● 2014 గాలిలోనూ గుంటూరు తూర్పు, నరసరావుపేట, మాచర్ల, బాపట్లలో స్వారీ చేయలేకపోయిన సైకిల్

● నేడు భారీ మెజార్టీలతో విజయదుందుబి

గుంటూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి గత రెండు దశాబ్దాలుగా కొరకరాని కొయ్యగా మారిన నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ దఫా విజయఢంకా మోగించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఆ నియోజకవర్గాలే గుంటూరు తూర్పు, నరసరావుపేట, మాచర్ల, బాపట్ల. ఈ నాలుగు చోట్ల టీడీపీ అభ్యర్థుల మెజార్టీలు 20 వేలు దాటాయి.

1999లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు చివరిసారిగా గుంటూరు తూర్పు, నరసరావుపేట, మాచర్ల, బాపట్లలో గెలుపొందారు. 2004 కాంగ్రెస్ హవాలో ఈ నాలుగు చోట్ల టీడీపీ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. అది మొదలుకొని 2019 వరకు జరిగిన నాలుగు ఎన్నికల్లోనూ ఓడిపోయారు. సామాజిక సమీకరణాలతో అభ్యర్థులను మార్చు చేసినా విజయాన్ని అందుకోలేకపోయారు. డాక్టర్ కోడెల శివప్రసాదరావు, ఎస్ఎం జియావుద్దీన్ వంటి ప్రముఖులు పోటీ చేసినా ఓడిపోయారు. దీంతో ఆ నాలుగు నియోజకవర్గాలు కాంగ్రెస్ బలంగా ఉన్నప్పుడు ఆ పార్టీకి, ఆ తర్వాత వైసీపీకి కంచుకోటగా మారాయి. దీంతో ఈ ఎన్నికల్లో ఎలాగైనా ఆ కంచుకోటలను బద్ధలు కొట్టాలన్న లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. గుంటూరు తూర్పులో గత ఎన్నికల్లో పోటీ చేసిన ఓటమి పాలైన నసీర్ అహ్మద్ అప్పటి నుంచి ప్రజల్లో ఉంటూ వారి మద్దతు పొందారు. తొలి రౌండ్ నుంచి ఆధిక్యంలోకి దూసుకుపోయి 31 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

నరసరావుపేటలో చదలవాడ అరవిందబాబు కూడా గత ఎన్నికల్లో ఓడిపోయినా నియోజకవర్గాన్ని అంటి పెట్టుకొని ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వచ్చారు. దాంతో ఎన్నికల నాటికి ఆయన గెలుస్తారన్న ధీమా ప్రతీ ఒక్కరిలో నెలకొంది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొని అరవిందబాబుకే చంద్రబాబు టిక్కెట్ ఇచ్చి అండగా నిలిచారు. దాంతో ఆయన కూడా 20 వేల పైచిలుకు మెజార్టీతో ఈ ఎన్నికల్లో విజయదుందుభి మోగించారు. ముఖ్యంగా పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. రెండేళ్ల క్రితమే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని తిరిగి మాచర్ల ఇన్‌ఛార్జ్‌గా నియమించి తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపారు. మరోవైపు మాచర్లలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడి అరాచకాలు ప్రజలు భరించలేని స్థాయికి చేరుకొన్నాయి. గత మునిసిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కనీసం ఓటేయకుండా అందరిని భయభ్రాంతులకు గురిచేసి ఏకగ్రీవాలు చేయించారు. సార్వత్రిక ఎన్నికల రూపంలో అవకాశం రావడంతో కసి తీరా ప్రజలు టీడీపీకి ఓటేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. బాపట్లలో 2004, 09లో కాంగ్రెస్ తరుపున గాదె వెంకటరెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత 2014, 19లో కోన రఘుపతి వైసీపీ తరుపున పోటీ చేసి విజయం సాధించారు. దీంతో 20 ఏళ్ల నుంచి బాపట్లలోనూ టీడీపీకి విజయం వరించలేదు. ఈ ఎన్నికల్లో వేగేశన నరేంద్రవర్మని రంగంలోకి దించింది. ఆయనకు గత నాలుగేళ్ల క్రితమే ఇన్‌ఛార్జ్ బాధ్యతలు కేటాయించడంతో ఓటర్లకు దగ్గరయ్యారు. ఈ దఫా 20 వేల పైచిలుకు మెజార్టీతో నరేంద్ర వర్మ గెలుపు గంటని మోగించారు. ఈ విధంగా రెండు దశాబ్దాలుగా విజయం వరించని బాపట్ల, గుంటూరు తూర్పు, మాచర్ల, నరసరావుపేటలో ఈ దఫా టీడీపీ వ్యూహాత్మకంగా వ్యవహరించి భారీ మెజార్టీతో విజయాలను నమోదు చేసింది.

తరాలు మారినా తరగని అభిమానం



జూలకంటి నాగిరెడ్డి



జూలకంటి దుర్గాంబ



జూలకంటి బ్రహ్మరెడ్డి

● జూలకంటి కుటుంబానికి బ్రహ్మరథం

మాచర్ల, జూన్ 4: పల్నాడు వాళ్ల మనసులు వెన్న ముద్దలు అంటారు. ఆపదలో ఉన్నవాళ్ళకు వెన్నుదన్నుగా వుంటారు అంటారు. ఇప్పుడు ఆ మాటలు రుజువయ్యాయి. తరాలు మారినా వాళ్ళలోని అభిమానులు తరగలేదు. నిస్వార్థ నేత జూలకంటి నాగిరెడ్డి కుటుంబాన్ని మాచర్ల మర్చిపోలేదు. దశాబ్దాల తర్వాత మళ్లీ అదే కుటుంబ వారసుడికి అండగానిలిచి గెలుపుతీరానికి నడిపించారు. హోరాహోరీగా సాగిన 2024 ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గం నుంచి జూలకంటి బ్రహ్మారెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందారు. ఎన్నికల్లో గెలిచేందుకు వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినప్పటికీ నియోజకవర్గ ఓటర్లు జూలకంటికి అండగా నిలిచారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ గెలవడం ఒక ఎత్తైతే, మాచర్లలో విజయ ఢంకా మోగించటం మరో ఎత్తు అని చెప్పవచ్చు. ఈ ఎన్నికల్లో ప్రతి సీటు కీలకంగా భావించిన చంద్రబాబు ఈ సారి అనూహ్యంగా జూలకంటి బ్రహ్మారెడ్డిని మాచర్ల తెరపైకి తెచ్చారు. మొదట్లో అందరూ ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకొనప్పటికి తర్వాత తర్వాత జూలకంటి అభ్యర్థిత్వంపై అంచనాలు మారుతూ వచ్చాయి. పిన్నెల్లి సోదరులు ఎన్నికల్లో టీడీపీ శ్రేణులను కట్టడిచేసేందుకు తీవ్రహింసకు పాల్పడ్డారు. బీసీ నేతలను హత్య చేయించారు. టీడీపీ నేతలపై దాడులు, గృహాలు ధ్వంసం వంటి హింసాత్మక ఘటనలు జరిగినా జూలకంటి ఎక్కడా వెనక్కితగ్గకుండా క్యాడర్‌లో ధైర్యం నింపారు. చివరకు తన ప్రాణానికి హాని ఉన్నా బరిలో దూసుకుపోవటంతో మాచర్ల ఓటర్లు కనీవినీ ఎరుగనిరీతిలో మెజారిటీని కట్టబెట్టి ఆయన్ని అసెంబ్లీకి పంపించారు.

తండ్రి బాటలోనే....

జూలకంటి కుటుంబానికి మాచర్లతో విడదీయరాని బంధం ఉంది. జూలకంటి నాగిరెడ్డి నిస్వార్థ జీవితం అక్కడి ప్రజలను అంతలా ప్రభావితం చేసింది కాబట్టే చివరకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినా కూడా గెలిపించారు. 1967లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన జూలకంటి నాగిరెడ్డి కేవలం 80 ఓట్లతో ఓటమిని చవిచూశారు. తదుపరి1972 లో మళ్లీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 11,169 ఓట్లతో గెలుపొందారు. 1983 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి 12700 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆ తదుపరి 1999 ఎన్నికల్లో జూలకంటి దుర్గాంబ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి 1951 ఓట్లతో గెలుపొందారు. 2004, 2009 ఎన్నికల్లో జూలకంటి బ్రహ్మారెడ్డికి టీడీపీ సీటు కేటాయించినప్పటికీ కాంగ్రెస్ ప్రభంజనం వల్ల ఓటమి చవి చూశారు. తిరిగి 2024 ఎన్నికల్లో జూలకంటి బ్రహ్మారెడ్డిని భారీ మెజారిటీతో మాచర్ల ఓటర్లు ఎమ్మెల్యేగా గెలిపించారు.

ఓడినా.. గెలిచినా..

పల్నాడు రాజకీయాలు వేరుగా ఉంటాయి. అక్కడ నేతలు ఓడినా.. గెలిచినా.. కార్యకర్తలను ఎప్పుడూ కాపాడుకోవాల్సిందే. మాచర్లలో జూలకంటి కుటుంబం కూడా దశబ్దాల తరబడి కార్యకర్తలను, వారి వర్గాన్ని అంతే కాపాడుకుంటూ వచ్చింది. జూలకంటి బ్రహ్మారెడ్డి పార్టీ కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఉండటంతో ఈ ఎన్నికల్లో ఎన్ని సంఘటనలు జరిగినప్పటికీ క్యాడర్ వెనక్కి తగ్గకుండా పోరాడుతూ వచ్చింది.

టీడీపీ, జూలకంటి కోసం.. ప్రాణమే పణం

మాచర్ల నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల హింస దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. నంబూరు శేషగిరి రావు, చేరెడ్డి మంజుల, నోముల మాణిక్యం... ఇలా చెప్పుకుంటే పోతే ఎంతోమంది వారి ప్రాణాలు పణం గా పెట్టి ఎన్నికల రోజు పోలింగ్ ఏజంట్లుగా నిలబడ్డారు. కేవలం జూలకంటి కుటుంబంపై ఉన్న అభిమానంతోనే తాము ఏజంట్లుగా ఉన్నట్లు ప్రకటించారు. టీడీపీ జూలకంటి కోసం, ప్రాణాలు సైతం లెక్కచేయకుండా కార్యకర్తలు సాహసం చేయబట్టే అక్కడ కూటమి విజయఢంకా మోగించింది.

అసెంబ్లీలోకి తొలిసారి..

● ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎనిమిది మంది టీడీపీ అభ్యర్థుల విజయం



నారా లోకేశ్



జూలకంటి బ్రహ్మరెడ్డి



మహమద్ నసీర్



వేగేశన నరేంద్రవర్మ



గల్లా మాధవి



సీహెచ్ అరవిందబాబు



భాష్యం ప్రవీణ్



బి.రామాంజనేయులు

గుంటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వారిలో కొందరు తొలిసారిగా ఎన్నికల్లో పోటీ చేశారు. మరికొందరు రెండోసారి బరిలోకి దిగారు. కాగా వారంతా ఎన్నికల్లో ప్రప్రథమం గా గెలిచి అమరావతి రాజధానిలోని శాసన సభలో అడుగు పెట్టబోతున్నారు. ఆ ఎనిమి ది మంది తెలుగుదేశం పార్టీ అభ్యర్థులే నారా లోకేష్(మంగళగిరి), జూలకంటి బ్రహ్మానంద రెడ్డి(మాచర్ల), షేక్ నసీర్ అహ్మద్(గుంటూరు తూర్పు), గల్లా మాధవి (గుంటూరు పశ్చిమ), భాష్యం ప్రవీణ్ (పెదకూరపాడు), చదలవాడ అరవిందబాబు(నరసరావుపేట), బూర్ల రామాంజనేయులు(ప్రత్తిపాడు), వేగేశన నరేంద్ర వర్మ(బాపట్ల). ఈ దఫా సార్వత్రిక ఎన్నికల్లో ప్రప్రథ మంగా గల్లా మాధవి, భాష్యం ప్రవీణ్, వేగేశ న నరేంద్ర వర్మ పోటీ చేశారు. ఈ ముగ్గురు వైసీపీలో పెద్ద తలకాయలతోనే ఢీకొన్నారు. మాధవి మంత్రి విడదల రజినిపై పోటీ చేసి 50 వేల పైచిలుకు మెజార్టీ తో విజయం సాధించారు. పారిశ్రామికవేత్త అయిన భాష్యం ప్రవీణ్ కొద్దికాలం క్రితమే రాజకీయ తెరం గేట్రం చేసి పెదకూ రపాడులో రూ.వందల కోట్లకు పడగలెత్తిన వైసీపీ అభ్యర్థి నంబూరు శంకరరావుతో తలపడ్డారు. ఆయనపై భారీ మెజార్టీతో ప్రవీణ్ విజయాన్ని అందుకొన్నారు. బాపట్లలో వేగేశన నరేంద్రవర్మ కూడా తొలిసారిగా ఈ ఎన్నికల బరిలోకి దిగారు. ఆయన రెండు సార్లు బాపట్ల నుంచి గెలుపొందిన కోన రఘుపతిని మట్టికరిపించారు. కాగా గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ దఫా తిరిగి మంగళగిరి నుంచే బరిలోకి దిగి 80వేల పైచిలుకు బంపర్ మెజార్టీతో అసెంబ్లీలోకి అడుగు పెట్టబోతోన్నారు. మాచర్లలో తెలుగుదేశం పార్టీకి జూలకంటి బ్రహ్మానందరెడ్డి పూర్వవైభవం తీసుకొచ్చి 33 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొంది తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగు పెట్టనున్నారు. నసీర్ అహ్మద్ గుంటూరు తూర్పులో రెండుసార్లు గెలుపొందిన వైసీపీ ఎమ్మెల్యే ముస్తఫా కుమార్తె నూరి ఫాతిమాపై పోటీ చేసి 31 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీ సాధించి తొలిసారిగా అసెంబ్లీ గడప తొక్కబోతోన్నారు. అలానే నరసరావుపేటలో గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన చదలవాడ అరవిందబాబు కూడా 20 వేల మెజార్టీని సాధించి అసెంబ్లీ మెట్లు ఎక్కబోతోన్నారు. గతంలో గుంటూరు కలెక్టర్‌గా పోటీ చేసి గత ఎన్నికల్లో కర్నూలు జిల్లా నుంచి పోటీ చేసి ఓటమి పాలైన బూర్ల రామాంజనేయులు ఈ దఫా ప్రత్తిపాడు నుంచి పోటీ చేసి దాదాపుగా 40 వేల మెజార్టీని సాధించి శాసనసభలో ఎమ్మెల్యేగా అడుగు పెట్టబోతోన్నారు.

పెమ్మసాని.. తొలి అడుగే సంచలనం

గుంటూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్. ఆ పేరులో పవర్ ఉందన్న విషయం ఎన్నికలకు ముందుగానే అందరికి తెలిసిపోయింది. గుంటూరు జిల్లా రాజకీయ ముఖచిత్రంలో తన తొలి అడుగే సంచలనం. అమెరికాలో ఉంటున్నా అక్కడి పౌరసత్వం తీసుకోకుండా ఎప్పుడు తనకు ఇక్కడ ప్రజాసేవ చేసే అవకాశం వస్తుందా అని ఎదురు చూశారు. గత పదేళ్ల క్రితం ఒకసారి ప్రయత్నం చేసినా అప్పట్లో వీలు కుదరక పోవడంతో ఈ దఫా ఆయనకు తెలుగుదేశం అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. ఎప్పుడైతే మాజీ ఎంపీ గల్లా జయదేవ్ రాజకీయాలకు తాత్కాలికంగా విరామం తీసుకోవాలని భావించారో ఇక గుంటూరు సీటు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కే ఖరారు చేయాలని చంద్రబాబు నిర్ణయించారు. ఆయన అమెరికా నుంచి ఇక్కడ కాలుమోపక ముందే గుంటూరు పార్లమెంట్ స్థానం గురించి సమస్త సమాచారాన్ని సేకరించారు. ఇక్కడి సామాజిక స్థితిగతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, తన నుంచి ప్రజలు ఏమి ఆశిస్తున్నారనే వివరాలను తెలుసుకొని పెమ్మసాని అనే నేను అంటూ నియోజకవర్గం అంతా బ్యానర్లు ఏర్పాటు చేసి సంచలనం రేకెత్తించారు.

కేవలం ఎన్నికలకు రెండు నెలల ముందే వచ్చిన చంద్రశేఖం రాజకీయవ్యూహాలను రచించి పకడ్బందీగా అమలుచేశారు. దాదాపుగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. సాధ్యమైనంత వరకు అన్నివర్గాలను కలుసుకొనే ప్రయత్నం చేశారు. ప్రజలు ప్రధానంగా రోడ్లు, డ్రెయిన్‌లు, బ్రిడ్జీలు, చదువుకొన్న పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, తాగునీరు వంటి సదుపాయాలే కోరుకొంటున్నారని గ్రహించి ఆ మేరకు తాను గెలిసే ఏమేమి చేసేది ప్రజలకు వివరించారు. ఒకపక్క పెమ్మసాని ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతుండగా వైసీపీ అభ్యర్థులను వెతుక్కునే పనిలో ఉన్నది. చివరికి పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్యని తీసుకొచ్చి బరిలోకి దించింది. దాంతోనే పెమ్మసా ని గెలుపు ఖాయమైపోయింది. నియోజకవర్గంలో ఏ మూలకు వెళ్లినా పెమ్మసాని పేరు ప్రజల నోటివెంట బలంగా వినిపించింది. కాగా పెమ్మసాని నేరుగా జగన్‌ని టార్గెట్ చేసి విమర్శలు గుప్పించారు. దమ్ముంటే గుంటూరు లోక్‌సభ స్థానంలో తనపై పోటీ చేయాలని సవాలు విసిరారు. ఆ సవాలుకు వైసీపీ నేతల నోటి వెంట మాటరాలేదు. తాను కిందిస్థాయి నుంచి వచ్చానని, అన్నింటికి తెగించే ఎన్నికల్లో పోటీ చేస్తున్నానన్నారు. తనపై చేయి వేస్తే తనకు సమయం వచ్చిన రోజున ఆ చేయిని తీసేస్తా నని మాస్ వార్నింగ్‌లు కూడా ఇచ్చారు. ఇది ఓటర్ల లో మరింత క్రేజ్ పెరిగేలా చేసింది.

కాగా మంగళవారం ఆచార్య నాగార్జున యూనివర్శిటీలోని వివిధ బ్లాకులలో ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి భారీ ఆధిక్యంలోకి పెమ్మసాని దూసుకెళ్లారు. ఆయన మెజార్టీ రౌండ్ రౌండ్‌కు వేలల్లో పెరుగుతూ పోయింది. అది చూసి వైసీపీ అభ్యర్థి కిలారి రోశయ్య ఉదయం 10 గంటల లోపే కౌంటింగ్ కేంద్రాన్ని వీడి వెళ్లిపోయారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పెమ్మసానికి మంచి మెజార్టీ వచ్చింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో నూ ఆయనకు 13928 ఓట్లు వచ్చాయి. మరోవైపు వైసీపీ అభ్యర్థి రోశయ్యకు 6,690 మాత్రమే పోలింగ్ అయ్యాయి. ఈవీఎం ఓట్లు లక్షల సంఖ్యలో రావడంతో ఆయన ఢంపింగ్ మెజార్టీని సాధించారు. తద్వారా రాష్ట్రంలోనే రెండోస్థానంలో పెమ్మసాని నిలిచారు.

- ఈవీఎం ఓట్లు ... 14,04,061
- పెమ్మసాని చంద్రశేఖర్‌కు వచ్చిన ఓట్లు ... 8,51,020
- కిలారి రోశయ్యకు పోలింగ్ అయిన ఓట్లు ... 5,13,563
- ఇతరులు ... 32,268
- నోటాకు వచ్చిన ఓట్లు ... 7,210

మొత్తం ఓట్లు....

- పెమ్మసానికి వచ్చిన ఓట్లు ... 8,64,948(60.68శాతం)
- రోశయ్యకు వచ్చిన ఓట్లు ... 5,20,253(36.50 శాతం)

ఆరోసారి అసెంబ్లీలోకి.. ధూళిపాళ్ళ

● కోడెల రికార్డు సమం చేస్తున్న ధూళిపాళ్ళ, కన్నా



కన్నా లక్ష్మీనారాయణ



ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, జూన్4: పొన్నూరు నియోజకవర్గం నుంచి 7వ సారి బరిలో దిగిన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ 6వ సారి ఘన విజయంతో అసెంబ్లీలోకి అడుగు పెడుతున్నారు. 1994లో తండ్రి వీరయ్య చౌదరి మరణానంతరం రాజకీయ అరంగేత్రం చేసిన నరేంద్ర తొలిసారి జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ యోధుడు తలసిల వెంకట్రామయ్యపై 21729 ఓట్ల అధిక్యంతో ఘన విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టారు. అక్కడ నుంచి వరుసుగా 5 సార్లు విజయం సాధించిన నరేంద్ర తర్వాత జరిగిన ఎన్నికలో మొదటిసారి సాధించిన మెజార్టీని అందుకోలేకపోయారు. అయితే 2019 ఎన్నికలో కేవలం 1112 ఓట్ల స్వల్ప తేడతో ప్రత్యర్థి చేతిలో ఓటమి పాలైయ్యారు. ఆ నాటి నుంచి నియోజకవర్గాని వదిలిపెట్టకుండా కార్యకర్తలకు అండగా నిలుస్తూ పార్టీని బలోపేతం చేయటంపై దృష్టిసారించారు. ప్రభుత్వం నుంచి నిత్యం వేధింపులు, కేసులు, ఎదురైనప్పటికీ మొక్కవోని ధైర్యంతో నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలుస్తూ ముందుకు సాగారు కేవలం ఐదేళ్లలో ఆయనపై 17 కేసులు నమోదైయ్యాయి. అంతే కాకుండా సంగం డెయిరీలలో అక్రమాలు జరిగాయి అంటూ నరేంద్ర కుమార్‌పై కేసు నమోదు చేసి 30 రోజులు పాటు జైలు పాలు చేసి అక్రమంగా నిబంధించింది. జైలు నుంచి బైలుపై నిడుదలైన నరేంద్ర కుమార్ రెట్టించిన ఉత్సాహంతో పార్టీ కార్యక్రమాలను నిర్వహించటమే కాకుండా ప్రభుత్వంపై రాజీలేని పోరాటం సాగించారు. ఆరోవ సారి ఘన విజయంతో ఇప్పటి వరకు జిల్లాలో ఉన్న మాజీ మంత్రి కోడెల శివ ప్రసాద్ రికార్డును ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌తోపాటు, సత్తెనపల్లి నుంచి మాజీ మంత్రి కన్న లక్ష్మీనారాయణ సమం చేశారు.

ప్రత్తిపాటి.. నాలుగోసారి



కార్యకర్తలకు మిఠాయిలు పంచుతున్న ప్రత్తిపాటి సతీమణి వెంకటకుమారి

చిలకలూరిపేట, జూన్4: చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రత్తిపాటి పుల్లారావు వైసీపీకి చెందిన తన ప్రత్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడుపై పోస్టల్ బ్యాలెట్‌లతో కూడా కలిపి 33,262 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత ఇంత భారీ మెజారిటీ ఏ అభ్యర్థికి లభించలేదు. ఇప్పటికి ఇక్కడ ప్రత్తిపాటి గెలవడం ఇది నాలుగో సారి. గతంలో ప్రతిపాటి పుల్లారావు 1994లో 26,241 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈసారి ఆయన తన రికార్డును తానే బద్దలు కొట్టారు. కాగా ప్రత్తిపాటి పుల్లారావుకు 1,11,062 ఓట్లు రాగా వైసీపీ అభ్యర్థి మనోహర్ నాయుడుకు 77,800 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థి ఎం.రాధాకృష్ణకు 2,270 ఓట్లు లభించాయి. నోటాకు 788 ఓట్లు లభించాయి. మొత్తం 1,95,400 ఓట్లు చెల్లిన ఓట్లు కాగా వాటిలో టిడిపికి 56.8 శాతం, వైసిపికి 39.85 శాతం ఓట్లు లభించాయి. 2019 ఎన్నికల్లో టీడీపీకి 45.79 శాతం ఓట్లు మాత్రమే లభించగా ఈసారి ఆ శాతం బాగా పెరిగింది. ఇక పోస్టల్ బ్యాలెట్లలో కూడా పుల్లారావుకు 725 ఆధిక్యత లభించింది. పోలైన మొత్తం 2,319 పోస్టల్ బ్యాలెట్లు గాను పుల్లారావుకు 1,489 ఓట్లు, మనోహర్ నాయుడుకు 764, కాంగ్రెస్ అభ్యర్థి రాధాకృష్ణకు 35, నోటాకు 14 ఓట్లు లభించాయి.

ప్రతి రౌండ్‌లో పుల్లారావుకే ఆధిక్యత

చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 18 రౌండ్‌లుగా జరిగింది. ఒక్క రౌండ్‌లో తప్ప ప్రతి రౌండ్‌లో తెలుగుదేశం పార్టీదే పైచేయిగా కనిపించింది. మొదటి రౌండ్‌లో వైసీపీకి 4867, తెలుగుదేశంకు 7,130 ఓట్లు లభించాయి. రెండవ రౌండ్‌లో వైసీపీకి 4,658, టిడిపికి 5788, మూడవ రౌండ్‌లో వైసీపీకి 4,782 టిడిపికి 6,530, నాలుగో రౌండ్‌లో వైసీపీకి 5,359 టిడిపికి 4,631, ఐదో రౌండ్‌లో వైసీపీకి 4660, టీడీపీకి 5708, ఆరవ రౌండ్ లో వైసీపీకి 4337, టిడిపికి 5,137, ఏడవ రౌండ్ లో వైసీపీకి 3,480 టిడిపికి 5,348, ఎనిమిదవ రౌండ్‌లో వైసీపీకి 4,321 టీడీపీకి 5,294, తొమ్మిదో రౌండ్‌లో వైసీపీకి 3,783 టిడిపికి 6,294 ఓట్లు, పదవ రౌండ్‌లో వైసీపీకి 4,593 టిడిపికి 6,949 ఓట్లు లభించాయి.

11వ రౌండ్‌లో వైసిపికి 4,113 టిడిపికి 7805 ఓట్లు, 12వ రౌండ్ లో వైసీపీకి 4,695 టిడిపికి 7106 ఓట్లు, 13వ రౌండ్ లో వైసీపీకి 4,856 టిడిపికి 6,797 ఓట్లు, 14వ రౌండ్ లో వైసీపీకి 2,731 టీడీపీకి 8,340 ఓట్లు, 15వ రౌండ్ లో వైసీపీకి 5,130 టీడీపీకి 6,994 ఓట్లు, 16వ రౌండ్‌లో వైసీపీకి 4,343 టిడిపికి 6,159 ఓట్లు, 17వ రౌండ్ లో వైసీపీకి 5,060 టిడిపికి 5,365 ఓట్లు, 18వ రౌండ్ లో వైసీపీకి 575 టిడిపికి 1,063 ఓట్లు లభించాయి. ఇతర పార్టీలు ఇండిపెండెంట్ లకు కలిపి మొత్తం 3,472 ఓట్లు లభించాయి. నోటాకు మొత్తం 780 ఓట్లు లభించాయి. పోస్టల్ బ్యాలెట్ లలో కూడా 14 ఓట్లు నోటా కు లభించాయి.

ఆరా సర్వే.. తుస్

● సొంత జిల్లాలో సైతం మస్తాన్‌కు తలెత్తుకోలేని పరిస్థితి...

● పొన్నూరు, సత్తెనపల్లి ఔట్.. ఎంపీ లావు గెలుపు డౌట్ అంటూ తప్పుడు నివేదిక

● ముస్లింల కోట అయిన గుంటూరు తూర్పులో టీడీపీకి బంపర్ మెజార్టీ

గుంటూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఎగ్జిట్ పోల్స్ పేరుతో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఆరా మస్తాన్ చెప్పిన జోస్యం తుస్సుమంది. ఎవరు ఎందుకు గెలుస్తారు.. ఎలా ఓడతారు.. ఉద్యోగులు ఎవరికి వేశారు.. వ్యాపారులు ఎవరి పక్షాన నిలిచారు.. సామాన్య ప్రజలు సంక్షేమ పథకాల వైపే మొగ్గు చూపారా.. అభివృద్ధి జరగాలని కోరుకుంటున్నారా అనే ఏ అంశాలను తన సర్వే ద్వారా వ్యక్తం చేయకుండా కేవలం మొక్కుబడిగా జగన్ తన మీటింగ్‌ల్లో చూసి చదివే ప్రసంగాల్లాగా ఈ ఎన్నికల్లో వైసీపీ గెలుస్తుందని మూడు ముక్కల్లో తేల్చేయటంపై ఆనాడే సోషల్ మీడియాలో పెదవి విరుపులు వ్యక్తమయ్యాయి. పొన్నూరు నియోజకవర్గం నుంచి వైసీపీ తరపున పోటీ చేసిన అంబటి మురళీ గెలవబోతున్నాడని.. అలాగే అతని అన్న, రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు సత్తెనపల్లి నుంచి గెలవబోతున్నాడని ధీమాగా వ్యక్తపరిచాడు. అలాగే నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి నిలిచిన లావు శ్రీకృష్ణదేవరాయులు గెలుపు కూడా డౌట్ అనే భావన కూడా వ్యక్తం చేశాడు. పైగా సర్వే ఫలితాలను వెల్లడించేందుకు తన స్వగ్రామమైన మద్దిరాలనే ఎంచుకొని అక్కడ నుంచే ఎంతో హంగు, ఆర్భాటంతో ఏర్పాట్లు చేసి ప్రకటించాడు. విశేషమేమిటంటే అన్ని మీడియా సంస్థల కంటే ముందుగా సాక్షి లైవ్ వెహికల్ ఆ రోజు మధ్యాహ్నానికే మద్దిరాలకు చేరుకోవటం. ఆ రోజునే అది గమనించిన వారు ఆరా నివేదిక వైసీపీకి అనుకూలంగా రాబోతుందని సర్వే ఫలితాలు వెలువడక ముందే ఊహించాడు. అయితే ఆరా సర్వే ఎవరికి అనుకూలంగా రాబోతుంది.. వైసీపీకి ఎన్ని సీట్లు వస్తాయి.. అనే సమాచారం. సోషల్ మీడియాలో ముందుగానే వైరల్ అవటం విశేషం. ఆ సాయంత్రానికి మస్తాన్ వెలువరించిన ఫలితాలు కూడా అదే రీతిలో ఉండటంపై అనుమానాలు వచ్చాయి. ఆరా సర్వేను ఆసరగా చేసుకొని వైసీపీకి అనుకూలంగా అనేక మంది ఆ రెండు రోజుల్లోనే కోట్లకు బెట్టింగ్‌లు వేసుకొని నేడు రోడ్డున పడ్డారు. ఒకరిద్దరు అయితే తీర్చలేని అప్పుల బాకీల్లో కూరుకుపోయి ఆత్మహత్యే శరణ్యంగా అనే స్థితిలో ఉన్నారు. ఆరా సర్వే వెలువడక ముందు ఎవరూ కూడా రూపాయికి రెండు ఇస్తామన్నా బెట్టింగ్‌లు పెట్టేందుకు ముందుకు రాలేదు. ఆరా సర్వేతో టీడీపీ తరుపున బెట్టింగ్ పెట్టే వారికి కొంచెం వెనక్కు తగ్గినప్పటికీ మిగతా అన్ని నేషనల్ మీడియాలో కూటమికి బంపర్ మెజార్టీ ఖాయమని ఫలితాలు రావటంతో పోటీ పడి ఇరువర్గాలు పందేలు కాసుకున్నారు. కాగా సత్తెనపల్లిలో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ మంత్రి అంబటి రాంబాబును ఘోరంగా ఓడించి 27వేల పై చిలుకు మెజార్టీ సాధించాడు. అలాగే పొన్నూరులో ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ వైసీపీ అభ్యర్థి అంబటి మురళీని 30వేలకు పైగా మెజార్టీతో చిత్తు చిత్తుగా ఓడించాడు. ఇక నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయులు ఇంచుమించు లక్షా 50వేలకు పైగా మెజార్టీతో గెలుపొందారు. ఈ మూడింటి విషయంలో ఆరా మస్తాన్ చెప్పిన జోస్యం ఘోరంగా తప్పింది. దీంతో సొంత జిల్లాలో సైతం గెలుపు, ఓటములపై సరైన అంచనా వేయలేక పోయినా ఆరా మస్తాన్ తలెత్తుకొని తిరిగే పరిస్థితి లేకుండా పోయింది. ఇదిలా ఉండగా ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి పట్ల ముస్లింలలో వ్యతిరేకత ఉందని గుర్తించినట్లు కూడా ఆయన చాటుకున్నారు. అయితే ఏ మాత్రం అవగాహన లేకుండా ఇలా వ్యాఖ్యానించినట్లు గుంటూరు తూర్పులో వెలువడిన ఫలితం రుజువు చేసింది. ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ, వైసీపీ తరపున ఇరువురు ముస్లింలే బరిలోకి దిగినప్పటికీ టీడీపీ అభ్యర్థి నసీర్‌కే ముస్లింలు బ్రహ్మరథం పట్టారు. నసీర్ 31వేలకు పైగా ఆధిక్యతతో పచ్చ జెండా ఎగురవేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161, 173
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00


లోకేశ్ విజయంతో సంబరాలు జరుపుకుంటున్న అభిమానులు


తల్లి నారా భువనేశ్వరితో విజయోత్సాహాన్ని పంచుకుంటున్న నారా లోకేశ్

నసీర్.. హుషార్

● గుంటూరు తూర్పు అభ్యర్థి తిరుగులేని విజయం

● లక్షా 815 ఓట్లు సాధించిన మొహమ్మద్ నసీర్


మొహమ్మద్ నసీర్

గుంటూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ కంచుకోటగా పేరున్న గుంటూరు తూర్పు నియోజకవర్గంలో టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ తిరుగులేని విజయాన్ని అందుకున్నారు. ప్రతీ రౌండులో భారీ మెజారిటీని సొంతం చేసుకుంటూ విజయాన్ని తన సొంతం చేసుకున్నారు. అధికార వైసీపీ తరుపున పోటీ చేసిన స్థానిక ఎమ్మెల్యే ముస్తఫా కుమార్తె నూరి ఫాతిమా ఏ దశలోనే పోటీ ఇవ్వలేకపోయారు. మొత్తం 19 రౌండ్లలో కేవలం రెండంటే రెండు రౌండ్లలో మాత్రమే ఆమె స్వల్ప ఆధిక్యాన్ని ప్రదర్శించగా మిగిలిన 17 రౌండ్లలో నసీర్ మెజారిటీతో దూసుకుపోయారు. మొత్తంగా 31,962 ఓట్ల మెజారిటీతో నూరి ఫాతిమాపై గెలుపొందారు. నూరి ఫాతిమా 68,853 ఓట్లు సాధించగా నసీర్ లక్షా 815 ఓట్లు సాధించి విజేతగా నిలిచారు.

పశ్చిమలో... ప్రభంజనం

● 50 వేల మెజారిటీతో గల్లా మాధవి విజయ ఢంకా

● ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయిన మంత్రి రజని


గల్లా మాధవి

గుంటూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పసుపు దండుకు పెట్టని కోటగా వున్న గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ- జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి విజయఢంకా మోగించారు. ప్రతీ రౌండులో మంత్రి విడుదల రజనీపై తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ 50వేలు పైచిలుకు మెజారిటీతో గెలుపును సొంతం చేసుకున్నారు. మొత్తం 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగగా ఒక్కటంటే ఒక్క రౌండులో కూడా మంత్రి రజని ఆధిక్యాన్ని ప్రదర్శించలేకపోయింది. రాజకీయాలకు పూర్తిగా కొత్త అయిన గల్లా మాధవికంటే సగానికి సగం వెనకబడిపోయి ఊహకందని ఓటమిని చవిచూసింది. ఎన్నికల రోజున పలు పోలింగ్ కేంద్రాల్లో దౌర్జన్యాలకు పాల్పడినా ఆమెకు ప్రయోజనం మాత్రం దక్కలేదు. పశ్చిమ ఓటరు కూటమి వైపే ఏకపక్షంగా మొగ్గు చూపడంతో కనీవినీ ఎరుగని ఓటమిని ఆమె చవిచూడాల్సి వచ్చింది. మొత్తంగా 21 రౌండ్లలో గల్లా మాధవి లక్షా 13వేల 12 ఓట్లు సాధించగా మంత్రి రజని కేవలం 63వేల 249 ఓట్లతో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది.

ఆనందోత్సాహాలు.. ఆగ్రహావేశాలు

● కూటమి ప్రభంజనంతో రోడ్డెక్కిన శ్రేణులు

● రజిని, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి కార్యాలయాలపై దాడి

గుంటూరు, జూన్ 4: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తెలుగుదేశం నేతృతంలోని కూటమి ఘనవిజయం సాధించడంతో గుంటూరులో టీడీపీ, జనసేన శ్రేణులతో పాటు ప్రజలు కూడా స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు వచ్చినట్లు ఆనందోత్సాహాలతో రోడ్డెక్కారు. పోలీసు ఆంక్షలు ఉన్నా.. పట్టలేని ఆనందంతో చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా మహిళలు కూడా టీడీపీ, జనసేన జెండాలు చేతబట్టి ఆనందోత్సాహాలతో వాహనాలలో కేరింతలు కొట్టారు. ఐదేళ్లపాటు ఎదుర్కొన్న నిర్బంధం, చవిచూసిన నరకాన్ని, ప్రభుత్వ వేధింపులను తలచుకున్న పార్టీల శ్రేణులు రజిని, అప్పిరెడ్డి కార్యాలయాల వద్ద ఉన్న వైసీపీ బోర్డులు, ఆ పార్టీ ఫ్లెక్సీలు, జెండాలను చూసి ఆగ్రహావేశాలకు లోనయ్యారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడిలో అప్పిరెడ్డి అనుచరుల పాత్రను, సాయిబాబా రోడ్డు జంక్షన్లో ఎన్టీఆర్ విగ్రహం ఎదురుగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని ఎన్టీఆర్ వర్థంతి, జయంతుల సందర్భంగా నివాళులర్పించుకునే అవకాశం లేకుండా పోలీసులను అడ్డుపెట్టుకుని రజని వేధింపులను జీర్ణించుకోలేని కూటమి శ్రేణులు ఆయా కార్యాలయాలపై దాడికి దిగారు. రజిని కార్యాలయంపై రాళ్లు రువ్వి అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులు వారిని అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఐదేళ్లు ఈ లాఠీలు ఏమయ్యాయి ఎక్కడ పెట్టుకున్నారు అంటూ ప్రశ్నించడంతో పోలీసు సిబ్బంది ఏమి సమాధానం చెప్పలేని పరిస్థితిలో కొంత ఇబ్బంది ఎదుర్కొన్నారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో రేంజ్ ఐజీ త్రిపాఠి స్వయంగా రంగంలోకి దిగాల్సి వచ్చింది. గార్డెన్స్ సెంటర్లో ఉన్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కార్యాలయంలోకి సుమారు వందమంది టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు చొరపడ్డారు. కార్యాలయంలో ఫర్నిచర్‌ను, కంప్యూటర్‌ను ధ్వంసం చేశారు. ఈ ప్రాంతం నుంచి వైసీపీ కార్యాలయాలను తక్షణం తొలగించాల్సిందేనని కార్యకర్తలు హెచ్చరించారు.

వైసీపీ నేతలు కార్యాలయాల వద్ద బందోబస్తు

ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘనవిజయంతో ఐదేళ్లుగా అధికార పార్టీ వేధింపులకు గురైన టీడీపీ, జనసేన కార్యకర్తల నుంచి వైసీపీ నేతలకు ప్రతిఘటన ఎదురయ్యే అవకాశాలు ఉంటాయని పోలీస్‌శాఖ భావించింది.దీంతో అప్రమత్తమైన పోలీస్ అధికారులు గుంటూరు నగరంలోని వైసీపీ నాయకుల ఇళ్ళు, ఆయా కార్యాలయాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు. మాజీ మంత్రులు విడదల రజని, అంబటి రాంబాబు, మేకతోటి సుచరిత ఇళ్లవద్ద, మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, మద్దాలి గిరి కార్యాలయం, వైసీపీ జిల్లా కార్యాలయం, కిలారి రోశయ్య, మద్దాలి గిరి, ముస్తఫా ఇళ్ల వద్ద పోలీసులు మోహరించారు.

లోకేశ్.. శభాష్

● మంగళగిరికి తొలి యువ ఎమ్మెల్యేగా..

● 90వేల మెజారిటీ దిశగా దూసుకెళ్లిన లోకేశ్

మంగళగిరి, జూన్ 4: మంగళగిరి నియోజకవర్గానికి ఎన్నికైన తొలి యువ ఎమ్మెల్యేగా నారా లోకేశ్ మరో కొత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నారు. 1952లో ఏర్పడిన మంగళగిరి నియోజకవర్గానికి ఇప్పటివరకు 11 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 12వ ఎమ్మెల్యేగా ఎన్నికైన లోకేశ్ వయస్సు సరిగ్గా 41 సంవత్సరాలు. ఇప్పటివరకు మంగళగిరికి ఎమ్మెల్యేలుగా పనిచేసినవారిలో లోకేశ్ అత్యంత పిన్నవయస్సువానిగా మరో రికార్డును నెలకొల్పారు.

39 ఏళ్ల తర్వాత మంగళగిరిపై టీడీపీ జెండా

మంగళగిరిలో 39 సంవత్సరాల సుదీర్ఘ విరామం తరువాత మంగళగిరి నియోజకవర్గంపై పసుపు జెండా రెపరెపలాడింది. టీడీపీ ఆవిర్భావం నుంచి చూస్తే.. 1983, 85 సంవత్సరాలలో జరిగిన రెండు ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా డాక్టర్ ఎమ్మెస్సెస్ కోటేశ్వరరావు వరుసగా విజయాలను సాధించారు. ఆ తరువాతినుంచి మంగళగిరి నియోజకవర్గం పొత్తులలో భాగంగా మిత్రపక్షాలకు కేటాయించబడుతూ రావడం వలన అసెంబ్లీకి సైకిల్ గుర్తుపై పోటీచేసే అవకాశం కలుగలేదు. దరిమిలా 1989లో కాంగ్రెస్ అభ్యర్థి గోలి వీరాంజనేయులు, 1994లో సీపీఎం అభ్యర్థి నిమ్మగడ్డ రామ్మోహనరావు, 1999, 2004లో కాంగ్రెస్‌నుంచి మురుగుడు హనుమంతరావు వరుసగా రెండుమార్లు, 2009లో కాంగ్రెస్ అభ్యర్థిని కాండ్రు కమల, 2014, 2019లో వైసీపీ అభ్యర్థి ఆళ్ల రామకృష్ణారెడ్డి విజయం సాధిస్తూ వచ్చారు. దీంతో మంగళగిరి నియోజకవర్గం టీడీపికి ఓ అందని ద్రాక్షలా మారింది. మంగళగిరి నియోజకవర్గంపై తెలుగుదేశం జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతినబూనిన లోకేశ్ తన లక్ష్య సాధనకోసం అహర్నిశలు శ్రమిం మంగళగిరి ప్రజల హృదయాలను గెలుచుకున్నాడు.

క్లుప్తంగా లోకేశ్ బయోడేటా

నారా చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతులకు 1983 జనవరి 23న లోకేశ్ జన్మించారు. నాన్నది నారావారిపల్లె, అమ్మది నిమ్మకూరు. బాల్యమంతా లోకేశ్‌కు హైదరాబాద్‌లోనే గడిచింది. భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్‌స్కూల్, విద్యాశ్రమ్‌లో ప్రాథమిక విద్యాభ్యాసాన్ని పూర్తిచేశారు. ఇంటర్మీడియేట్ లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాల, హైదరాబాద్‌లో పూర్తిచేశారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఎంబీఏ చేశారు. అమెరికాలో కార్నెగీ మెలన్ వర్సిటీలో బీఎస్సీ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో డిగ్రీ కూడ చేశారు. అలా విద్యాభ్యాసం అయ్యాక హెరిటేజ్ ఫుడ్స్ వైస్ ప్రెసిడెంట్‌గా, హెరిటేజ్ ఫిన్‌లీజ్ లిమిటెడ్ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. వరల్డ్‌బ్యాంకు మద్దతుతో వివిధ దేశాలలో అమలయ్యే కెపాసిటీ బిల్డింగ్ ప్రాజెక్ట్, ఈ గవర్నెన్స్, కనెక్టివిటి సొల్యూషన్స్ అంశాలలో ప్రాజెక్టు మేనేజరుగా పనిచేసి 2006లో స్వదేశానికి చేరుకున్నారు. 2013లో పూర్తిస్థాయి రాజకీయ రంగప్రవేశం చేసి 2014లో టీడీపి అధికారంలోకి రావడంతో కీలకపాత్ర పోషించారు.

2024లో టీడీపి కూటమి అధికారంలోకి రావడంలో కూడ నారా లోకేశ్ పాత్ర గణనీయంగా ఉందనే చెప్పాలి. టీడీపి సభ్యత్వాల ద్వారా ప్రమాదబీమా కార్యకర్తల సంక్షేమనిధి ఏర్పాటుచేసిన నారా లోకేశ్ ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా విద్య వైద్యసేవలను కూడ వారికి అందిస్తున్నారు. శిక్షణ శిబిరాల ద్వారా 25వేల మంది యువనాయకుల్ని తయారుచేసిన కార్యక్రమ రూపకర్త కూడ లోకేశే కావడం గమనార్హం. 2015లో టీడీపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. 2018లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2018లో ఐటీ-ఎలక్ట్రానిక్స్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 30 ఏళ్ల వయస్సులోనే ముఖ్యమైన మూడు శాఖలకు మంత్రిగా పనిచేసి జాతీయ, అంతర్జాతీయ, స్కోచ్ అవార్డులను సొంతం చేసుకున్నారు. ఏ పొలిటికల్ అనే సంస్థ ప్రకటించిన జాబితాలో ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన యువ నాయకుల్లో మొదటి 20 స్థానాల్లో నిలిచిన ఏకైక భారతీయునిగా నాటి ఏపి మంత్రిగా లోకేశ్ రికార్డు సృష్టించారు. అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి కల్పన, విద్య, వైద్య, మౌలిక, పారిశ్రామిక, వ్యవసాయరంగాలపై స్పష్టమైన విజన్‌తో వున్న లోకేశ్ తాతకు తగ్గ మనుమడు, తండ్రిని మించిన తనయునిగా ప్రజల మన్ననలు అందుకుంటున్నారు.

రికార్డులు బద్దలు

మంగళగిరిలో రికార్డులు బద్దలయ్యాయి. నారా లోకేశ్ సరికొత్త చరిత్ర సృష్టించారు. 2019లో... ఓటమితో ఒకడుగు వెనకకు వేసినప్పటికీ.. మంగళగిరి నియోజకవర్గ చరిత్రలో ఇంతకుముందున్న అన్నీ రికార్డులను చెరిపేసి తనపేరిట అనితరసాధ్యమైన గ్రాండ్ విక్టరీ రికార్డును లిఖించారు. తన ప్రతీ సమావేశంలోనూ.. ప్రతీ బహిరంగసభలోనూ తాను ఈసారి మంగళగిరిలో 53,350 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి తీరుతానని చెప్పుకొచ్చేవారు. ఎన్నికల సమయంలో మాత్రం తనకు మంగళగిరిలో 70వేల మెజారిటీ ఖాయమని ఢంకా దబాయించి మరీ చెప్పారు. లోకేశ్ తన మెజారిటీని గురించి ఇంత గట్టిగా చెప్పడం పట్ల అందరూ ఆశ్చర్యచకితులయ్యారు.

మంగళగిరి నియోజకవర్గంలో మొత్తం 2,54,376 ఓట్లను లెక్కించవలిసివుండగా వాటిలో 3634 ఓట్లు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, మరో 64 ఈటీపీబీఎస్ ఓట్లుగా వున్నాయి. మిగతా 2,50,742 ఓట్లు ఈవీఎం ఓట్లుగా వున్నాయి. నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ తాడేపల్లి మండలం పెనుమాకతో ఆరంభమైంది. పెనుమాకలో మొత్తం ఎనిమిది పోలింగ్‌బూత్‌లు వుండగా ప్రతీ బూత్‌లోనూ సైకిల్ స్పీడుతోనే నడిచింది. ఆరంభగ్రామమైన పెనుమాకలో అందరి అంచనాలను తల్లకిందులు చేస్తూ టీడీపీకి 1684 ఓట్ల భారీ ఆధిక్యం లభించింది. రెండో రౌండ్ పూర్తయ్యేసరికి 8,411 ఓట్ల ఆధిక్యతను లోకేశ్ సాధించారు. మూడవ రౌండుకు 11,450 ఓట్ల ఆధిక్యత రాగా, నాల్గవ రౌండుకు ఈ ఆధిక్యత 15,114కు పెరిగింది, అయిదవ రౌండుకు అది కాస్త 17,227కు పెరిగింది. ఇక ఆరవ రౌండుకు 21,625, ఏడవ రౌండుకు 25,616, ఎనిమిదవ రౌండుకు 31,647, తొమ్మిదవ రౌండుకు 36,115, పదవ రౌండుకు 39,864, 11వ రౌండుకు 45,254, 13వ రౌండుకు 58,295, 14వ రౌండుకు 64,068 ఓట్ల ఆధిక్యంతో లోకేశ్ ముందుకు సాగారు. ఆరంభం నుంచి ఏఒక్క రౌండులోనూ లోకేశ్‌కు మైనస్ రాకపోవడం నిజంగా ఆశ్చర్యకరమనిపించింది. తాడేపల్లి పట్టణప్రాంతంలో లోకేశ్ కొంతమేర వెనుకబడవచ్చునన్న అంచనాలను కూడ తల్లకిందులు చేస్తూ లోకేశ్ అక్కడ కూడ మంచి మెజారిటీతో దూసుకుపోయారు. 15వ రౌండ్ ముగిసేసరికి లోకేశ్ మెజారిటీ 70వేల మైలురాయిని దాటేసింది. ఈరౌండుకు లోకేశ్ మెజారిటీ 70,077 భారీ ఆధిక్యానికి చేరింది. ఇక 16వ రౌండుకు లోకేశ్ మెజారిటీ 76,241 ఓట్లకు చేరింది. 17వ రౌండుకు 80,219, 18వ రౌండుకు 80,587 ఆధిక్యత లభించింది. వాస్తవానికి ఒక్క 18వ రౌండులో మాత్రమే లోకేశ్‌కు అతితక్కువ మెజారిటీ లభించిందని చెప్పాలి. ఈ రౌండులో కేవలం 638 ఓట్ల మెజారిటీ మాత్రమే దక్కింది. 19వ రౌండు పూర్తయ్యేటప్పటికి లోకేశ్ అధిక్యం 83, 563కి చేరింది. 20వ రౌండుకు ఇది 85,140కి, 21వ రౌండు పూర్తయ్యేసరికి 89,319కి చేరింది. 22వ రౌండు పూర్తయ్యే సరికి 90,160కి చేరింది.

చరిత్రని తిరగరాసి..

మంగళగిరి నియోజకవర్గ 72 ఏళ్ల ఎన్నికల చరిత్రలో తిరుగులేని మెజారిటీ సాధించి విజేతగా నారా లోకేష్ నిలిచి రికార్డు నెలకొల్పారు. 1952లో మంగళగిరి నియోజకవర్గానికి జరిగిన తొలి ఎన్నిక నుంచి ఇప్పటివరకూ అంటే 2024 సంవత్సరం వరకూ పోటీ చేసిన అభ్యర్థులలో అత్యధిక మెజారిటీ 91,413ఓట్ల రికార్డు నారా లోకేష్ సాధించారు. అప్పటి మదరాసు రాష్ట్రంలో భాగమైన మంగళగిరి నియోజకవర్గంలో 1952లో తొలిసారి ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసిన డి.లక్ష్మయ్య 17265 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఇదే ఇప్పటివరకూ అత్యధిక మెజారిటీ రికార్డు. 2024 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన నారా లోకేష్ మొత్తం 167710 ఓట్లు సాధించి తన ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యపై 91,413 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. మంగళగిరి నియోజకవర్గం 72 ఏళ్ల రికార్డుని అధిగమించిన నారా లోకేష్ సరికొత్త ట్రెండ్ సృష్టించారు.

నరసరావుపేట లోక్‌సభకు భారీగా క్రాస్ ఓటింగ్

● ఎమ్మెల్యే అభ్యర్థుల కంటే ఎంపీకి 35,954 ఓట్లు తగ్గిన మెజార్టీ

నరసరావుపేట, జూన్ 4: నరసరావుపేట లోక్‌సభ స్థానానికి భారీగా క్రాస్ ఓటింగ్ జరిగింది. నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను తెలుగుదేశం కైవసం చేసుకుంది. ఎంపీగా లావు శ్రీకృష్ణదేవ రాయలు వరుసగా రెండో సారి ఎన్నికయ్యారు. గెలుపొందిన ఏడుగురు అసెంబ్లీ అభ్యర్థుల కంటే ఎంపీ రాయలకు భారీగానే మెజార్టీ తగింది. ఏడుగురు అసెంబ్లీ అభ్యర్థులకు వచ్చిన మెజార్టీ మొత్తం 1,95,683 ఓట్లు, ఎంపీకి వచ్చిన మెజార్టీ 1,59,729 ఓట్లు. 35,954 ఓట్లు మెజార్టీ లావుకు తగ్గిం ది. పెద్ద ఎత్తున క్రాస్ ఓటింగ్ జరగడం టీడీపీలో చర్చనీయంశమైంది. ఎక్కడ ఎంత క్రాస్ ఓటింగ్ జరిగిందన్న అంశంపై నేతలు దృష్టి సారించారు.

జిల్లాలో మెజార్టీలో టాప్ జూలకంటి... చివరి స్థానంలో అరవిందబాబు

జిల్లాలో తెలుగుదేశం పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. ఒక లోక్‌సభ, ఏడు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంది. జిల్లాలో అత్యధిక మెజార్టీ సాధించిన జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రథమ స్థానంలో నిలిచారు. అయనకు 33,318 ఓట్లు ఆధిక్యత లభించింది. జిల్లాలో మెజార్టీలో నరసరావుపేట అభ్యర్థి డాక్టర్ అరవిందబాబు చివరి స్థానంలో ఉన్నారు. ఆయనకు 19,705 ఓట్ల మెజార్టీ లభించింది. చిలకలూరిపేట నుంచి గెలుపొందిన పత్తిపాటి పుల్లారావుకు 33,262 ఓట్ల మెజార్టీ, వినుకొండ విజేత జీవీ ఆంజనేయులకు 30,267, గురజాల అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుకు 29,486 కన్నా లక్ష్మీనారాయణకు 27,836, పెదకూర పాడు భాష్యం ప్రవీణ్ 21,809 ఓట్ల మెజార్టీ లభించింది.

యరపతినేనికి పెరిగిన మెజారిటీ


యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూన్ 4: 2024 ఎన్నికలలో గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుకు భారీ మెజారిటీ లభించింది. గతంలో మూడుసార్లు గెలుపొందినప్పటికీ ఈ ఎన్నికలలో భారీ ఆధిక్యత గురజాల ఓటర్లు యరపతినేనికి కట్టబెట్టారు. 1994 ఎన్నికలలో యరపతినేనికి 23,967 మెజారిటీ రాగా, 2009లో 10,021 మెజారిటీ లభించింది. 2014 ఎన్నికలలో 7,187 ఓట్ల మెజారిటీ లభించగా, 2024 ఎన్నికలలో 29,486 ఓట్ల ఆధిక్యతతో గురజాల ఎమ్మెల్యేగా నాల్గవ సారి యరపతినేని శ్రీనివాసరావు గెలుపొందారు. 2019 ఎన్నికలలో గురజాల నుండి వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన కాసు మహేష్‌రెడ్డికి వచ్చిన మెజారిటీ కంటే ఇప్పటి ఎన్నికలలో యరపతినేని శ్రీనివాసరావుకు అంతకు మించి మెజారిటీ రావడం జరిగింది.

ప్రతి రౌండ్‌లో యరపతినేనికే ఆధిక్యత

గురజాల శాసనసభ ఫలితాలు మొదటి నుండి ప్రతిరౌండ్‌లోనూ ఆధిక్యత కనబరుస్తూ గురజాల శాసనసభ్యులుగా ఎన్నికైన యరపతినేని శ్రీనివాసరావు ముందుకు దూసుకెళ్లారు. గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాలైన గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం మండలాల్లోనూ ప్రతి రౌండ్‌లో టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుకే ఆధిక్యత కనబరుస్తూ వచ్చింది. మొత్తం 23 రౌండ్లలో టీడీపీకే ఆధిక్యత లభించింది. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలోనూ టీడీపీకే పట్టం కడుతూ మహిళా ఓటర్లు అత్యధికంగా ఓట్లు వేసి తీర్పునివ్వడం జరిగింది.

జీవీకి.. మూడోసారి పట్టం


కేక్ కట్ చేస్తున్న జీవీ ఆంజనేయులు సతీమణి లీలావతి

వినుకొండ, జూన్ 4: వినుకొండ ప్రజలు జీవీ ఆంజనేయులకు మూడవసారి పట్టం కట్టారు. గడిచిన 20 ఏళ్లుగా ఆయన చేసిన సేవలకు బహుమానంగా మరోమారు ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజల కష్ట, సుఖాల్లో అండగా నిలిచారాయన. 2019 ఎన్నికల్లో ఒక్క చాన్సు అన్న జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో పాటు, వినుకొండ , పెదకూరపాడులో రెండుసార్లు ఓటమితో కుంగిపోతున్న బొల్లా బ్రహ్మనాయుడును ఒక్కసారి చూద్దామని ప్రజలు ఎమ్మెల్యేగా పట్టం కట్టారు. అధికారాన్ని అట్టుపెట్టుకుని అహంకార, దురుసు ప్రవర్తనను ప్రజలు ఐదేళ్లు భరించాల్సి వచ్చింది. ముఖ్యంగా రైతులను బెదిరించడం, ప్రతి ప్రక్ష పార్టీలపై, ప్రజా సంఘాలపై నోరు పారేసుకోవడం, నిరుపేదలను చిన్న చూపు చూడడం, విలేకరులను సైతం నోటికి వచ్చినట్లు దూషించి చెలరేగి పోయారు. చివరకు ప్రజలు ఓటు అనే ఆయుధంతో ఆయన్ను ఇంటికి పంపారు. అధికారం ఉన్నా లేకపోయినా జీవీ ప్రజల మనిషిగా ప్రజాదరణ పొందారు. సొంతనిధులతో సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజల హృదయాల్లో చరగని ముద్ర వేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు, నూతనంగా ఏర్పాటైన పల్నాడు జిల్లా తెలుగు దేశం పార్టీ అభివృద్ధికి పాటు పడుతూ, ఏడు నియోజకవర్గాల విజయానికి నాంది పలికారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నియంత పాలనకు ప్రజలు బుద్ధి చెప్పారు

● నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా

● విలేకర్ల సమావేశంలో ఆనందబాబు


మాట్లాడుతున్న ఆనందబాబు

వేమూరు, జూన్ 4: అహంభావంతో విర్రవీగుతూ ప్రజాస్వామ్యాన్ని కాలరాచి నియంతగా వ్యవహరించిన జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని అందుకు ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానంటూ వేమూరు అసెంబ్లీ అభ్యర్థిగా ఘన విజయం సాధించిన నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. మంగళవారం ఫలితాలు వెలువడిన వెంటనే ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి నియంత పాలనతో రాష్ట్ర ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తపరిచారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మొక్కవోని దీక్షతో ప్రజల కోసం ఎన్నో అవమానాలను భరించి అకుంఠిత దీక్షతో పోరాటాలు చేశారన్నారు. ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులందరూ కూడా ప్రజల కోసమే చేయి కలపడం జరిగింది. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కూడా రాష్ట్రం, ప్రజల పరిస్థితులను గుర్తించి ప్రజాస్వామ్యాన్ని కాపాడలన్న ఆలోచనతో కూటమిగా ఏర్పడం జరిగిందన్నారు. చంద్రబాబు పాలన ద్వారా బాధ్యతాయుతమైన విధానంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళతామన్నారు. జగన్ పాలనలోచట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించి ప్రజలను టీడీపీ శ్రేణులను అనేక రకాలుగా వేదింపులకు గురిచేసిన నాయకులు, వారికి తొత్తులుగా వ్యవహరించిన అధికారులను కూడా వదిలిపెట్టేది లేదన్నారు. లోకేష్ పాదయాత్ర ఎంతగానో ఫలితాలను చూపిందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎంతో రుణపడి ఉంటానని న్యాయబద్ధంగా అందరికి అందుబాటులో ఉండి అభివృద్ధి, సంక్షేమంతో పాటు సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానన్నారు. తన విజయానికి శ్రమించిన జనసేన, టీడీపీ శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి విజయంతో అంబరాన్నంటిన సంబరాలు


రంగులు చల్లుకుంటూ పొక్లెయిన్ ఎక్కి ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు, యువతులు

● ఐదేళ్ల పోరాట శ్రమను మరిచిపోయిన రైతులు రైతు కూలీలు, మహిళలు

● మోకాళ్ల మీద నిలబడి రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన అమరావతి మహిళలు

తుళ్లూరు, జూన్ 4: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయంతో రాజధాని గ్రామాలలో మంగళవారం సంబరాలు అంబరాన్ని అంటాయి. పెద్ద ఎత్తున్న బాణాసంచా కాల్చారు. మహిళలు రంగులు అద్దుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు. రెండు పాదయాత్రలతో రాష్ట్ర ప్రజలకు తమ గోడు వినిపించుకున్నారని, జీవనాధారమైన భూములు ఇస్తే నడిరోడ్డు పాలు చేసిన జగన్‌రెడ్డి దుర్మార్గాన్ని ప్రజలు విని అమరావతిని గెలిపించారని ఆనంద భాష్పాలు రాల్చారు. తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో మోకాళ్ల మీద నిలబడి చేతులు జోడించి నమస్కారం చేసి రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి విజయం ఖాయమని చూసిన తరువాత తృప్తిగా శిబిరంలోనే భోజనాలు చేశారు. ఐదేళ్ల న్యాయమైన పోరాటం ఫలించిందన్నారు.


మందడం గ్రామంలో సంబరాలు జరుపుకుంటున్న మహిళలు


రాయపూడిలో బాణసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకుంటున్న గ్రామస్తులు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పదును చూపిన ప్రజల విజ్ఞత

ఉత్కంఠకు, ఆకాంక్షలకు తగ్గట్టుగానే, ఎన్నికల ఫలితాలు సంభ్రమాశ్చర్యాలు కలిగించాయి. ఉక్కపాదాల నుంచి, ఉక్కపోతల నుంచి, దుష్పరిపాలనల నుంచి ఉపశమనం కలిగించాయి. ఆగ్రహానికి, నిరాదరణకు పాత్రులైన నాయకులను, వారి ప్రభుత్వాలను నిర్దాక్షిణ్యంగా ప్రజారంగం నుంచి నెట్టివేశాయి. తిరుగులేని, ఎదురులేని నాయకులనుకున్న వారి ఒద్దూపొడుపూ కత్తిరించి బుద్ధి చెప్పాయి. 2024 ప్రజల తీర్పు భారత రాజకీయరంగాన్ని తిరిగి సంచలనశీలంగా మార్చింది. పదేళ్ల ఏకపక్ష పాలన స్థానంలో తిరిగి సంకీర్ణ రాజకీయాలను ప్రవేశపెట్టింది. జాతీయ రంగస్థలం మీద తెలుగువారి ప్రమేయానికి పట్టం కట్టింది.

భారతీయ జనతాపార్టీకి మెజారిటీ బహుదూరంలోనే నిలిచిపోయింది. ఎన్‌డీఏలోని భాగస్వామ్యపక్షాల సహకారంతో మాత్రమే తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి సాగనంపారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి కనీవినీ ఎరుగని ఘనవిజయం సాధించింది. కేంద్రంలోని కొత్త ప్రభుత్వంలో తెలుగుదేశం, ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కీలకపాత్ర పోషించనున్నారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్‌కు నిరుత్సాహకరమైన ఫలితాలు వచ్చాయి. గత లోక్‌సభలో నాలుగు స్థానాలు పొందిన తెలంగాణ బీజేపీ తన బలాన్ని రెట్టింపు చేసుకుంది. గత సభలో మూడు స్థానాల బలమే ఉన్నప్పటికీ, ఇటీవల రాష్ట్రంలో అధికారం పొందినందున, మెరుగైన ఫలితాలు సాధించవలసిన కాంగ్రెస్ తన సంఖ్యను ఎనిమిదికి మించి పెంచుకోలేకపోయింది.

వైసీపీ ప్రభుత్వం ఘోరపరాజయం పూర్తిగా స్వయంకృతం. ప్రత్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఏకరువు పెట్టిన జగన్ ప్రభుత్వ దుర్మార్గాలకంటే, ప్రజల అనుభవంలోకి వచ్చినవి కొన్ని రెట్లు ఎక్కువ అని ఈ ఫలితాలు చెబుతున్నాయి. వైసీపీ ని అనేక జిల్లాలనుంచి ఏకమొత్తంగానూ తుడిచిపెట్టారంటే, దుష్పరిపాలన తీవ్రత ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. రెండంకెల సంఖ్యకు కూడా చేరుకోలేక కునారిల్లుతూ, ప్రతిపక్ష స్థాయి కూడా దక్కనంత స్వల్పమైన ఉనికి మిగిలిన ఆ పార్టీ తన దుస్థితికి కారణాలను సమీక్షించుకుని సుదీర్ఘ కాలం నిరీక్షించవలసిందే.

కూటమి 21 లోక్‌సభ స్థానాలను సాధించగా, అందులో తెలుగుదేశం సొంతంగా 16 స్థానాలు సంపాదించింది. కేంద్రంలో మెజారిటీ కొరవడిన బీజేపీకి టీడీపీ ఇప్పుడు అత్యంత అవసరమైన, కీలకమయిన భాగస్వామి. బీజేపీ తరువాత అత్యధిక స్థానాలు సాధించిన ఎన్‌డీఏ భాగస్వామి తెలుగుదేశమే. గత రెండు పదవీకాలాల్లో కూడా పేరుకు ఎన్‌డీఏ ప్రభుత్వమే అయినా, తనకు సొంతంగా మెజారిటీ ఉన్నందున నామమాత్రపు సంకీర్ణంగా మాత్రమే వ్యవహరించిన బీజేపీ, ఈసారి అనివార్యంగా భాగస్వామిక రాజకీయాలను అంగీకరించవలసి వస్తుంది. తెలుగుదేశంపార్టీకి, బీహార్‌కు చెందిన జనతాదళ్ యునైటెడ్‌కు వాస్తవ అర్థంలో తగినప్రాధాన్యం విధిగా ఇవ్వవలసి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి విషయంలో అలక్ష్యం చూపుతున్నందుకు, బీజేపీ ఇతర విధానాలపై నిరసనగాను గతంలో ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి వెలుపలికి వచ్చిన తెలుగుదేశం పార్టీకి, ప్రస్తుత విజయాలు మంచి సానుకూలతను సమకూర్చాయి. రాజధాని, పోలవరం వంటి అభివృద్ధి అంశాల మీద కేంద్రం నుంచి తగిన స్పందనను రాబట్టగలిగే శక్తి టీడీపీకి ఇప్పుడున్నది. చంద్రబాబు నాయుడుకు ఉన్న అపారమైన అనుభవం, కార్యదక్షత వల్ల జాతీయ రంగంలో కూడా ఆయన క్రియాశీల బాధ్యతలు నిర్వహించగలరని, బీజేపీ ప్రభుత్వం దూకుడుకు కళ్లెం వేయగలిగేది కూడా చంద్రబాబేనని ఆశాభావాలు వ్యక్తమవుతున్నాయి.

బీజేపీ ఎనిమిది విజయాలను, బీఆర్ఎస్ సున్నా స్కోర్‌తో కలిపి చూస్తేనే తెలంగాణ ఫలితాలు అర్థమవుతాయి. గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పరాజిత బీఆర్ఎస్‌కు వచ్చిన సుమారు 37 శాతం ఓట్లు పార్లమెంటు ఎన్నికలలో ఎవరికి మళ్లుతాయన్న చర్చ జరుగుతూ వచ్చింది. గణనీయభాగం బీజేపీకి పోయినట్టు అర్థమవుతోంది. కేంద్రంలో మహాబలంతో బీజేపీ ప్రభుత్వం ఉండి ఉంటే, ఈ గెలుపులు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగించి ఉండేవి. ఇప్పుడు, పరిమిత బలం కలిగిన కేంద్రమే ఉంటుంది కాబట్టి, తక్షణ ప్రమాదం లేదు కానీ, పరిస్థితిని మెరుగుపరుచుకోకపోతే కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు కూడా ఇబ్బందులే ఎదురవుతాయి.



తెలుగు రాష్ట్రాల పరిణామాలకు మించిన ప్రాధాన్యం కలిగినవి, దేశ రాజకీయాల గతినే మార్చగలిగేవి పద్దెనిమిదో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు. తెలంగాణలో బీజేపీ, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించాయి కానీ, జాతీయస్థాయిలో బీజేపీకి తీవ్రమైన ఎదురుదెబ్బలు తగిలాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలలో ఆ పార్టీ కొత్తగా అధికారంలోకి రాగలుగుతోంది. మధ్యప్రదేశ్, గుజరాత్, ఒడిశా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలోనూ ఘనవిజయాలు సాధించింది. కేరళ వంటి రాష్ట్రంలో ఒక స్థానం గెలవగలిగింది. ఈ విజయాలన్నిటి కంటె, మెజారిటీ ఎదురైన కొరతే బీజేపీకి అతి పెద్ద నష్టం. గత లోక్‌సభలో 303 స్థానాల బలమున్న బీజేపీ, కొత్త లోక్‌సభలో 240 దరిదాపుల్లో సంతృప్తిపడవలసి వచ్చింది. మైనారిటీ ప్రభుత్వాన్ని నడపడం బీజేపీకి కొత్త కాదు. 1999 ఎన్నికలలో బీజేపీ 182 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. అయినా మిత్రపక్షాలతో కలిసి ఒకటో ఎన్‌డీఏ ప్రభుత్వం నడిపింది. కానీ, 2014లో 282, 2019లో 303 స్థానాలను గెలుచుకుని సంకీర్ణ ప్రభుత్వాల పేరుతో తన సొంత ప్రభుత్వాలనే నడిపింది. ఈసారి, సొంతంగా 370 స్థానాలు గెలవాలని, మిత్రులతో కలసి 400 గెలవాలని ఆశించింది. అవి కేవలం సంఖ్యలు కావు. మూడింట రెండు స్థానాల మెజారిటీ కోసం 370, కాంగ్రెస్ 1984 రికార్డును అధిగమించడం కోసం 400 అంకెలను ఎంచుకున్నారు. అధిక మెజారిటీ కోరుకున్నది రాజ్యాంగ సవరణలకు వెసులుబాటు కోసమే కావచ్చు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి అదే ఆయుధంగా మారింది. రాజ్యాంగాన్ని మార్చబోతున్నారని, రాజ్యాంగం అట్టడుగు వర్గాలకు కల్పించిన ప్రత్యేక రక్షణలను తొలగించబోతున్నారని ప్రతిపక్షం చేసిన ఆరోపణ ఓటర్ల మీద తీవ్రంగా ప్రభావం చూపినట్టు, సామాజికవర్గాల వారీ ఓటింగ్ శాతాలు సూచిస్తున్నాయి.

పదిహేనేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని దాదాపు రెట్టింపు చేసుకోగలగడానికి ఆ పార్టీ మిత్రపక్షాలతో చూపించిన సర్దుబాటు వైఖరి, రాహుల్ జోడో యాత్రలు, విస్పష్టమైన విధానాలతో వైఖరుల రూపకల్పన ముఖ్యమైన కారణాలు. బీజేపీ విస్తరణను అడ్డుకోగలిగిన మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రేలను ప్రధానంగా చెప్పుకోవాలి. ప్రతిపక్ష పార్టీలను, మాజీ మిత్రపక్షాలను చీలికల ద్వారా బలహీనపరచాలనే ఆలోచనను ప్రజలు సమ్మతించరని మహారాష్ట్ర నిరూపించింది. ద్రవిడ వాదానికి తాను పెట్టనికోటనని తమిళనాడు మరోసారి నిరూపించుకుంది. దేశంలోని ఈ నాయక బాహుళ్యం ఎక్కడికక్కడ ఆత్మరక్షణ చేసుకోవడంతో పాటు, అవాంఛనీయమైన అధిక మెజారిటీలను నిరోధించగలిగింది. పాపం, నవీన్ పట్నాయక్ బీజేపీని సొంతంగా ఢీకొని, నష్టపోయారు.

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటికి, బీజేపీ ఘనవిజయమే ఖాయమన్న అభిప్రాయం దేశంలో నెలకొని ఉన్నది. అధికారపక్షం తగిన రాజకీయ నినాదాలతో సర్వసన్నద్ధంగా ఉన్నట్టు కనిపించింది. మొదటి రెండు దశల ప్రచారంలో సాధారణ అంశాలే వినిపించగా, మూడోదశనుంచి ప్రధాని మాటలో తీవ్రత, విభజనవాదం పెరిగాయి. ప్రధానిహోదాను కూడా ఖాతరు చేయకుండా, ఊహించని రీతిలో నరేంద్రమోదీ మాట్లాడసాగారు. ఆయన అట్లా మాట్లాడడానికి, ఓటర్లలో కనిపిస్తున్న అనాసక్తి కారణమన్న విశ్లేషణలు మొదలయ్యాయి. తక్కిన అన్నిదశలలోను, చివరి రోజుతో సహా, నరేంద్రమోదీ వివాదాస్పదమైన అంశాలే మాట్లాడుతూ వచ్చారు. మోదీ రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటున్నారని ఇండియా కూటమి, కాంగ్రెస్ కూటమి బీసీ, ఎస్సీల రిజర్వేషన్లు తగ్గించి ముస్లిములకు ఇవ్వాలనుకుంటున్నదని మోదీ పరస్పర ఆరోపణలు సంధించుకున్నారు. మోదీ విభజన వాదానికి పెద్దగా ఆమోదం లభించలేదని ఫలితాలు సూచిస్తున్నాయి. అంతేకాదు, రామమందిర ప్రతిష్ఠను, రాజకీయాలను ప్రజలు వేరువేరుగానే పరిగణించారని తెలుస్తోంది. అయోధ్య (ఫైజాబాద్) స్థానంలో బీజేపీ ఓడిపోయిందంటే అర్థం ఏమిటి?

ఉమ్మడి పౌరస్మృతి, రాజ్యాంగం నుంచి సెక్యులర్ పదం తొలగింపు, ఒకే దేశం–ఒకే ఎన్నిక, నియోజకవర్గాల పునర్విభజన, జీఎస్టీ పరిధిలోకి పెట్రో ఉత్పత్తులు వంటి అనేక అంశాలు బీజేపీ ఎజెండాలో ఉన్నాయి. ఈ అంశాలపై ప్రతిపక్షాలకు, ప్రాంతీయ పార్టీలకు భిన్నాభిప్రాయాలు, సొంత ప్రతిపాదనలు ఉన్నాయి. వీటికి సొంతంగా అధిక మెజారిటీ కావాలి, రాష్ట్రాలలో కూడా సొంతప్రభుత్వాలు ఉండాలి. ప్రాంతీయ పార్టీలను సాధ్యమైనంతగా అప్రధానం, బలహీనం చేయాలన్నది మోదీ నాయకత్వంలోని బీజేపీ ఆశయం. తమ ప్రభుత్వాలు ఉన్నచోట తప్ప, ఇతర ప్రభుత్వాలు ఉన్న చోట, ముఖ్యంగా ప్రాంతీయపార్టీలు ఉన్న ప్రభుత్వాలు ఉన్నచోట నిధుల పంపకంలో గానీ, గవర్నర్ల జోక్యంతో కానీ ఇబ్బందులు కల్పించడం గత పదేళ్లుగా చూస్తూ ఉన్నదే. అయితే, అనుకున్నంత బలం సమకూరదేమోనన్న భయం ఏ మూలో ఉండడంతో బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయపార్టీలతో కూటమిలోకి వచ్చింది.

ఎవరిమీదా ఆధారపడనక్కరలేని స్థితిలో, కేంద్రప్రభుత్వ దర్యాప్తు ఏజెన్సీలను ప్రతిపక్షాల మీద ప్రయోగించడానికి, రాజకీయనేతలను జైళ్లలో పెట్టడానికి బీజేపీ ప్రభుత్వానికి వెసులుబాటు లభించింది. రాష్ట్రాల అధికారాలను కుదించే అనేక నిర్ణయాలను కూడా గత పదేళ్లలో యథేచ్ఛగా తీసుకోగలిగారు. సంకీర్ణ ప్రభుత్వాలను నడిపేవారు ఏకాభిప్రాయ సాధనలో నిమగ్నం కావలసి ఉంటుంది. అందుకు వాజపేయి, మన్మోహన్ సింగ్‌కు ఉన్నటువంటి మృదు స్వభావం అవసరం. నరేంద్ర మోదీ తానే మూడోసారి ప్రధాని కాదలచుకున్నట్టు, మంగళవారం సాయంత్రం ఢిల్లీలో పార్టీ కార్యక్రమంలో ఇచ్చిన సందేశం సూచిస్తోంది. ప్రస్తుత విజయాన్ని ఎన్డీఏ విజయంగానే చెబుతున్నారు. రాబోయే ప్రభుత్వాన్ని ఎన్‌డీఏ ప్రభుత్వంగానే సంబోధించారు. అవినీతిపై చండశాసనంలో తగ్గేదే లేదని, వికసిత్ భారత్ లక్ష్యాల సాధనలో ముందుకే వెడతామని ఆయన గట్టిగా చెప్పారు. 2019 నాటి సంబరాలతో పోల్చినప్పుడు, ఇప్పటి పార్టీ కార్యక్రమం నీరసంగానే కనిపించింది.

లోక్‌సభ ఫలితాలు మోదీ పరాజయాన్నే సూచిస్తున్నాయని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. బీజేపీ ఎన్నికల ప్రచారం అంతా మోదీ వ్యక్తి ప్రతిష్ఠచుట్టూ జరిగినందున, మెజారిటీ పొందలేకపోవడం మోదీ వ్యక్తిగత అపజయంగా పరిగణించడంలో తప్పేమీ లేదు. మోదీ, అమిత్ షా ఇద్దరే మొత్తం పరిపాలనాచక్రాన్ని, రాజకీయచక్రాన్ని ఇంత కాలం తిప్పుతూ వచ్చినందున, సంప్రదింపులు, సమన్వయం అవసరమైన నూతన ప్రభుత్వాన్ని వారు సౌకర్యంగా నిర్వహించగలరా అన్న అనుమానం రావడం సహజం. తాను తప్పుకుంటానని మోదీ పార్టీ ముఖ్యుల ముందు ప్రస్తావించారేమో తెలియదు కానీ, ప్రస్తుతానికి పాత నాయకద్వయమే అగ్రపీఠాలపై కొనసాగుతారనిపిస్తోంది.

ఇండియా కూటమి నుంచి చంద్రబాబు నాయుడుకు, నితీశ్ కుమార్‌కు సూచనలు వెళ్లాయని చెబుతున్నారు కానీ, వారు అందుకు అంగీకరించే అవకాశం లేదు. ఈ తరుణంలో వారు తమ భాగస్వాములను మార్చుకోవడం నైతికం కాదు. కాకపోతే, ప్రజాస్వామిక సంప్రదాయాలను అనుసరించేట్టు, విభేదించేవారితోనూ విపక్షాలతోనూ వేధింపు ధోరణిలో వ్యవహరించకుండా బీజేపీని మిత్రపక్షాలు కట్టడి చేయగలిగితే బాగుండునని ప్రజాస్వామికవాదులు ఆశిస్తున్నారు.

ఈ ఎన్నికలు నిరూపించిన మరొక ముఖ్యమైన అంశం, మతం పేరుతో, జాతీయత పేరుతో ఎంతటి ఉద్వేగాలను వ్యాపింపజేసినా, అవి దైనందిన జీవన సమస్యల నుంచి ప్రజలను ఎంతోకాలం దృష్టి మళ్లించలేవు. ఈ ఎన్నికలఫలితాలు గ్రామీణ భారతంలోని సంక్షోభపరిస్థితులను సూచిస్తున్నాయని, ప్రజలు స్పష్టంగా ఒక సంకేతం పంపించారని విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రజాప్రతినిధుల అరాచక హింసోన్మాదాన్ని, అవినీతిని ఓటు ఆయుధంతో తిప్పి కొట్టిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు, తమ కొత్త ప్రభుత్వం ద్వారా విభజనానంతర సమస్యల పరిష్కరించుకుంటారని, అన్ని హంగుల రాజధానితో సహా అభివృద్ధి ఆకాంక్షలన్నిటిని సాధించుకుంటారని ఆశిద్దాం. ●

బాబు నాయకత్వానికి, కూటమి దక్షతకు పట్టం

చంద్రబాబు పాలనలో 2014–19 మధ్య అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాలు లబ్ధిపొందాయి. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం సమపాళ్లలో జరిగింది. ప్రజాస్వామ్యయుతంగా పాలన నడిచింది. 2019–24 మధ్య జగన్ పాలన చంద్రబాబు పాలనకు పూర్తి విరుద్ధంగా నడిచింది. ఆ తేడాను ప్రజలు అనుభవపూర్వకంగా అర్థం చేసుకున్నారు. జగన్‌ను గెలిపించి మోసపోయామని ప్రజలు బాధపడుతున్న సమయంలో అక్రమ కేసులతో చంద్రబాబును 53 రోజులు జైల్లో నిర్బంధించారు. భువనేశ్వరిని శాసనసభలో అవమానపరచడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. లోకేష్ ప్రజాగళాన్ని అడ్డుకోవడం, పవన్‌కళ్యాణ్ వ్యక్తిత్వంపై దాడి చేయడం ప్రజలకు కోపాగ్ని రగిల్చింది. అంతిమ నిర్ణేతలు ప్రజలే గాని నిర్బంధాలు, మద్యం పీపాలు కాదని ఈ ఎన్నికలు రుజువు చేశాయి.

ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఇది అతిపెద్ద ప్రజా తీర్పు. జగన్‌కు ప్రతిపక్ష హోదాను కూడా ప్రజలు ఇవ్వలేదు. విధ్వంసం నుండి రాష్ట్రాన్ని చంద్రబాబు పాలన మాత్రమే గట్టెక్కించగలదని ప్రజలు భావించి ఇచ్చిన తీర్పు ఇది. మోసపోయిన పేదలు ఇచ్చిన తీర్పు. జీవిత కోసం యువత ఇచ్చిన తీర్పు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఇచ్చిన తీర్పు. తమ ఆస్తులు, ప్రాణాలు కాపాడుకోవడానికి సకల జనులు ఇచ్చిన తీర్పు. ప్రజాస్వామ్య పరిరక్షణకు మేధావులు ఇచ్చిన తీర్పు. మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నాయకత్వాలకు ప్రజలు పట్టం కట్టిన తీర్పు.

ఈ అధికారం చంద్రబాబుకు పూలబాట కాదు. రూ. 13 లక్షల కోట్లు అప్పుతో ఏడాదికి రూ.50 వేల కోట్ల వడ్డీ, అసలు వాయిదాల చెల్లింపు భారం మోయాల్సి వుంది. వివిధ వర్గాలకు జగన్ పెట్టిన బకాయిలు రూ.2 లక్షల కోట్ల చెల్లింపులు చేయాల్సి వుంది. మేనిఫెస్టో హామీలు అమలు చేయాలి. పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానం చేయాల్సి వుంది. అమరావతి నిర్మాణం చేసి ఉద్యోగాలు, సంపద సృష్టి చేయాల్సి ఉంది. నీలి మీడియా, జగన్ మాఫియా దుష్ప్రచారాలు, దాడులు ఎదుర్కోవాల్సి వుంటుంది. ఈ విజయంతో కూటమి శ్రేణులు నమ్రత పెంచుకుని ప్రజాభిమానాన్ని మరింత పెంచుకోవాలి.



2004లో చంద్రబాబు ఓడిపోకుండా వుంటే నేడు ప్రతి జిల్లా కేంద్రం మరో సైబరాబాద్ అయి వుండేది. 2019లో ఓడిపోకుండా వుంటే నేటికి 175 నియోజకవర్గ కేంద్రాలు ఉపాధి కల్పనా కేంద్రాలుగా అభివృద్ధి అయి వుండేవి. రాష్ట్రానికి జగన్ విధ్వంసం వల్ల కలిగిన నష్టాన్ని అధిగమించాలి. అందుకు చంద్రన్న నాయకత్వమే తగినదని ప్రజలు నిర్ణయించారు. అందుకే, క్లాసు, మాసు ఒక్కటై బందిపోట్ల ముఠాను చిత్తుచిత్తుగా ఓడించాయి. జగన్ అండ్ కో ఒక్కో కుటుంబంపై రూ.8 లక్షల భారం మోపాడు. విషపూరిత మద్యం పోసి 35 లక్షల మంది పేదల ఆరోగ్యాలను పాడు చేశాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రవర్ణ పేదల అసైన్‌మెంట్ భూములు 10 లక్షల ఎకరాలు కొల్లగొట్టారు. లక్ష కోట్ల సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించాడు. పంచాయతీలు, మున్సిపాలిటీల నిధులు దారిమళ్లించి స్థానిక పాలనను నిర్వీర్యం చేశారు. పోలవరాన్ని గండికొట్టి కరువుకోరలకు ప్రజల్ని బలిపెట్టాడు. విశాఖ భూ కబ్జాల కోసం అమరావతిపై నిందలు మోపి ఉద్యోగాలు, సంపద సృష్టించే రాజధాని లేకుండా చేశాడు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం మాఫియాగా మారి రూ.10 లక్షల కోట్ల విలువ గల ప్రకృతి వనరుల్ని, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారు. ప్రయివేట్ ఆస్తుల్ని, భూముల్ని కబ్జా చేయడానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చారు. ప్రశ్నించిన పౌరుల్ని, మీడియాను, మేధావుల్ని, ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టి జైళ్లలో తోయించాడు. చిన్నాన్న హంతకుల్ని కూడా కాపాడే దుర్మార్గ స్థితికి దిగజారాడు. తన నేరాలు, ఘోరాల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికి కుల, మత, ప్రాంతీయ విద్వేషాల్ని రెచ్చగొట్టాడు. పదిచ్చి వంద గుంజుకొన్న వైనాన్ని పేదలు అర్థం చేసుకున్నారు. తన స్వార్థ రాజకీయం కోసం 30 మందికి పైగా పింఛన్‌దారుల ప్రాణాలు పోగొట్టి శవ రాజకీయం చేశాడు. గులకరాయి దాడి కథ నడిపి ఓ బీసీ బిడ్డను 45 రోజులు జైలుపాలు చేశాడు. కోడికత్తి డ్రామాతో దళిత యువకుడ్ని ఐదేళ్ళు జైలుపాలు చేశాడు. పేదల్ని ఇలా కాల్చుకు తిని పేదల మనిషిగా కపట ప్రేమ ఒలకబోశాడు. పేదల ద్రోహి జగన్ అని, పేదల పెన్నిధి చంద్రన్న అని గుర్తించి వైకాపాకు పేదలు తగిన శాస్తి చేశారు. అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాలు కూటమికి అఖండ విజయం చేకూర్చాయి. రాష్ట్ర చరిత్రలో ప్రతిపక్ష నాయకత్వ హోదా కోల్పోయింది జగన్ ఒక్కడే.

– గురజాల మాల్యాద్రి
టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి

మోదీ మ్యాజిక్ ఏమయింది?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'రాసిన అక్షరం కన్నా ఉపన్యాసాలే జనాన్ని ప్రభావితం చేస్తాయని నాకు తెలుసు. మహా మహా రచయితలు సాధించలేని మార్పు ఈ భూమిపై గొప్ప వక్తలే సాధించారు' అని జర్మనీ నియంత హిట్లర్ తన ఆత్మకథ 'మెయిన్ కాంఫ్' (ఆంగ్లంలో 'మై స్ట్రగుల్') ముందుమాటలో రాశారు. కాని నేతలు ఎంత గొప్ప వక్తలైనా వారి మాటల్లో నిజాయితీ లేకపోతే, రోజుకో రకంగా మాట్లాడితే, మాట్లాడిన మాటల్లో అబద్ధాలున్నాయని తేలితే ప్రజలు ఆ మాటల్ని విశ్వసించరని ఎవరికి ఎప్పుడు ఎలా బుద్ధి చెప్పాలో వారికి బాగా తెలుసని మంగళవారం నాడు వెల్లడైన 18వ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఈ ఫలితాలను సువర్ణ ఘట్టంగా భావించవచ్చు.

ఒక దశాబ్ద కాలం (2014-24)లో దేశంలో అన్ని వ్యవస్థలపై పట్టు సాధించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ తానేమి చేసినా ప్రజలు హర్షిస్తారని, కేవలం తన ప్రచారంతోనే వారు మైమరిచిపోయి బీజేపీకి పట్టం కడతారని ఆశించినట్లు అర్థమవుతోంది. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా ఆయన దాదాపు 200 ఎన్నికల సభల్లో ప్రసంగించారు. వివిధ భాషల్లో కనీసం 50 టీవీ ఛానెల్స్‌కు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఎన్నికలు లేనప్పుడు కూడా ఆయన నెలకు కనీసం 20 ప్రసంగాలు చేశారు. టీవీ ఛానెల్స్, సోషల్ మీడియా యుగం కనుక తన హావభావాలతోనూ, ధ్యానముద్రలతోనూ కూడా జనాన్ని ఆయన ప్రభావితం చేయాలనుకున్నారు. తన పేరును తానే వందలసార్లు ఉచ్చరించారు. బీజేపీకి స్టార్ క్యాంపెయినర్లు ఎంతో మంది ఉన్నప్పటికీ మోదీయే అసలైన స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరించారు. నూతన పార్లమెంట్ భవనం ప్రారంభం నుంచి రాముడి ప్రాణప్రతిష్ఠ వరకు తానొక్కడే అన్నట్లుగా వ్యవహరించారు. పదే పదే ఒకే మాట చెబితే జనం నమ్ముతారేమోనని భావించి చార్ సౌ పార్ (400కు పైగా) సీట్లు సాధిస్తామని చెప్పుకున్నారు. కాంగ్రెస్ ఈ సారి 50 సీట్లు కూడా దాటదని చెప్పారు. తానేది చెబితే జనం అది నమ్ముతారని పరిపూర్ణంగా విశ్వసించిన మోదీ ప్రతిపక్షాలు ప్రజల వనరులను ముస్లింలకు పంచిపెడతారని చెప్పేందుకు కూడా వెనుకాడలేదు. మహాత్ముడిపై రిచర్డ్ అటెన్ బరో సినిమా తీయక ముందు గాంధీ ఎవరో లోకానికి తెలియదని చెప్పేందుకు కూడా ఆయన తెగించారు.

రోజురోజుకూ ఒక వ్యక్తి కేంద్రీకృత వ్యవస్థగా మారిన భారతీయ జనతా పార్టీకి మోదీ తిరుగులేని నాయకుడే కావచ్చు. ఆయన నాయకత్వానికి ఆయనే ముగ్ధుడై తనది కారణ జన్మ అని, దేవుడే తనను పంపించాడని చెప్పుకున్నారు. పూరీ జగన్నాథుడే మోదీ భక్తుడని బీజేపీ అధికార ప్రతినిధి ఒకరు వాక్రుచ్చారు. మోదీ నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ నిర్మాణపరంగా ఎంతో ఎదిగిపోయిందని, దానికి ఆర్ఎస్ఎస్ వంటి సంస్థ అవసరం ఇక ఏ మాత్రం లేదని భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాయే ప్రకటించారు. గంటకు పైగా ఇంటర్వ్యూలు చేయడం తప్ప ప్రజల మనసుల్లో ఉన్న ప్రశ్నలను లేవనెత్తాలని జర్నలిస్టుల రూపంలో వచ్చిన టీవీ ప్రతినిధులు కూడా అనుకోలేదు. ఏమైతేనేం దాదాపు 80 రోజులుగా జరిగిన ఎన్నికల ఘట్టంలో ఎన్నో నాటకీయ దృశ్యాలు, భావోద్వేగ ప్రసంగాలు, ఉత్కంఠభరితమైన సన్నివేశాలు చూసే అవకాశం కలిగింది. అంతిమంగా ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన దాదాపు డజన్ సంస్థలు ఎన్డీఏకు 350కి పైగా స్థానాలు లభిస్తాయని, మోదీ అన్నట్లుగా 400 దాటినా ఆశ్చర్యపోనక్కర్లేదని ప్రకటించడంతో ఈ దేశంలో మీడియా సంస్థల ధైర్యం ఎంత దిగజారిపోయిందో, ఎందుకు వారు భయోత్పాతానికి గురయ్యారో అర్థం అవుతుంది. కేవలం షేర్ మార్కెట్ పతనం కాకుండా ఉండేందుకే వారు అలా చేశారా అన్న అనుమానాలూ లేకపోలేదు.

నిజానికి మోదీని ఢీకొనడం అంత సులభం కాదని, ఆయన ఏ విధంగానైనా తాను అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని అనుకున్నవారే ఎక్కువగా ఉన్నారు. చండీగఢ్‌లో మేయర్ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లలో మార్పులు చేయడం, సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పేరును ప్రతిపాదించినవారు రిటర్నింగ్ అధికారి వద్దకు రాలేకపోవడం, ఇండోర్‌లో నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి చివరి నిమిషంలో నామినేషన్ ఉపసంహరించుకోవడం, ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఇద్దరు ముఖ్యమంత్రులు అరెస్టు కావడం వంటి ఘట్టాల తర్వాత ఇక మోదీ ఘన విజయాన్ని ఎవరు ఆపగలరులే అని చాలా మంది భావించారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలు సృష్టించిన భయోత్పాతం అంతా ఇంతా కాదు. పార్లమెంట్‌లో చర్చలు లేకుండా, ప్రతిపక్షాలు లేకుండా బిల్లులు ఆమోదించడంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందనిపించింది. ఎన్నికల బాండ్లపై సుప్రీం తీర్పుతో బీజేపీ అక్రమ నిధుల వసూళ్ల గురించి జనానికి తెలిసినా పెద్దగా పట్టించుకోరేమో అనిపించింది. కాని ఆశ్చర్యకరంగా ఎన్నికల ఫలితాలను చూస్తే మోదీ మాయాజాలం చాలా మటుకు మాయమైపోయినట్లు అర్థమవుతోంది.

నిజానికి ఈ ఎన్నికల్లో ప్రతిపక్షాలు అవసరమైనంత సంఘటితంగా పనిచేయలేదు. ఇండియా కూటమి ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే ఆ పార్టీలో సీనియర్ నాయకుడు నితీశ్ కుమార్ ప్లేటు ఫిరాయించి మరోసారి బీజేపీతో చేతులు కలిపారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమి సభ్యులకు తగినన్ని సీట్లు ఇచ్చేది లేదని చెప్పేశారు. పంజాబ్‌లో కూడా కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చింది. కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపచేయడంతో ఆ సంస్థ ఆర్థికంగా బలహీనపడింది. మధ్యప్రదేశ్, హర్యానాలాంటి చోట్ల బలమైన కాంగ్రెస్ నేతల్ని బీజేపీ తన వైపునకు తిప్పుకుంది. పశ్చిమ బెంగాల్‌లో ప్రతిపక్ష పార్టీలను నిలువునా చీల్చారు. ఎన్నో బలహీనతలు, సమస్యలు, వనరుల లోపాల మధ్య కొట్టుమిట్టాడుతూ ప్రతిపక్షాలు ప్రచారాన్ని నిర్వహించాయి. మోదీ, ఆయన దళం చేసిన భారీ ప్రచారం ముందు ప్రతిపక్షాల ప్రచారం వెలవెలబోయినట్లు కనిపించింది. అయినప్పటికీ ఇవాళ బీజేపీ గత రెండు ఎన్నికల్లో మాదిరి మెజారిటీ సీట్లు సాధించలేకపోవడం, ఇండియా కూటమికీ, ఎన్డీఏకు మధ్య సీట్ల వ్యత్యాసం బాగా తగ్గిపోవడం మోదీ ఏకచ్ఛత్రాధిపత్యాన్ని జనం కోరుకోవడం లేదని అనుకోవడానికి ఆస్కారం కలిగిస్తుంది.

ఉత్తరప్రదేశ్ లాంటి బీజేపీ కంచుకోటలో సగానికి సగం సీట్లు కోల్పోవడం, అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్‌లోనే బీజేపీ అభ్యర్థి ఓడిపోవడం దేనికి సంకేతం? గతంలో కూడా బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ పరాజయం పాలైంది. అయోధ్యలో నాడు కూడా బీజేపీ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. ఇప్పుడు రామమందిర నిర్మాణం తర్వాత కూడా యూపీలో బీజేపీ ప్రాభవం తగ్గిపోవడం ఏ సంకేతాలు పంపిస్తున్నాయి? రామమందిర నిర్మాణం కల్పించిన భావోద్వేగాలు పొంగే కాని, వావు కాదని, ఈ దేశంలో మతాన్ని రాజకీయాలతో సమ్మిళితం చేయడాన్ని రాజ్యాన్ని ప్రజలు విశ్వసించడం లేదని అనుకోవాలా? లేక ప్రధానమంత్రి నరేంద్రమోదీ మతాన్ని తన స్వంత రాజకీయాలకు ఉపయోగించుకోవడాన్ని జనం హర్షించడం లేదని భావించాలా? నిజానికి మోదీ వన్ మాన్ షోను కొందరు ఆర్ఎస్ఎస్ నేతలే హర్షించలేదు. ఈ ఎన్నికల్లో మోదీకి సంపూర్ణ మెజారిటీ రాకపోతేనే మంచిదని, వస్తే తమను కూడా లెక్కచేయరని అనుకున్న ఆర్ఎస్ఎస్ పెద్దలు కూడా ఉన్నారు. ఎందుకో నాగపూర్ కూడా ఈ సారి అన్యమనస్కంగానే వ్యవహరించింది. ఆర్ఎస్ఎస్ పూర్తిగా బీజేపీని వదిలేస్తే ఈ 240 సీట్లు కూడా వచ్చేవి కావని అనుకునేవారు ఉన్నారు.

నిజానికి బీజేపీ నుంచి గెలిచిన వారిలో ఒరిజినల్ బీజేపీ నేతలకన్నా బయటి పార్టీ నుంచి వచ్చిన వారు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. ఉదాహరణకు తెలంగాణలో బీజేపీ నుంచి గెలిచిన వారిలో సగానికి పైగా ఇతర పార్టీల నుంచి వచ్చినవారే. కేరళలో సినీనటుడు సురేష్ గోపి బీజేపీ బలంతో కన్నా తన వ్యక్తిగత ఆకర్షణ ఆధారంతో గెలిచారనవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం మద్దతు లేకపోతే బీజేపీకి అసెంబ్లీలో కాని, పార్లమెంట్‌లో కాని ఒక్క సీటు కూడా వచ్చే అవకాశం లేదు. అందువల్ల మోదీ మూలంగానే బీజేపీకి ప్రాభవం ఏర్పడిందని చెప్పడానికి వీల్లేదు. 2014లో కొన్ని సామాజిక, చారిత్రక, ఆర్థిక కారణాల వల్ల భారతీయ జనతా పార్టీకి ప్రజలు పట్టం కట్టారు. పుల్వామా, బాలాకోట్ సంఘటనలు జరగకపోతే 2019లో కూడా బీజేపీకి మెజారిటీ వచ్చేది కాదని చెప్పేవారు కూడా లేకపోలేదు. 2024లో కేవలం మోదీ పేరును మార్మోగిస్తే సరిపోదని తేలిపోయింది.

ఏమైతేనేం పది సంవత్సరాల తర్వాత దేశంలో మళ్లీ సంకీర్ణ రాజకీయాలు ప్రారంభమయ్యాయి. రెండుసార్లు అఖండమైన మెజారిటీతో బీజేపీని గెలిపించినప్పటికీ మోదీ మళ్లీ దేశం సంకీర్ణ యుగంలోకి వెళ్లకుండా చేయలేకపోయారు. ఇది కూడా మంచి పరిణామమే. రాష్ట్రాల ఆకాంక్షలను విస్మరించకుండా ఉండేందుకు ఇది తోడ్పడుతుంది. నిజానికి ఈ పదేళ్లు ప్రజాస్వామికంగా, ఏకాభిప్రాయ సాధనతో పరిపాలన సాగించి ఉంటే, ప్రతిపక్షాలనూ విశ్వాసంలోకి తీసుకుని ఉంటే అన్ని వ్యవస్థల్నీ నియంత్రణలోకి తీసుకోకుండా వాటిని పారదర్శకంగా స్వేచ్ఛగా పని చేయించి ఉంటే, ఏడాదికి కనీసం ఒక్క విలేఖరుల సమావేశమైనా నిర్వహించి అరమరికలు లేకుండా మాట్లాడి ఉంటే, ప్రతిపక్షాలను అణచివేయాలన్న ఆలోచనను వదిలిపెట్టి ఉంటే మోదీ మళ్లీ భారీ మెజారిటీతో తిరిగి వచ్చేవారేమో. ఒక బలమైన వ్యవస్థ, బలమైన బావజాలం ఉన్నప్పటికీ అవి ఒక వ్యక్తి చుట్టూ తిరిగితే విజయవంతం కాలేవని ఈ ఎన్నికలు స్పష్టం చేశాయి.



నిజానికి బీజేపీ నుంచి గెలిచిన వారిలో ఒరిజినల్ బీజేపీ నేతలకన్నా బయటి పార్టీల నుంచి వచ్చిన వారు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. మోదీ మూలంగానే బీజేపీకి ప్రాభవం ఏర్పడిందని చెప్పడానికి వీల్లేదు. 2014లో కొన్ని సామాజిక, చారిత్రక, ఆర్థిక కారణాల వల్ల బీజేపీకి ప్రజలు పట్టం కట్టారు. పుల్వామా, బాలాకోట్ సంఘటనలు జరగకపోతే 2019లో బీజేపీకి మెజారిటీ వచ్చేది కాదేమో? కేవలం మోదీ పేరును మార్మోగిస్తే సరిపోదని 2024లో తేలిపోయింది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

స్వచ్ఛమైన పర్యావరణమే గొప్ప వారసత్వ ఆస్తి!

భూమిపై ఉన్న అన్ని జీవులకు పర్యావరణం ప్రాథమిక జీవన సహాయక వ్యవస్థ. ఇది సహజ, మానవ నిర్మిత భాగాల కలయిక. సహజ భాగాలలో గాలి, నీరు, భూమి, జీవులు ఉన్నాయి. రోడ్లు, పరిశ్రమలు, భవనాలు మొదలైనవి మానవ నిర్మిత భాగాలు. సహజ వాతావరణాన్ని నాలుగు ప్రధాన భాగాలుగా విభజించవచ్చు – బయోస్పియర్, లిథోస్పియర్, హైడ్రోస్పియర్, అట్మాస్పియర్. భూమిపై పొరను లిథోస్పియర్ అని పిలుస్తారు. ఇది రాళ్ళు, ఖనిజాలతో చేసిన నేల పలుచని పొర. హైడ్రోస్పియర్ సముద్రాలు, మహాసముద్రాలు, నదులు, సరస్సులు, చెరువులు మొదలైన నీటి వనరులను కలిగి ఉంటుంది. నీటి ఆవిరి, వాయువులు, ధూళి కణాలతో కూడిన వాతావరణం భూమిని చుట్టుముట్టే గాలి పొర. మానవులు, మొక్కలు, జంతువులతో కూడిన జీవ ప్రపంచం జీవగోళాన్ని ఏర్పరుస్తుంది. పర్యావరణాన్ని తయారు చేయడంలోను, విధ్వంసం చేయడంలోనూ మానవులు భారీ పాత్ర పోషిస్తున్నారు. భూమిపై అత్యున్నత మేధోశక్తిగా, మానవులు పర్యావరణ క్షేమాన్ని చాలావరకు ప్రభావితం చేస్తారు. అన్ని జీవులపై పర్యావరణ ప్రభావం మానవులు పర్యావరణంతో వ్యవహరించే విధానానికి నేరుగా అనులోమానుపాతంలో వుంటుంది. గాలి, నీరు లేదా భూమి లేకుండా ఎలాంటి ఉనికి సాధ్యం కాదు.

భూమిపై సంచరించే అన్ని రకాల ప్రాణుల ఉనికికి పర్యావరణమే ప్రాథమిక మూలం. అయితే, నేడు పర్యావరణం విపరీతంగా దోపిడీ చేయబడుతోంది. దీని కారణంగా పర్యావరణ పరిస్థితులు రోజురోజుకు అధ్వాన్నంగా మారుతున్నాయి. గాలి, నీరు మరియు భూమి కాలుష్యం, మైనింగ్, పారిశ్రామికీకరణ, ఆధునిక పట్టణీకరణ, అటవీ నిర్మూలన, రసాయన వ్యర్థాల విడుదల వంటివి పర్యావరణం క్రమంగా క్షీణించడానికి కారణమయ్యే కొన్ని ప్రధాన కారకాలు.

పర్యావరణపు వేగవంతమైన క్షీణతను తగ్గించడానికి ప్రపంచ నాయకులు కృషి చేస్తున్నారు. అలాగే ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు పర్యావరణ సమస్యలను అరికట్టడానికి ప్రజలకు అవగాహన కల్పించడానికి, చర్యలు తీసుకోవడానికి చొరవతో ముందుకు వచ్చాయి. ఈ కార్యక్రమాల్లో కొన్ని 2019 సస్టైనబుల్ డెవలప్‌మెంట్ సమ్మిట్, 2019 క్లయిమేట్ యాక్షన్ సమ్మిట్, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ కోసం 2030 ఎజెండా, పారిస్ ఒప్పందం, ఇంకా నదుల సంరక్షణ, అటవీ పెంపకం, తీర నిర్వహణ, చిత్తడి నేల పరిరక్షణ మొదలైన అనేక ఇతర కార్యక్రమాలు చేపట్టాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మొక్కుబడి కార్యక్రమాలు చేస్తున్నాయి. ప్రచార ఆర్భాటంగా పర్యావరణ దినోత్సవం రోజున కొన్ని మొక్కలు నాటుతున్నాయి. నాయకుల పర్యటనల సందర్భంగా అవి అడ్డుగా ఉంటున్నాయని అధికారులు కొన్ని చెట్లను నరికేస్తున్నారు. ఇలాంటి విధానాలకు స్వస్తి చెప్పాలి. చిత్తశుద్ధితో మొక్కలు నాటి, వాటి పోషణ భారాన్ని కూడా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో స్వీకరించాలి. కవులు, రచయితల నుండి పర్యావరణ సాహిత్యాన్ని ఆహ్వానించి, ప్రోత్సహించి పుస్తకాలుగా అచ్చేసి రేపటితరానికి అందించాలి. పర్యావరణం కేంద్రంగా పాఠ్యపుస్తకాలను రూపొందించాలి.

వన్యప్రాణులు, వివిధ జాతుల మనుగడ కోసం పర్యావరణాన్ని పరిరక్షించడం అవసరం. వాతావరణ మార్పుల వినాశకరమైన వేగంతో, కాలుష్యం – పర్యావరణ దోపిడీ ఫలితంగా, పర్యావరణానికి మరింత నష్టం జరగకుండా రక్షించే మార్గాలను కనుగొనడం మొదటి ప్రాధాన్యతగా వుండాలి. పర్యావరణాన్ని మానవ దోపిడీకి ముందున్న పూర్వ స్థితికి తీసుకురావడం చాలా ముఖ్యమైన, ఏకైక పరిష్కారం.

కొందరు తమ స్వార్థం కోసం కొండల్ని పిండి చేస్తున్నారు, చెట్లన్నీ నేల కూలుస్తున్నారు, నీటి నిల్వల్ని పీల్చేస్తున్నారు, జంతువుల్ని వేటాడి చంపుకు తింటున్నారు, పక్షుల్ని కాల్చుకు తింటున్నారు. మొత్తం పర్యావరణాన్ని దోచేసి ఆర్థిక నిల్వల్ని పెంచుకుంటున్నారు. రేపటి తరానికి అసలు పర్యావరణ పచ్చదనపు ఆనవాలు లేకుండా చేస్తున్నారు. మంచి గాలి, నీరు, భూమి, ఆహారం లేకుండా రేపటితరం ఎలా జీవించగలుగుతుంది? ఆస్తులుంటే సరిపోతుందా? పీల్చేందుకు ఆక్సిజన్ అవసరం లేదా? పర్యావరణ పరిరక్షణంతా ప్రభుత్వ బాధ్యతగానే భావించకుండా ప్రజలు కూడా తమవంతుగా కృషి చేయాల్సిన అవసరం వుంది. పచ్చని పర్యావరణాన్ని కొల్లగొట్టడం మాని, మనిషికొక మొక్కయినా నాటాలి. ఆ కోట్లాది మొక్కలు నేలపై తల ఎత్తుకు నిలబడి, మన ఆరోగ్యాన్ని అనారోగ్యం వైపునకు వాలిపోకుండా నిలబెడతాయి.

– కలిమిశ్రీ, నవ్యాంధ్ర రచయితల సంఘం
(నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోరియల్, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com




ఒంగోలులో టీడీపీ నేతల ఉత్సాహం

చరిత్ర సృష్టించిన ఏలూరి

నియోజకవర్గంలో టీడీపీ రికార్డ్ స్థాయి విజయం

హ్యాట్రిక్ సాధించిన సాంబశివరావు



ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జూన్ 4 : పర్చూరు నియోజకవర్గంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ 24,138 ఓట్లు సాధించి ఎమ్మెల్యే ఏలూరి చరిత్రను సృష్టించారు. పర్చూరు నియోజకవర్గం ఏర్పాటు అయిన తరువాత ఈ స్థాయిలో మెజార్టీ సాధించిన దాఖలాలు లేవు. కౌంటింగ్ ప్రారంభం నుంచి ప్రతి రౌండ్‌లో ఏలూరి హవా నడిచింది. రాజకీయ చైతన్యానికి ప్రతీకగా నిలిచే పర్చూరు నియోజకవర్గంలో ప్రతి ఎన్నికల్లో పోటీ నువ్వా నేనా అన్నట్లు ఉండేది. ఏ అభ్యర్థి గెలిచినా రెండు వేల ఓట్లు అటూ ఇటూ ఉండేది. అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వెంకటేశ్వరావు టీడీపీ అభ్యర్థి బాచిన చెంచు గరటయ్యపై 15,546 ఓట్లు సాధించారు. 2014లో వైసీపీ అభ్యర్థి గొట్టిపాటి భరత్‌పై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు 10,775 ఓట్లతో విజయం సాధించారు. ఈ రెండు ఎన్నికలు మినహా చెప్పుకోదగ్గ మెజార్టీ దాఖలు కాలేదు. ఈ తరుణంలో ప్రస్తుత ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఏలూరి అత్యధిక మెజార్టీలో ఓట్లు సాధించి చిత్రను కాలరాసారు.

ప్రతి మండలంలోనూ కూటమిదే హవా

పర్చూరు నియోజకవర్గంలో ఉన్న ఆరు మండలాలకు సంబంధించి ప్రతి మండలంలోనూ కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు అధిఖ్యతను ప్రదర్శిస్తూ విజయం వైపు సాగారు. మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం మండలాల్లో టీడీపీ అభ్యర్థి ఏలూరి మెజార్టీ సాధించి సత్తా చాటారు. 2014 ఎన్నికల్లో మొత్తం ఆరు మండలాలలో కూడా టీడీపీ హవానే సాగింది. తరువాత జరిగిన 2019 ఎన్నికల్లో యద్దనపూడి, పర్చూరు, కారంచేడు మండలాల్లో పూర్తిగా టీడీపీ హవా సాగింది. మార్టూరు, ఇంకొల్లు, చినగంజాం మండలాల్లో వైసీపీ అధిక్యత చూపినా విజయం మాత్రం ఏలూరికే దక్కింది. ప్రస్తుతం జరిగిన 2024 ఎన్నికల్లో ఆరు మండలాల్లో విజయం సాధించడంతోపాటు, ప్రతి మండలంలో ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థిపై అనూహ్య మెజార్టీ సాధించి ఏలూరి సత్తాచాటారు.

మార్టూరు మండలంలో ఏలూరికి భారీ మెజారిటీ

మార్టూరు, జూన్ 4 : పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వైసీపీ అభ్యర్థి బాలాజీపై మార్టూరు మండలంలో భారీ మెజారిటీ సంపాదించారు. మంగళవారం బాపట్లలో జరిగిన ఓట్ల లెక్కింపులో మండలంలో టీడీపీ అభ్యర్థికి భారీ మెజారిటీ దక్కడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2014, 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా టీడీపీకి మండలంలో ఇంత మెజారిటీ రాలేదు. 2019 ఎన్నికల్లో మండలంలో టీడీపీ, వైసీపీ కంటే 445 ఓట్లు వెనుకంజలో పడింది. ప్రస్తుత ఎన్నికల్లో ఏలూరి సాంబశివరావు మండలంలో వైసీపీపై 5398 ఓట్లు ఆధిక్యతను పొందారు. అంతేగాకుండా గత అసెంబ్లీ ఎన్నికల్లో మార్టూరుటౌన్‌లో టీడీపీ 44 ఓట్లు వెనుకంజలో ఉండగా, ప్రస్తుతం 2050 ఓట్లు ఆధిక్యతను ఏలూరి సాధించారు. టీడీపీ మండల మెజారిటీ భారీగా పెరగడానికి మార్టూరు టౌన్ మెజారిటీ సపోర్టుగా నిలిచిందని టీడీపీ శ్రేణులు బావిస్తున్నారు.

గ్రామాలవారీగా టీడీపీ మెజారిటీ

మండలంలో 16 గ్రామాలలో 14 చోట్ల టీడీపీకి వైసీపీ పార్టీపై మెజారిటీ లభించింది. వైసీపీకి కేవలం రెండు గ్రామాలలో మాత్రమే బొబ్బేపల్లి 29, లక్కవరం 73 ఓట్లు ఆధిక్యత లభించింది. ఇక టీడీపీకి మెజారిటీ పరంగా గ్రామాలైన నాగరాజుపల్లి 213, రాజుపాలెం 34, డేగరమూడి 179, మార్టూరు 2050, ద్రోణాదుల 783, చిమ్మిరి బండ 148, జొన్నతాళి 64, ఇసుకదర్శి 163, వలపర్ల 944, కోలలపూడి 356, బొల్లాపల్లి 163, తాటివారిపాలెం 20, రాజుగారిపాలెం 223, కోనంకి 160 ఓట్లు ఆధిక్యత లభించింది.

యద్దనపూడి మండలంలో 2464 మెజారిటీ

యద్దనపూడి, (మార్టూరు) జూన్ 4 : యద్దనపూడి మండలంలో పర్చూరు శాసనసభ్యునిగా తెలుగుదేశం కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన ఎమ్మెల్యే ఏలూరికి వైసీపీ పార్టీపై 2464 ఓట్లు ఆధిక్యత లభించింది. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో టీడీపీకి 779 ఓట్లు ఆధిక్యత లభించింది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపుగా గత ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ కన్న మూడు రెట్లు మెజారిటీ లభించడంతో టీడీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అనంతవరం గ్రామంలో టీడీపీకి 669 ఓట్లు ఆధిక్యత లభించింది. మండలంలో మెజారిటీ రావడంలో అనంతవరం గ్రామం సపోర్టుగా నిలిచిందని నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాలవారీగా

యద్దనపూడి మండలంలో 14 గ్రామాలు ఉండగా వాటిలో 11 చోట్ల టీడీపీకి మెజారిటీ రాగా మిగిలిన మూడు గ్రామాలలో వైసీపీకి ఆధిక్యత లభించింది. ఇక టీడీపీకి మెజారిటీ వచ్చిన గ్రామాలవారీగా సూరవరపుపల్లెలో 134 ఓట్లు, అనంతవరం 669, చింతపల్లిపాడు 391, యద్దనపూడి 198 యనమదల 234, వింజనంపాడు 74, పోలూరు 372, జాగర్లమూడి 248, గన్నవరం 311, పూనూరు 38, చిమటావారిపాలెం 120 ఓట్లు మెజారిటీ లభించింది. అదేవిధంగా వైసీపీకి శ్యామలవారిపాలెంలో 123 ఓట్లు, మున్నంగివారిపాలెంలో 90, తనుబొద్దివారిపాలెంలో 112 ఓట్లు ఆధిక్యత లభించింది.

ఎమ్మెల్యేగా ధ్రువీకరణపత్రం అందుకున్న కొండయ్య

చీరాల, జూన్ 4 : టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య తన కుమారులు గౌరీఅమర్‌నాథ్, మహేంద్రనాథ్‌లతో కలసి మంగళవారం రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణరెడ్డి నుంచి ఎమ్మెల్యే గెలుపొందినట్లు ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. ఓట్ల లెక్కింపు అననంతరం ఆర్‌వో నిబంధనల మేరకు కొండయ్యకు ఎమ్మెల్యేగా గెలుపొందినట్లు ధ్రువీకరణ పత్రం అందజేశారు. అనంతరం కొండయ్య మాట్లాడుతూ తన గెలుపునకు, కూటమి గెలుపు కృషి చేసిన, సహకరించిన పార్టీల శ్రేణులకు, నాయకులకు, కార్యకర్తలకు, శ్రేయోభిలాభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.

కృతజ్ఞతలు తెలిపిన గొట్టిపాటి

టీడీపీ కూటమికి ఘన విజయం అందించిన రాష్ట్ర ప్రజలకు, అద్దంకి నియోజకవర్గంలో 4వ సారి భారీ మెజార్టీతో తనను గెలిపించిన ప్రజలకు, టీడీపీ, జనసేన, బిజేపీ శ్రేణులకు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. తన శక్తి మేర అద్దంకి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని గొట్టిపాటి తెలిపారు.

ఆనందంలో టీడీపీ శ్రేణులు

మార్టూరు, జూన్ 4 : తెలుగుదేశం కూటమి ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు భారీ మెజారిటీతో గెలుపొందడంపై మంగళవారం మండలంలో పార్టీ నాయకులు కార్యకర్తలు, జనసేన పార్టీనాయకులు, బీజేపీ కార్యకర్తలు ఆనందంలో మునిగిపోయారు. లెక్కింపు ప్రారంభమైన నుంచీ ప్రతి రౌండ్‌లో ఏలూరికి మెజారిటీ రావడం, దానికి తోడు రాష్టంలో తెలుగుదేశం కూటమి హవా కొనసాగడంతో పార్టీ శ్రేణులు సంతోషంలో మునిగిపోయారు. శ్రేణులు కార్యకర్తలు పోలీసు నిబంధనలను అతిక్రమించకూడదని ర్యాలీలు వాటిని చేయకుండా మిఠాయిలు పంచిపెట్టుకున్నారు. మార్టూరు బద్దురాయి సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నాయకులు నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ చరిత్రలో ఈ గెలుపు లిఖించదగ్గదని నాయకులు వ్యాఖ్యానించారు. అదేవిధంగా మండలంలో ఎలాంటి గొడవలు జరగకుండా సీఐ రాజశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో గ్రామాలలో పర్యటించారు. మార్టూరు లో పెద్ద అందరు పాస్ వద్ద పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. మంగళవారం రాత్రి కూడా గ్రామాలలో పోలీసుల పర్య వేక్షణ ఉంటుందని సీఐ తెలిపారు. కార్యక్రమాలలో ఏఎస్ఐ సైదా, బాషా పాల్గొన్నారు.



నీలాయపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రేణులు

కట్టుదిట్టంగా.. ప్రశాంతంగా..



రైజ్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద పోలీస్ బందోబస్తు

భారీ భద్రత మధ్య సాగిన ఓట్ల లెక్కింపు
కలెక్టర్, ఎస్పీ నిరంతర పర్యవేక్షణ
రైజ్ కళాశాల పరిసరాలలో మోహరించిన పోలీసులు
అడుగడుగునా తనిఖీలు, ట్రాఫిక్ నియంత్రణ
జిల్లా అంతటా ఆంక్షలు.. ఒంగోలులో మరింత అధికం, సంబరాలు నిషేధం
మందకొడిగా ప్రారంభమై ఊపందుకున్న కౌంటింగ్, రాత్రి వరకు సాగిన ప్రక్రియ

ఒంగోలు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కట్టుదిట్టంగా, ప్రశాంతంగా సాగింది. ఒంగోలు నగర సమీపంలో ఉన్న రైజ్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం రోజంతా ఓట్ల లెక్కింపు కొనసాగింది. భారీగా పోలీస్ బందోబస్తు, అడుగడుగునా లోపల తనిఖీలు మొదలు నిరంతరం నిఘా, ట్రాఫిక్ మళ్లింపుతో పాటు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్ స్వీయ పర్యవేక్షణలో రాత్రివరకు ప్రక్రియ సాగింది. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ అలాగే ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సంతనూతలపాడు సెగ్మెంట్‌కు సంబంధించి పార్లమెంట్ పరిధిలోని ఓట్ల లెక్కింపును కూడా ఇక్కడ నిర్వహించారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీ ఓట్ల లెక్కింపునకు అధికారులు విడివిడిగా హాళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క హాలులో 14 టేబుళ్లను ఉంచారు. ఒక్కో టేబుల్‌కు ముగ్గురేసి సిబ్బందిని నియమించారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ఒక్కొక్క హాలుకు ఐదు టేబుళ్లను ఏర్పాటు చేసి నలుగురు సిబ్బందిని నియమించారు. గత నెల 13న పోలింగ్ జరిగిన అనంతరం ఆయా నియోజకవర్గాల నుంచి ఈవీఎంలను తెప్పించి రైజ్ కాలేజీలో స్ట్రాంగ్ రూములలో భద్రపరిచిన అధికారులు లెక్కింపు హాళ్లను వాటి పక్కనే ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో భద్రత నడుమ ఈవీఎంలను హాలులోకి తీసుకొచ్చి ఒక్కో రౌండ్‌కు 14 ఈవీఎంలను లెక్కించారు. ఉదయం 8గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్‌లను, 8.30 గంటలకు ఈవీఎంలలో ఓట్ల లెక్కింపును చేపట్టారు. తొలి రెండు రౌండ్లు కాస్తంత మందకొడిగా సాగినా అనంతరం ఊపందుకొని మధ్యాహ్నానికి సగానికి పైగా లెక్కింపు పూర్తయింది. ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి 19నుంచి 22 రౌండ్లలో లెక్కింపు సాగగా మధ్యాహ్నం మూడు గంటలకు సంతనూతలపాడు అసెంబ్లీ ఫలితాన్ని తొలిగా అధికారులు ప్రకటించారు. సాయంత్రం ఐదు గంటలకు ఒంగోలు, కనిగిరి, కొండపి, మార్కాపురం నియోజకవర్గాల ఫలితాలు వెల్లడించగా అనంతరం గిద్దలూరు, దర్శి, వైపాలెం ఫలితాలు వచ్చాయి.

ఒంగోలు పార్లమెంట్ స్థానం ఓట్ల లెక్కింపు రాత్రి వరకు సాగింది. ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు ఒకటి, రెండు చోట్ల కాస్తంత జాప్యం మినహా ఒకింత వేగంగానే సాగినా పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు కొంత మేర ఆలస్యంగా సాగింది. ఉదయం ఐదు గంటల నుంచే ఒక వైపు సిబ్బంది, మరో వైపు కౌంటింగ్ ఏజెంట్లు వందలాది మంది వచ్చారు. అప్పటికే పూర్తి బందోబస్తు చర్యలలో ఉన్న పోలీసులు వారందరినీ అడుగడుగునా తనిఖీలు చేసి లోపలకు అనుమతించారు. రైజ్ కళాశాలకు రెండు కిలోమీటర్ల దూరం నుంచే ట్రాఫిక్‌ను మళ్లించి కేవలం లెక్కింపు కేంద్రాల పాసులు ఉన్నవారినే అనుమతించారు. వారి వాహనాలకు ప్రత్యేక పార్కింగ్‌లు ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రాలు, ప్రాంగణాల్లోనూ భారీగా బ్యారికేడ్లు పెట్టి రాకపోకలు నియంత్రించారు. కలెక్టర్, ఎస్పీలు నిరంతరం ప్రాంగణంలో కలియతిరుగుతూ పర్యవేక్షిస్తూ కనిపించగా మీడియా ప్రతినిధులను మినహా ఎవ్వరిని ప్రాంగణంలోకి సెల్‌ఫోన్లను తీసుకురానివ్వలేదు. అలా రాత్రి వరకు కౌంటింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు మధ్య ప్రశాంతంగా సాగింది.

ఇదిలా ఉండగా కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఒంగోలులో ఆంక్షలు మరింత అధికంగా అమలు చేశారు. జిల్లా అంతటా 144 సెక్షన్ అమలుతోపాటు దుకాణాలు, వ్యాపార సంస్థలు మూత నుంచి ఒంగోలుకు జనం తరలిరాకుండా చర్యలు తీసుకున్నారు.



ఒంగోలు నగరంలో మూసివేసిన దుకాణాలు







ఒంగోలు నగరంలో టీడీపీ శ్రేణుల కేరింతలు

సంతనూతలపాడులో బీఎన్ ఘన విజయం

30,385 ఓట్ల మెజార్టీ కట్టబెట్టిన ఓటర్లు
అన్ని రౌండ్లలోనూ ఆధిక్యం
పలుచోట్ల వైసీపీ కోటలు బద్దలు,
నాలుగు మండలాల్లో అనూహ్య స్పందన
జిల్లాలో తొలి ఫలితంగా వెల్లడి
బీఎన్ కార్యాలయం వద్ద కోలాహలం

ఒంగోలు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బీఎన్ విజయ్‌కుమార్ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు. ఊహించిన దాని కన్నా నియోజకవర్గ ఓటర్లు అనూహ్యంగా స్పందించి 30,385 ఓట్ల భారీ మెజార్టీ కట్టబెట్టారు. వైసీపీ తరఫున బరిలో దిగిన రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జునను ఓటర్లు పూర్తిగా తిరస్కరించారు. అన్ని రౌండ్లలోను, అలాగే పోస్టల్ బ్యాలెట్‌లోను బీఎన్‌కే ఆధిక్యం లభించింది. చీమకుర్తి పట్టణ, ఆయా మండలంలోని దక్షిణ ప్రాంత గ్రామాలు, అలాగే పేర్నమిట్ట మరికొన్ని వైసీపీకి గట్టి పట్టు ఉండే కోటలు. ఈ ఎన్నికల్లో ఆ కోటలు బద్దలయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 2,14,638 మంది ఓటర్లు ఉండగా, 1,87,714 ఓట్లు పోలయాయ్యాయి. అలాగే 2,304 బ్యాలెట్ ఓట్లు వచ్చాయి. చెల్లిన 2202 బ్యాలెట్ ఓట్లలో బీఎన్‌కు 1431 ఓట్లు రాగా, నాగార్జునకు 720 మాత్రమే వచ్చాయి. ఇక ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను 19 రౌండ్లలో లెక్కింపు జరగ్గా అన్ని రౌండ్లలోను విజయ్‌కుమార్‌కే ఆధిక్యం లభించింది. విజయ్‌కుమార్‌కు మొత్తం 1,04,326 ఓట్లు రాగా, నాగార్జునకు 74,652 ఓట్లు వచ్చాయి. అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1431తో కలిసి మొత్తం మీద 30,385 భారీ మెజార్టీతో బీఎన్ గెలుపొందారు. ఒంగోలులోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో రిటర్నింగ్ అధికారి అయిన జేసీ గోపాలకృష్ణ నేతృత్వంలో ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ ఓట్లు లెక్కింపు జరిగింది. జిల్లాలోనే తొలి ఫలితంగా ఎస్ఎన్‌పాడు వెల్లడయింది. మధ్యాహ్నం 3 గంటల సమయానికి మొత్తం లెక్కింపు ప్రక్రియను పూర్తిచేసి 30,385 ఓట్ల మెజార్టీతో విజయ్‌కుమార్ గెలుపొందినట్లు ప్రకటించిన రిటర్నింగ్ అధికారి గోపాలకృష్ణ ఆ మేరకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

గత 2014, అలాగే 2019 సార్వత్రిక ఎన్నికలలో వరుసగా 1,280, 9,086 ఓట్లతో ఓటమి చెందిన బీఎన్.విజయ్‌కుమార్ ఆ ఓటములతో కుంగిపోకుండా ప్రజల మధ్యనే ఉంటూ, కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉండి పని చేశారు. నియోజకవర్గంలోని గ్రామగ్రామాన ఈ ఐదేళ్లలో అనేక మార్లు పర్యటించి ప్రజలతో మమేకమై ఆయన తిరిగి ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. మొత్తం పార్టీ క్యాడర్‌ను సమన్వయంతో నడిపించడంతోపాటు ఆర్థికపరమైన అంశాలలో ఏమాత్రం వెనుకబడకుండా సాగారు. ప్రత్యర్థిగా వైసీపీ తరఫున మంత్రి మేరుగ నాగార్జున బరిలో దిగినా ఏమాత్రం లెక్క చెయ్యకుండా తనదైన శైలిలో బీన్ ప్రచారపర్వంలో సాగిపోయారు. ఇవన్నీ ఈ ఎన్నికల్లో బీఎన్‌కు కలిసిరాగా, వైసీపీ ప్రభుత్వ తీరు, ముఖ్యమంత్రి జగన్ పోకడపై ప్రజల్లో ఉన్నా తీవ్ర వ్యతిరేకత తోడై భారీ మెజార్టీతో గెలుపొందారు. అనేకచోట్ల వైసీపీకి పట్టు ఉన్న ప్రాంతాల్లోనూ బీఎన్ భారీ మెజార్టీ సాధించారు. కాగా చీమకుర్తి పట్టణంలో మూడున్నర వేలు, ఇదే మండలంలో రెండు వేలు వెరసి ఐదున్నవేలు చీమకుర్తి మండలంలో వైసీపీకి మెజార్టీ లభించింది. అలాగే పేర్నమిట్టలోను 1800 ఓట్లకు పైగా వైసీపీకి వచ్చాయి. అయితే ఈసారి ఆ ప్రాంతంలో పరిస్థితి తల్లకిందులైంది. చీమకుర్తి మండలంలో 7,640 ఓట్లు టీడీపీ ఆధిక్యం వచ్చింది. అలాగే పేర్నమిట్టలోను ఈసాది దాదాపు 2 వేల మెజార్టీ లభించింది. ఆ రెండు చోట్లనే కాక పలు ఇతర ప్రాంతాలలోను ఆధిక్యం లభించింది. గత ఎన్నికల్లో మైనంపాడులో వైసీపీకి 500 మెజార్టీ రాగా ఈసారి టీడీపీకి 900పైగా మెజార్టీ అభించింది. సంతనూతలపాడులో గతంలో 600 వైసీపీకి మెజార్టీ రాగా, ఈసారి టీడీపీకి 800 మెజార్టీ వచ్చింది. అలాగే ఇతర గ్రామాలలోను భారీ మెజార్టీలు వచ్చాయి. పేర్నమిట్టలాంటి చోట్ల జనసేన మద్దతు బాగా లభించింది. ఆయా మండలాలు వారీగా చూస్తే టీడీపీకి పట్టు ఉండే నాగులుప్పలపాడులో దాదాపు 10వేల మెజార్టీ రాగా, సంతనూతలపాడులో సుమారు 8వేలు, చీమకుర్తిలో ఏడున్నర వేలు, అలాగే మద్దిపాడు మండలంలో ఇంచుమించు 5 వేలకు పైగా మెజార్టీ బీఎన్‌కు వచ్చింది. నియోజకవర్గంలోని అన్ని స్థాయిల్లోని కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పని చేయ్యడం కూడా భారీ మెజార్టీకి కారణంగా కనిపిస్తున్నది.



విక్టరీ సింబల్ చూపిస్తున్న దామచర్ల

ఒంగోలులో దామచర్ల భారీ గెలుపు

బాలినేనిపై 34,100 మెజారిటీ

నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల సంబరాలు

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 4 : సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్ధన్ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో విజయాన్ని సాధించారు. ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డిపై 34,100 మెజారిటీతో గెలుపొందారు. గత నెల 13న పోలింగ్ జరగ్గా, జూన్ 4వ తేదీ వరకు అటు అభ్యర్థులు, ఇటు ఓటర్లు ఉత్కంఠతతో ఎదురుచూశారు. ఇదిలా ఉండగా, స్థానిక రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో ఒంగోలు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన దామచర్ల ఊహించిన విధంగానే భారీ మెజారిటీ సాధించి విజయం కైవసం చేసుకున్నారు. మొత్తం 19 రౌండ్‌లు జరగ్గా, తొలి రౌండ్‌లో వైసీపీపై 35 ఓట్ల తేడాతో వెనుకబడ్డారు. ఆ తర్వాత జరిగిన వరుస రౌండ్‌లలో దామచర్ల తిరుగులేని ఆధిక్యతను ప్రదర్శించారు. మధ్యాహ్నం వరకు జరిగిన లెక్కింపులో ఎప్పటికప్పుడు రౌండ్‌ల ఆధిక్యతను తెలుసుకోవడంతోపాటు, నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు సంబరాలలో మునిగిపోయారు. అటు వైసీపీ శ్రేణుల్లో నిరుత్సాహానికి గురయ్యారు. పూర్తి స్థాయిలో ఫలితాలు వెలువడకముందే తెలుగు తమ్ముళ్లు సంబరాల్లో మునిగితేలారు. ఒకవైపు దామచర్లతోపాటు, ఆ పార్టీ ముఖ్య నేతలు ఒంగోలులో విజయంపై ముందే అంచనాలు వేసుకోగా, ఆధిక్యంపైపే అందరి దృష్టి నెలకొంది. ఎప్పటికప్పుడు ఎవరికి పరిధిలో వారు మెజారిటీని తెలుసుకోవడంతో ప్రతి రౌండ్‌కు ఆధిక్యం పెరగడంతో సంతోషాలలో మునిగి తేలారు. మూడో రౌండ్ ముగిసే సమయానికి దామచర్ల ఆధిక్యతలో ఉండటంతో కౌంటింగ్ కేంద్రానికి విచ్చేసిన వైసీపీ అభ్యర్థి బాలినేని పరిస్థితిపై అంచనా వేసి బయటకు వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. ఆ తర్వాత కొనసాగిన రౌండ్లలో దామచర్ల దూకుడు పెంచారు. 19 రౌండ్లకు గాను భారీ మెజారిటీ సాధించారు. ఒంగోలు నియోజకవర్గంలో మొత్తం 2,40,242 ఓట్లు ఉండగా, 2,40,143 ఓట్లు పోలయ్యాయి. దామచర్ల 34,100 మెజారిటీతో గెలుపు సాధించారు. ఇప్పటి వరకు ఒంగోలులో చరిత్రలో అత్యధిక మెజారిటీ సాధించిన తొలినేతగా దామచర్ల ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యధిక మెజారిటీ రావడంతో నియోజకవర్గంలో ప్రజలు అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బీఎన్‌కు స్వీటు తినిపిస్తున్న నేతలు

కడుపు'మంట'!

బైక్‌ను తగులబెట్టి వైసీపీపై కసి తీర్చుకున్న వ్యవసాయ కూలీ

పందిళ్లపల్లి (చీరాలటౌన్), జూన్ 4 : అసెంబ్లీ ఫలితాలను చూసి ఓ వ్యవసాయ కూలీ తన బైక్‌ను తగులబెట్టి వినూత్న రీతిలో హర్షం వ్యక్తం చేశాడు. టీడీపీ విజయంతో ఆనందం, వైసీపీపై తనకున్న వ్యతిరేకతను ఈ విధంగా ఆయన తెలియజేశారు. ఈ ఘటన బాపట్ల జిల్లా వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి ప్రధాన రహదారిలో మంగళవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. వైసీపీపై తీవ్ర అసంతృప్తి చెందిన ప్రజలు ఊహించని విధంగా టీడీపీ కూటమికి భారీ మెజారిటీని కట్టబెట్టారు. ఫలితాలు వెలువడిన అనంతరం పందిళ్లపల్లికి చెందిన పెద్దిరెడ్డి శ్రీనివాసరెడ్డి నేరుగా ప్రధాన రహదారి మీదకు చేరుకున్నారు. ఒక్కసారిగా అక్కడ తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి స్వయంగా దహనం చేశారు. అక్కడే నిల్చొని జైచంద్రబాబు, జైపవన్ కల్యాణ్ అంటూ నినాదాలు చేశారు. ఆయన ప్రభుత్వంపై అంత వ్యతిరేకతను తెలియజేస్తూ తన వాహనాన్ని సైతం తగులబెట్టుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

మహిళా మార్ట్ బోర్డు తొలగింపు

అద్దంకి, జూన్ 4 : పేదలకు కడుపు నిండా అన్నం పెట్టిన అన్న క్యాంటీన్‌ను వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మూసివేశారు. అంతటితో ఆగకుండా అన్న క్యాంటీన్ బోర్డును జగనన్న మహిళా మార్ట్‌ను ప్రారంభించారు. ఈనేపథ్యంలో టీడీపీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో టీడీపీ శ్రేణులు ఆగ్రహం ఆపుకోలేక మంగళవారం మహిళా మార్ట్‌కు ఉన్న బోర్డును తొలగించేందుకు ప్రయత్నించారు. జగనన్న మహిళా మార్ట్‌ను ఖాళీ చేసి అన్న క్యాంటీన్‌కు కేటాయించాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న సీఐ కృష్ణయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో టీడీపీ నేతలు వెళ్లిపోయారు.